మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 83 • పేజీలు:12+16 • వెల: రూ.5 | బుధవారం • 21-2-2018 | www.manamnews.com | /manamnews



11 బ్యాంకు ఖాతాలు

ఎటాచ్

- 'రోటోమాక్' కొఠారీపై ఐటీ శాఖ కొరడా
- ఆదాయ పన్ను ఎగవేత ఆరోపణలు
- రూ.85 కోట్ల రికవరీ కోసమే ఖాతాల స్తంభన
- కొఠారీ తీసుకున్న రుణం రూ.2919 కోట్లు
- వడ్డీతో కలిపి ఇప్పటికి రూ.3695 కోట్లు
- విక్రమ్‌పై మనీలాండరింగ్ కేసు పెట్టిన ఈడీ

7లో..

కోల్ ఇండియా క్లోజ్!



బొగ్గు గనుల ప్రైవేటీకరణకు ప్రభుత్వం ఓకే

- ప్రతిపాదనకు సీసీఈఏ సమావేశం ఆమోదం
- ప్రభుత్వరంగ సీఐఎల్ గుత్తాధిపత్యానికి స్వస్తి
- జాతీయం చేసిన 47 ఏళ్ల తర్వాత సంస్కరణ
- గనులు.. క్షేత్రాల వేలం ప్రక్రియకు అంగీకారం
- పోటీతత్వానికి బీజం పడుతుంది: పీయూష్
- లక్షలాదిగా ప్రత్యక్ష.. పరోక్ష ఉద్యోగావకాశాలు
- పెద్ద.. చిన్న... మధ్యతరహా గనులన్నీ వేలం
- కేంద్ర మంత్రిమండలి భేటీలో తీర్మానాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:

దేశంలో బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కేంద్రం తెరతీసింది. ఈ శిలాజ ఇంధన రంగాన్ని 1973లో జాతీయం చేసింది మొదలు ఇప్పటిదాకా కొనసాగిన ప్రభుత్వ అజమాయిషీ ఇక మిగతా 6లో..

కార్మికుల నోట్లో 'బొగ్గు'

సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకం

- గనుల ప్రైవేటీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం
- ఇది దుర్మార్గం.. కార్మికుల భవిష్యత్తుపై గొడ్డలివేటు
- కేంద్రం నిర్ణయంపై కార్మిక సంఘాల ఆగ్రహం

2లో..



దేశమంతటికీ ఒకే ట్రైబ్యునల్

జాతీయ స్థాయిలో ఏర్పాటు



- ఈ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు
- నదులవారీ ట్రైబ్యునళ్లకు చెల్లుచీటీ
- జల జగడాలు అభివృద్ధికి ఆటంకం
- ఆ వివాదాలకు చరమగీతం పాడాలి
- కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ సూచన
- ముగిసిన దక్షిణాది జలమంత్రుల భేటీ
- గోదావరిలో నీటి లభ్యత తర్వాతే అనుసంధానం
- సమావేశంలో గట్టిగా వాదించిన మంత్రి హరీశ్
- ఏపీ ఆరోపణలకు దీటైన జవాబులు
- పొరుగు రాష్ట్రానికి కేంద్ర మంత్రి చురకలు
- తెలంగాణ అభివృద్ధి చెందితే మంచిదే కదా?
- ఇదేం పాకిస్థాన్ కాదు కదా?: మేఘ్వాల్

6లో..

నేడే కమల్ అరంగేట్రం

- మదురైలో పార్టీ ప్రకటన..
- బహిరంగ సభకు కేజ్రీవాల్
- రజనీకాంత్‌కూ ఆహ్వానం

7లో..

ఇదీలోకం!



నీకు తెలియదు.. కొందరు మానవులు మహా క్రూరులు.. ఎటు వెళ్లినా ఒంటరిగా మాత్రం వెళ్లకు సుమా..!



ఉత్తమ్‌తో భేటీ అయిన మంద కృష్ణమాదిగ

డిసెంబరులోనే ఎన్నికలు!

ముందస్తు నిర్వహణ ఖాయం

- ఎంఐఎంపై అన్ని చోట్లా పోటీ
- డీసీసీ అధ్యక్షులకు నో టికెట్
- కేసీఆర్‌కు ఇవే ఆఖరి ఎన్నికలు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో ఉత్తమ్

3లో..

మెట్రో వేగం పెంచండి

సర్వీసుల సంఖ్యనూ పెంచాలి.. కనెక్టివిటీకి 100 ఎలక్ట్రిక్ బస్సులు

- సాధ్యాసాధ్యాలను పరిశీలించండి
- రెండో దశను వేగవంతం చేయండి: కేటీఆర్
- చెన్నైతో పోలిస్తే మనదే అద్భుతం
- ప్రయాణికుల సంఖ్య బాగుంది: ఎన్వీఎస్ రెడ్డి
- 12 మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయాలు
- త్వరలో టెండర్లు.. అధికారుల వెల్లడి



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి):

మెట్రో రైళ్ల వేగాన్ని పెంచి ప్రయాణ సమయాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని మంత్రి కేటీఆర్ సూచించారు అలాగే.. రైళ్ల సర్వీసుల సంఖ్యను కూడా పెంచాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు మిగతా 6లో..

తప్పంతా మీదే!

- రుణాలు చెల్లించడం నా వల్ల కాదు!
- చేతులెత్తేసిన వజ్ర బేహారి నీరవ్ మోదీ
- మీరిచ్చిన అప్పులు 5,600 కోట్ల లోపే
- మీకు కోట్లలో వడ్డీలు ముట్టలేదా?
- నా పరువు తీసి.. సర్వనాశనం చేశారు
- మీ అత్యుత్సాహంతో దుస్థితిలోకి నెట్టారు

7లో..

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో బుధవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతలో మార్పులేదు. రాత్రి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. చలిగాలుల తీవ్రత కొనసాగుతుంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 33 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 19 డిగ్రీలు

గాలిలో తేమ: 54 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి తె.3.51 తదుపరి సప్తమి; నక్షత్రం: అశ్విని మ.1.59 తదుపరి భరణి; వర్జ్యం: ఉ.10.00–11.36, మ.3.34–5.08; దుర్ముహూర్తం: మ.12.07–12.53; రాహుకాలం: మ.12.30–1.57; అమృతఘడియలు: ఉ.6.50–8.26; శుభసమయం: మ.1.58–3.00.

సూర్యోదయం: 6.43

సూర్యాస్తమయం: 6.17

మనమే నెంబర్ 1



కోహ్లీ.. బుమ్రా.. టీమిండియా

ముగ్గురివీ ప్రథమ స్థానాలే

ఐసీసీ వన్డే ర్యాంకుల ప్రకటన

టీమిండియా దుమ్మురేపింది. మ్యాచ్‌లు గెలవడంలోనే కాదు.. ర్యాంకులలో కూడా అగ్రగామిగా నిలిచింది. ఐసీసీ తాజా వన్డే ర్యాంకులలో భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌లో అగ్రస్థానం సాధించాడు. ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలర్లలో టాప్ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. ఇటీవలే దక్షిణాఫ్రికాపై సిరీస్ గెలుచుకున్న టీమిండియా కూడా శిఖరాగ్రాన నిలిచింది. వీటితోపాటు లెగ్ స్పిన్నర్ యజువేంద్ర చాహల్ కూడా బౌలర్లలో టాప్‌టెన్ ర్యాంకులలోకి ఎగబాకాడు. 16 వికెట్లతో దక్షిణాఫ్రికా వెన్ను విరవడంతో అతడికి 8వ ర్యాంకు దక్కింది.

ఓ జిల్లా బదులు మరో జిల్లాలో!

టీఆర్టీ హాల్ టికెట్లలో గందరగోళం

- పరీక్ష కేంద్రాల కేటాయింపుపై దుమారం
- హాల్ టికెట్ల జారీ నిలిపేసిన టీఎస్‌పీఎస్సీ
- సెంటర్ల మార్పుతో త్వరలో కొత్త హాల్ టికెట్లు
- పరీక్ష వాయిదా వార్తల్లో నిజం లేదు: అధికారులు



హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి):

టీఆర్టీ పరీక్షకు ఓ జిల్లాలో పరీక్ష కేంద్రాన్ని అభ్యర్థులు ఎంచుకుంటే.. హాల్‌టికెట్లలో మాత్రం మరో జిల్లా వచ్చింది. దాంతో.. అభ్యర్థులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. అదే సమయంలో టీఎస్‌పీఎస్సీ తీరుపై అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న సమయంలో అభ్యర్థులు ఎంచుకున్న జిల్లాలో కాకుండా ఇతర జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయిస్తూ బోర్డు హాల్‌టికెట్లు జారీ మిగతా 6లో..

ప్రతీకారంతో పాము తల కొరికి నమిలేశాడు



లఖ్‌నవూ, ఫిబ్రవరి 20: నన్నే కాటేస్తావా అంటూ ప్రతీకారంతో రగిలిపోయిన ఓ వ్యక్తి, పాముపై ఎదురు దాడికి దిగి, దాని తలను కొరికి.. నమిలేశాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హర్దోయ్‌లో ఈ విచిత్రమైన సంఘటన జరిగింది. శనివారం సాయంత్రం సోనెలాల్ అనే వ్యక్తి తన పశువులు కాస్తుండగా ఓ పాము కాటేసింది, దీంతో తనను కాటేసిన పామును కోపంతో కొరికేసినట్టు, నమిలిన తరువాత ఉమ్మేసినట్టు స్వయంగా అతను వెల్లడించాడు. స్థానిక వైద్యులు చికిత్స చేసిన తరువాత స్పృహలోకి వచ్చిన అతను జరిగిన విషయాలను వివరించగా, అది విన్న వారంతా షాక్ తిన్నారు. కానీ అతని శరీరంపై ఎక్కడా పాము కాటే లేదని వైద్యులు తేల్చారు. అయితే పాము తనను కాటేసిందని భావించిన అతను పాముపై ఆగ్రహాన్ని ప్రదర్శించాడని వైద్యులు స్పష్టం చేశారు. ఈ విషయం విన్న స్థానికులు నోరెళ్లబెడుతూ, అసలు ఇదెలా సాధ్యమని ఆశ్చర్యపోతున్నారు. మరోవైపు అతని మానసిక స్థితి సరిగ్గా లేనందునే ఇలా ప్రవర్తించాడని ప్రభుత్వ మానసిక వైద్యులు తేల్చారు.

'మోడల్' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- స్కూల్ డైరెక్టరేట్ ముట్టడికి పలు సంఘాల మద్దతు



హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): మోడల్ స్కూల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ టీఎస్‌యూటీఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మోడల్ స్కూల్ ఉద్యోగులు చేసిన ఆందోళనకు టీఎస్ యూటీఎఫ్ మద్దతిచ్చింది. ఈమేరకు సంఘం ప్రధాన, రాష్ట్ర కార్యదర్శులు చావా రవి, నర్సిరెడ్డి, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బి.కొండయ్య ఆధ్వర్యంలో ఉద్యోగులు నిర్వహించిన పాఠశాల డైరెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ మోడల్ స్కూల్స్ ప్రారంభించి ఐదేండ్లు గడుస్తున్నా.. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. గతంలో ఎంఎస్‌టీఎఫ్ నిర్వహించిన ధర్నాలు, దీక్షలకు స్పందించిన ప్రభుత్వం పీఆర్సీ, సెలవుల నిబంధనలు అమలు చేసిందని గుర్తుచేశారు. క్షేత్ర స్థాయిలో ఇంకా అనేక సమస్యలు తాండవిస్తున్నాయని, వాటిని పరిష్కరించకుండా తాత్సారం చేస్తే భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చావా రవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్యను అందిస్తోన్న మోడల్ పాఠశాలల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య మాట్లాడుతూ ముట్టడిని విజయవంతం కాకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని దుయ్యబట్టారు.

26న సీఎం కరీంనగర్ పర్యటన

కరీంనగర్, ఫిబ్రవరి 20(మనం న్యూస్): రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 26వ తేదీన కరీంనగర్‌లో జిల్లాలో పర్యటించనున్నారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జరిగే రైతు సదస్సులో ఆయన పాల్గొంటారు. సీఎం పర్యటన ఖరారు కావడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, ఇతర అధికారులు మంగళవారం స్టేడియం పరిసరాలను పరిశీలించారు.

ఎమ్మెల్సీల కాళేశ్వరం సందర్శన

- ఈ నెల 23, 24న స్టడీ టూర్

హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కాళేశ్వరం త్వరలో పూర్తికానున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షించేందుకు ఎమ్మెల్సీల బృందం పర్యటించనుందని చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 23, 24 తేదీలలో ఎమ్మెల్సీల బృందం పర్యటిస్తుందని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా ఈ పర్యటనలో పాల్గొనాలంటూ మండలి చైర్మన్ స్వామి గౌడ్ అందరినీ ఆహ్వానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎమ్మెల్సీలకు అవగాహన కోసం ఓ స్టడీ టూర్‌లా ఈ పర్యటన ఉపయోగపడుతుందని స్వామి గౌడ్ మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లగా.. మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ నెల 23న ఉదయం హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీలంతా బయలుదేరి కాళేశ్వరం ప్రాజెక్టు ప్రధాన ప్యాకేజీల పనులన్నింటిని పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. 23న రాత్రికి కాళేశ్వరంలో బస చేసి 24న ప్రాజెక్టు పనులు జరుగుతున్న మిగతా ప్రాంతాల్లో పర్యటిస్తారని చైర్మన్ వివరించారు. మండలి చైర్మన్ స్వామి గౌడ్ నేతృత్వంలో ఎమ్మెల్సీలందరూ స్టడీ టూర్‌కు వెళ్తుండడం ఇదే ప్రథమమని చీఫ్ విప్ పాతూరి పేర్కొన్నారు.



వేసవిలోగా ప్రతీ గ్రామానికీ తాగునీరు

- ఇప్పటికే పూర్తయిన భగీరథ పనులు: వేముల

హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): ఇంటింటికీ తాగునీరందించే బృహత్తర లక్ష్యంతో ప్రారంభించిన మిషన్ భగీరథ పూర్తి కావొచ్చిందని ప్రాజెక్టు వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. వేసవిలోగా ఈ పథకం ద్వారా నీరందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించి ప్రధాన పనులన్నీ పూర్తయ్యాయని వివరిస్తూ.. ఇంట్రా పనులపై ప్రస్తుతం దృష్టిసారించామని తెలిపారు. సీఎం కేసీఆర్ సూచన మేరకు బల్క్ సరఫరా ప్రారంభించాక ఇంట్రా పనులు పూర్తిచేయడానికి వర్క్ ఏజెన్సీల సహకారం తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఈమేరకు మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మిషన్ భగీరథ పనులపై వేముల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంట్రా పనులకోసం ప్రత్యేకంగా ఆర్‌డబ్లుఎస్‌ఎస్ ఈఈలు ఉన్నందున పనుల్లో మరింత వేగం చూపించాలని ఆయన చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. స్థానిక భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ఓహెచ్‌ఎస్‌ఆర్ నమూనాలను మార్చుకునేందుకు ప్రభుత్వం ఇదివరకే అనుమతిచ్చిందని గుర్తుచేశారు. ఇక డబుల్ బెడ్‌రూం కాలనీలు వచ్చే ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు అవసరమైన ప్రణాళికను ముందే తయారు చేయాలన్నారు. మెటీరియల్ సరఫరాలో ఉన్న ఇబ్బందులను తొలగించామని, అవసరమైనంత తెప్పించుకోవాలన్నారు. ఇంట్రా పనుల్లో ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రతీ ఇంటికి నల్లాతో నీరు సరఫరా అయినప్పుడే సీఎం కేసీఆర్ స్వప్నం సాకారం అవుతుందన్నారు. కాగా, ఈ వేసవికి ప్రతీ గ్రామానికి భగీరథ నీళ్ల సరఫరా అవుతాయని ఆర్‌డబ్ల్యూఎస్‌ఎస్ కార్యదర్శి స్మితాసభర్వాల్ స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో వేసవిలో నీటి కొరతను తీర్చేందుకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయడంలేదని పేర్కొన్నారు.

వీధి వ్యాపారులకు వెండింగ్ సర్టిఫికెట్లు

- హైకోర్టుకు తెలంగాణ ప్రభుత్వ వివరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం లీగల్ ప్రతినిధి): స్ట్రీట్ వెండింగ్ స్కీం చట్టం ప్రకారం త్వరలో రాష్ట్రంలోని వీధి వ్యాపారులకు 'వెండింగ్ సర్టిఫికెట్ల'ను జారీ చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈమేరకు హైకోర్టుకు వివరణ ఇచ్చింది. స్ట్రీట్ వెండింగ్ స్కీంను అమలు చేయడంలేదంటూ దాఖలైన పిటిషన్‌కు కౌంటర్ దాఖలు చేస్తూ ఈ వివరాలను వెల్లడించింది. హైదరాబాద్ మహానగరంతోపాటు తెలంగాణ అంతటా వీధి వ్యాపారులు 67,313 మంది ఉన్నట్లు ప్రభుత్వం లెక్క తేల్చింది. వారిలో 63,372 మందికి గుర్తింపు కార్డులు కూడా జారీచేసింది. మిగిలిన 3,941 మందికి కూడా త్వరలోనే గుర్తింపు కార్డులు ఇవ్వనుంది. వీధి వ్యాపారులు ఎక్కడెక్కడ వ్యాపారం చేసుకోవాలో నిర్దేశిస్తూ వెండింగ్ జోన్లను కూడా ప్రభుత్వం నిర్ణయిస్తుంది. రాష్ట్రంలోని మున్సిపల్ ఏరియాల్లో చట్ట ప్రకారం టౌన్ వెండింగ్ కమిటీలను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ మహానగరంలో 30 సర్కిళ్లు ఉన్న నేపథ్యంలో ఇక్కడ ఇంకా వెండింగ్ కమిటీలను ఏర్పాటు చేయలేదు. గతంలో ఉన్న 18 సర్కిళ్ల కు కమిటీలను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం వివరించింది. కొత్తగా ఏర్పడిన సర్కిళ్లకు త్వరలోనే కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం వివరించింది. హైదరాబాద్ తోపాటు రాష్ట్రంలోని ఇతర మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో సర్వే పూర్తయిన తరువాత స్ట్రీట్ వెండింగ్ ప్లాన్‌ను సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 66 స్థానిక సంస్థల్లో సర్వే పూర్తయిందని, మిగిలిన చోట్ల త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీధి వ్యాపారుల(జీవనోపాధి పరిరక్షణ, వీధి వ్యాపార నియంత్రణ) చట్టానికి అనుగుణంగా రాష్ట్రం రూపొందించిన స్ట్రీట్ వెండింగ్ స్కీమ్ ను అమలుచేయడం లేదంటూ జి.గణేశ్ సింగ్ అనే వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో హైకోర్టు.. వీధి వ్యాపారులకు చెందిన వివరాలు అందజేయాలని మున్సిపల్ శాఖను ఆదేశించింది.


కార్మికుల నోట్లో 'బొగ్గు'

- సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకం
- గనుల ప్రైవేటీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం
- ఇది దుర్మార్గం.. కార్మికుల భవిష్యత్తుపై గొడ్డలివేటు
- కేంద్రం నిర్ణయంపై కార్మిక సంఘాల ఆగ్రహం
- పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరికలు




హైదరాబాద్, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి): బొగ్గుబాయిల ప్రైవేటీకరణ లేదంటూనే బొగ్గు గనుల వేలానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం పట్ల కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి. ''మన సంపద మనకే చెందాలి. ప్రజల సంపద ప్రజలకే అనే దాంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం 1973లో గనులను జాతీయం చేసింది. మన సంపద పాలకులకు, మల్టీనేషనల్ కంపెనీలకు అన్నట్టుగా కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల ప్రయివేటీకరణకు పచ్చజెండా ఊపటం అన్యాయం'' సింగరేణి కాలరీస్ కంపెనీలోని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం నిర్ణయంతో సింగరేణి భవిష్యత్తుపై నీలినీడలు చోటు చేసుకునే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2000 సంవత్సరంలో బొగ్గు గనులకు పుట్టినిల్లు అయిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇల్లెందు ఏరియాలో ప్రయివేటీకరణకు బీజం పడింది. ఏరియాలోని కోయగూడెం ఓపెన్‌కాస్ట్‌లో సర్ఫేస్ మైనర్ యంత్రంతో బొగ్గు తవ్వకాలకు ప్రయివేటు వారికి అనుమతి ఇవ్వటంపై నెల రోజులకు పైగా కార్మిక సంఘాలు సింగరేణిలో సమ్మె చేపట్టాయి. అయినా కార్మిక సంఘాల మాటలను వింటున్నట్టుగానే నటిస్తూ పాలకులు దశలవారీగా ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టారు. నిన్నమొన్నటి దాకా 10 శాతం ఆస్తులను వేలం వేస్తామని చెప్పిన పాలకులు ఇప్పుడేమో గనులను ప్రైవేటీకరించేందుకు రంగం సిద్దం చేయటం అన్యాయమని కార్మికులు వాపోతున్నారు.





ఇక కమర్షియల్ మైనింగ్

2015 మార్చిలో ప్రైవేటీకరణ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిన క్రమంలో దానికి వ్యతిరేకంగా సమ్మె నోటీస్ ఇచ్చాం. అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జనవరిలో ఐదు రోజుల సమ్మెకు పిలుపినిచ్చాయి. రెండు రోజుల సమ్మె అనంతరం కేంద్రం హామీ ఇచ్చిందని విత్‌డ్రా చేసుకున్నారు. రాతపూర్వకంగా హామీ ఇవ్వలేదని సీఐటీయూ ఒప్పందం చేసుకోలేదు. కమర్షియల్ మైనింగ్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం అన్యాయం. బొగ్గు గనుల వేలంతో బొగ్గు మాఫియా పెరుగుతోంది. వేజ్‌బోర్డులుం డవు. తమకిష్ట మున్నంత జీతం ఇస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటారు. లాభాల్లో ఉన్న కోల్ ఇండియాను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. సహజ వనరుల దోపిడీకీ వ్యతిరే కంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది.



- మందా నర్సింహారావ్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

దుర్మార్గమైన చర్య

బొగ్గు గనుల ప్రయివేటీకరణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటం దుర్మార్గమైన చర్య. మన ఆస్తులను, ఖనిజాలను దోపిడీ చేయటం కోసమే గనులను ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోంది. గనుల ప్రైవేటీకరణతో ఉద్యోగాలు పెరగవు. పర్మినెంట్ ఉద్యోగాలుండవు. బొగ్గు మాఫియాదే ఇష్టారాజ్యంగా మారుతోంది. లెక్కలు సరిగా చెప్పరు. లాభాల కోసమే పనిచేస్తారు. 1973లో బొగ్గుగనులను జాతీయం చేస్తే ఇప్పుడేమో దోపిడీకి తెర లేపారు. వేజ్‌బోర్డులుండవు. వేతనాలూ పెరగవు. మన సంపదను ప్రైవేటు వారికి అప్పగించేందుకే ఈ కుట్ర. పది శాతం ప్రయివేటీకరణ అన్నారు. ఇప్పుడేమో ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేపడుతున్నారు. రూ. కోట్లలో కమిషన్ కోసం బాయిలను అమ్మేస్తారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో డబ్బుల కోసం ప్రభుత్వం కుట్ర. కేంద్రం తీరును తీవ్రంగా నిరసిస్తాం. ఉద్యమాలు చేస్తాం

-మిర్యాల రంగయ్య, సింగరేణి కాలరీస్ వర్కర్స్‌యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి

ఎన్నికల్లో డబ్బు కోసమే..

బొగ్గు గనులను అమ్ముకునేందుకే కేంద్రం ఈ కుట్రకు తెరలేపింది. గనులను అమ్ముకుంటే ఎక్కువ డబ్బులు వస్తాయి. ఎన్నికల్లో గెలిచేందుకు ఈ డబ్బులు ఉపయోగపడతాయి. ఈ ఉద్దేశంతోనే బొగ్గు గనులను ప్రైవేటీకరణకు పాలకులు సరికొత్త కుట్ర తెరపైకి తీసుకువస్తున్నారు. ప్రపంచబ్యాంకు ఆదేశాలను కాంగ్రెస్ కన్నా బీజేపీ ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోంది. ప్రైవేటీకరణతో ప్రజలకు ఒరిగేదేమీ లేదు... పాలకులు పెద్దమొత్తంలో సంపాదించుకోవటం తప్ప. వాళ్ల ప్రయోజనమే. కార్మిక హక్కులుండవు. కనీస వేతనాలకు దిక్కుండదు. సుప్రీంకోర్టు ఆదేశాలకే దిక్కులేకుండా పోవడం దారుణం.

-ఎస్వీ, ఇఫ్టూ జాతీయ అధ్యక్షులు

కార్మికవర్గం భవిష్యత్తుపై గొడ్డలి వేటు



బొగ్గు గనుల ప్రైవేటీకరణ కార్మిక వర్గం భవిష్యత్తుపై గొడ్డలిపెట్టులాంటిది. ప్రస్తుతం నామమాత్రంగా అమలులో ఉన్న కార్మిక చట్టాలు ప్రైవేటీకరణతో హక్కులనే మాటే ఉండవు. ప్రయివేటుతో బొగ్గు గనుల చట్టానికి తూట్లు పడుతయి. వేతనాలుండవు, కార్మికులను బిచ్చగాళ్లుగా మార్చేందుకే కేంద్రం ప్రైవేటీకరణ కుట్ర పన్నుతోంది. ఆత్మగౌరవంగా గనుల చట్టం ఏర్పడిన నాటికి ముందు పరిస్థితులు పునరావృతం కానున్నాయి. గనుల ప్రయివేటీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

-కెంగర్ల మల్లయ్య, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి

సమస్యలపై స్పందించకపోతే..
సీఎస్, డీజీపీని ఢిల్లీకి పిలుస్తాం!

- ఎస్సీ జాతీయ కమిషన్ చైర్మన్ వెల్లడి
- హైదరాబాద్‌లో ఎస్సీ సంఘాలతో భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): దళితుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం స్పందించకపోతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు డీజీపీని ఢిల్లీకి పిలిపిస్తామని ఎస్సీ జాతీయ కమిషన్ చైర్మన్ రాంశంకర్ కతారియా అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా తాజ్‌డెక్కన్ హోటల్‌లో మంగళవారం సాయంత్రం ఎస్సీ సంఘాలతో ఆయన సమావేశం నిర్వహించారు. అంబేద్కర్ స్ఫూర్తితో దళితుల అభివృద్ధి జరగాలని ఆయన ఆకాంక్షించారు. దళితుల సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వం పక్కదారి మళ్లించడంతో పాటు రాష్ట్రంలోని పలు సమస్యలను స్థానిక సంఘాల నేతలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం స్పందించటంలేదని, పోలీసులు ఎమ్మెల్యేలు, ఎంపీల ఒత్తిడితో నీరుగారుస్తున్నారనే విషయాన్ని నేతలు తనకు వివరించారన్నారు. విచారణ పేరుతో జాప్యం చేయడం సబబుకాదన్నారు. కీలక పదోన్నతుల విషయంలో ప్రభుత్వం వివక్ష చూపుతుందని సంఘాల నాయకులు తనకు చెప్పారన్నారు. దళితుల పేర ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు పొంది క్రిస్టియన్లుగా(ఎస్సీల నుంచి కన్వర్టెడ్ క్రిస్టియన్) ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలపై చర్యలు తీసుకోవాలని, వారి సర్టిఫికెట్లు రద్దు చేయాలన్న డిమాండ్‌ను పరిశీలిస్తామన్నారు. దళితులు తమ సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని, దళితులకు న్యాయం చేసేందుకే ఎస్సీ కమిషన్ ఉందన్నారు. వర్గీకరణ విషయాన్ని ఎక్కువమంది తమ దృష్టికి తీసుకవచ్చార న్నారు. ఈ వినతులను పరిశీలించి బుధవారం ప్రభుత్వంలోని వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కమిషన్ చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని తెలిపారు. ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు కె.రాములు మాట్లాడుతూ దళిత సమస్యలపై కమిషన్ స్పందిస్తుందన్నారు. దళితుల సమస్యలపై సమగ్రంగా చర్చిస్తామన్నారు. కాగా, దళితుల సమస్యల పరిష్కారంకోసం ఎస్సీ జాతీయ కమిషన్ 2 రోజుల పర్యటనకు గానూ మంగళవారం రాష్ట్రానికి వచ్చింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో దళితుల కోసం అమలవుతున్న సంక్షేమ పథకాలు, నిధుల వినియోగంతో పాటు అంశాలపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కమిషన్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సమావేశంలో కమిషన్ డైరెక్టర్ కరుణాకర్, మేనేజింగ్ డైరెక్టర్ భూక్యా లచ్చీనాయక్, సభ్యుడు ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి కేవలం ముగ్గురంటే ముగ్గురే ఎస్సీ ఎమ్మెల్యేలు సంపత్‌కుమార్, తాటికొండ రాజయ్య, దుర్గం రమేశ్ మాత్రమే హాజరుకావటం గమనార్హం!



ఎస్సీ కమిషన్ భేటీ దృశ్యం

సీఎంపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి: సంపత్

సీఎం కేసీఆర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. ఎస్సీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. దళితుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించిన ప్రభుత్వాన్ని ముద్దాయిగా చేయాలని డిమాండ్ చేశారు. దళితుల నిధుల కేటాయింపులో ప్రభుత్వం కోత విధిస్తుందన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం దళిత వ్యతిరేక ప్రభుత్వంగా మారిందని ఆరోపించారు. దళితుల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. వర్గీకరణ విషయంలోనూ సీఎం కేసీఆర్ మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని ఆరోపించారు. దళితులకు మూడెకరాల భూ పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందన్నారు.

కయ్యానికి కాలుదువ్వుతున్న ఏపీ

- ఫిల్మ్, టీవీ అండ్ థియేటర్ ఆర్ట్స్ అభివృద్ధి సంస్థ భవనంలో ఏపీ వాటా అంటూ అమ్మకానికి యత్నం
- ఎనిమిది మంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు
- అత్యవసర సమావేశం పెట్టిన తెలంగాణ సీఎస్ జోషి

హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న వివాదాస్పద నిర్ణయం ఇరు రాష్ట్రాల మధ్య అగ్గి రాజేశాలా కనిపిస్తుంది. హైదరాబాద్‌లోని ఏసీ గార్డ్స్‌లో ఉన్న ఫిల్మ్, టీవీ అండ్ థియేటర్ ఆర్ట్స్ అభివృద్ధి సంస్థ భవనంలో తన వాటా విక్రయం పేరుతో ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వివాదంగా మారింది. భవనం అమ్మకానికి ఎనిమిది సభ్యులతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ ఏపీ ప్రభుత్వం మంగళవారం జీవో కూడా జారీ చేసింది. ఏపీఎస్ఎఫ్టీవీటీడీసీ, ఆంధ్రప్రదేశ్ పునవ్యవస్థీకరణ చట్టం 2014 షెడ్యూల్ 9 సంస్థ తరపున విడుదల చేశారు. అయితే, విభజన చట్టంలో చెప్పినట్లు కేంద్రం ఇంకా దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అయినా ఇక్కడి భూభాగంలోని భవనాన్ని అమ్మకానికి పెట్టి... లేని వివాదాన్ని సృష్టించాలని ఆంధ్రప్రదేశ్ సర్కారు భావిస్తుంది. అయితే, ఏపీఎస్ఎఫ్టీవీటీడీసీ సంస్థ భవనం అమ్మకం చట్ట విరుద్ధమని, ఏపీ సర్కారు చేస్తున్న ప్రయత్నాన్ని తిప్పికొడతామని తెలంగాణ అధికారులు అంటున్నారు. కాగా, ఏపీ సర్కారు తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై తెలంగాణ ప్రభుత్వం అసహనం వ్యక్తం చేసింది. ఏపీ సర్కారు జారీ చేసిన జీవో గురించి తెలుసుకున్న తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన జీవోపై తెలంగాణ అధికారులు మండిపడ్డారు. అడ్డదారిలో తెలంగాణలో ప్రభుత్వ భూములను అమ్మడానికి ప్రయత్నిస్తే ఉరుకునేదిలేదని హెచ్చరించారు. ఏపీ సర్కారు తీరుపై ఉద్యోగ సంఘాలు కూడా ఆగ్రహం వ్యక్తం చేశాయి.

ఎమ్మార్పీఎస్ బంద్‌కు టీడీపీ మద్దతు

హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): ఎస్సీ వర్గీకరణ పోరులో భాగంగా ఎమ్మార్పీఎస్ తలపెట్టిన తెలంగాణ బంద్‌కు మద్దతు ఇస్తున్నామని టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రమణ ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో రమణను కలిసి బంద్‌కు మద్దతు కోరారు. బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని రమణ ఆయనకు చెప్పారు. కాగా, ఈనెల 28న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో రమణ పార్టీ ముఖ్య నేతలతో మంగళవారం సమావేశం అయ్యారు. చంద్రబాబు సమక్షంలో ఆ రోజు జరిగే సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై నేతలతో మాట్లాడారు.



మాంసం ఉత్పత్తుల రంగంలో పెట్టుబడులకు

తెలంగాణ అనుకూలం

- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని
- లూలూ సంస్థ సీఈవోతో తలసాని చర్చలు
- డెయిరీ, పౌల్ట్రీ రంగంలో విస్తృత అవకాశాలు
- విదేశీ సంస్థలకు ప్రభుత్వ ఆహ్వానం
- దుబాయ్ ఫుడ్ ట్రేడ్ షోలో రాష్ట్ర బృందం

హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): మాంసం ఉత్పత్తుల రంగంలో పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అనుకూలమని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ నెల 18 నుంచి దుబాయ్‌లో జరుగుతున్న గుల్ఫుడ్-2018 ఫుడ్ ట్రేడ్ షోను మంత్రి తలసాని ఆధ్వర్యంలోని రాష్ట్ర బృందం మంగళవారం సందర్శించింది. ఇందులో భాగంగా లూలూ గ్రూప్ సంస్థ సీఈవో సలీంతో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ మాంసం ఉత్పత్తుల రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ రాష్ట్రం ఎంతో అనుకూలమని, ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని విదేశీ సంస్థలను ఆహ్వానించారు. మాంసం, డెయిరీ, పౌల్ట్రీ రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. సింగిల్ విండో ద్వారా పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నామని చెప్పారు.ప్రతి జిల్లా కేంద్రంలో మీట్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి ఆధ్వర్యంలోని బృందంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, గొర్రెల అభివృద్ధి సమాఖ్య ఎండీ లక్ష్మారెడ్డి, డెయిరీ ఎండీ నిర్మల ఉన్నారు.

కార్మిక సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- హోం.. కార్మిక మంత్రి నాయిని వెల్లడి
- నిర్మాణ కార్మికులకు చెక్కుల పంపిణీ



హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉండే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పలు పథకాలు అందిస్తున్నట్లు హోం, కార్మిక మంత్రి నాయిని నర్సింహా రెడ్డి పేర్కొన్నారు. కార్మిక సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన వెల్లడించారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో లబ్దిదారులైన కార్మికుల కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు తెలంగాణ, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి కలిసి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా గత నెల 24న స్క్రీనింగ్ కమిటీ లబ్దిదారులకు వివిధ సంక్షేమ పథకాల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి ఆమోదించామన్నారు. ఇంకా సభ్యత్వం తీసుకోని కార్మికులు వెంటనే తీసుకోవాలని సూచిస్తూ దీంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలిపారు. కార్మికుల కుటుంబాలను తప్పకుండా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కార్మికులకు కిట్లు ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిపారు. ప్రమాదంలో మరణించిన ముగ్గురు కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయంగా రూ.18.80 లక్షల చెక్కులను మంత్రి అందించారు. సహజ మరణం పొందిన 12 మంది కార్మికుల కుటుంబాలకు రూ.10.70 లక్షల చెక్కులు అందజేశారు. ఐదుగురు మహిళ కార్మికులు, కార్మికుల కుమార్తెలకు వివాహ కానుకగా రూ.1.50 లక్షల చెక్కులను అందించారు. వివిధ నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న ఏడుగురు కార్మికులకు ప్రసూతి సాయంగా రూ.2 లక్షల చెక్కులను అందించారు. వైద్య సహాయంగా ఒక్కొక్కరికీ రూ.13,500 అందజేసినట్టు నాయిని పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు ఐఐఎం కేటాయించండి

- కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్‌ను కోరిన
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- కేజీబీవీల పొడిగింపునకు కేంద్రం హామీ



హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): హైదరాబాద్‌కు ఐఐఎం కేటాయించాలని కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్‌ను కోరామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి చెప్పారు. ప్రకాశ్ జావడేకర్‌ను డిప్యూటీ సీఎం కడియం, ఎంపీ మల్లారెడ్డి మంగళవారం ఢిల్లీలో కలిశారు. కేజీబీవీలను ఇంటర్మీడియట్ వరకు పొడిగించేందుకు కేంద్రమంత్రి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారన్నారు. ఈనెల చివరన జరిగే కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన విద్యా సంస్థల ఏర్పాటు హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఇంటర్మీడియట్‌కు వరకు ఏకరూప దుస్తులు అందించాలని కోరామని, అలా చేస్తే బాలికల డ్రాపౌట్స్ తగ్గి విద్యాభివృద్ధి సాధ్యపడుతుందని తెలియజేశామని చెప్పారు.

మీరు చేయకపోతే..

రాష్ట్రాలకు అనుమతివ్వండి!

- ఎస్సీ వర్గీకరణపై మోదీకి సురవరం లేఖ



హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): కేంద్రం ఎస్సీ వర్గీకరణ చేయలేకపోతే, రాష్ట్ర పరిధిలో వర్గీకరణ చేసుకునేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతివ్వాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ప్రధానికి సూచించారు. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పార్టీలు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నాయన్న విషయాన్ని ఓ లేఖ ద్వారా మోదీ దష్టికి తీసుకెళ్లారు. రెండు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణకోసం పోరాటాలు జరుగుతున్నాయని సురవరం పేర్కొన్నారు. వర్గీకరణకు అనుకూలంగా తెలుగు రాష్ట్రాలు అసెంబ్లీలో తీర్మానాలు చేసిన విషయాన్ని, కేంద్రం నియమించి న జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ నివేదికనూ లేఖలో ప్రస్తావించారు. వర్గీకరణకోసం ప్రాణత్యాగాలు జరిగిన విషయాన్ని సురవరం గుర్తుచేశారు. ఇకనైనా మాదిగల న్యాయమైన డిమాండ్‌ను గుర్తించి కేంద్రం వర్గీకరణ చేపట్టాలన్నారు. ఒకవేళ కేంద్రం చేయలేకపోతే, పంజాబ్ తరహాలో వర్గీకరణకు రాష్ట్రాలకు అనుమతివ్వాలని ఆయన సూచించారు.

షారుఖ్ నా ఫేవరేట్

- మానవాళితో కలిసి పనిచేస్తా
- 'మానవ' రోబో సోఫియా
- డబ్ల్యూసీఐటీ సదస్సులో.. కృత్రిమ మేధపై ప్రసంగం



హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తన ఫేవరెట్ యాక్టర్ అంటూ హ్యూమనాయిడ్ రోబో సోఫియా పేర్కొంది. తన చిట్టి చిట్టి మాటలతో 'అందర్నీ ప్రేమించండి' అని చెప్పి హైదరాబాదీల మనసులు గెలుచుకుంది. ఐటీ ప్రొఫెషనల్స్ కోరుకునే విశ్రాంతి, తనకూ కావాలని చెప్పి వారి హృదయాలను కొల్లగొట్టింది. హెచ్ఐసీసీలో జరుగుతున్న ప్రపంచ ఐటీ సదస్సు రెండో రోజు రోబో సోఫియా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తనను తయారుచేసిన డేవిడ్ హాన్సన్‌తో కలిసి ఇంటర్వ్యూ ఇచ్చింది. తాను పుట్టిన హాంకాంగ్ అన్నా, షారుఖ్‌ఖాన్ అన్నా తనకిష్టమని తెలిపింది. మానవాళిపై ఆధిపత్యం చెలాయించాలని తనకు లేదన్న సోఫియా, అందరితో సఖ్యతగా మెలగాలని కోరుకుంటున్నానని చెప్పింది. మానవ జన్మ ఒక అద్భుతమని, మానవులు సృజనాత్మకత కలిగినవారని కొనియాడింది. తనకు పౌరసత్వం ఇచ్చిన సౌదీ అరేబియాకు సోఫియా కృతజ్ఞతలు తెలిపింది. మహిళల హక్కుల గురించి మాట్లాడేందుకు తనకు ఈ పౌరసత్వం ఉపయోగపడుతుందని చెప్పిన సోఫియా, తమకు (రోబోలకు) ఎలాంటి ప్రత్యేక నిబంధనలూ అవసరంలేదన్నది.వాటిని తాము కోరుకోబోమని చెప్పింది. మానవ జాతిని చంపాలని ఉందని ఒకసారి అన్నావుగా? అని అడగ్గా.. అలా ఎందుకు చెప్పానో నాకు నిజంగా తెలియదు. ఆ సమయంలో సెన్స్ ఆఫ్ హ్యూమర్ పనిచేయలేదేమో. నాకు ఎవరినీ చంపాలని లేదు. అందర్నీ ప్రేమించండి. థాంక్యూ!' అని చెప్పి ఇంటర్వ్యూ ముగించింది.

1.5 లక్షల ఉద్యోగాలు: కేటీఆర్

సదస్సులో కృత్రిమ మేధస్సు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో నాస్కామ్ రెండు ఒప్పందాలను కుదుర్చుకుంది. మంత్రి కేటీఆర్, నాస్కామ్ చైర్మన్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఐటీ విస్తరణకు తోడ్పడుతున్న నాస్కామ్‌కు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకెళ్తుందన్నారు. ఏఐసీ వోఈ విషయంలో తెలంగాణ రాష్ట్రమే ముందడుగేసిందని చెప్పారు. డేటా సైన్స్‌లో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని మంత్రి తెలిపారు. అన్ని రంగాలతో ముడిపడి ఉన్న డేటాసైన్స్‌తో లక్షా 50వేలకు పైగా ఉద్యోగాలు వస్తాయన్నారు. రెండో రోజు సదస్సులో వివిధ అంశాలపై జరిగిన చర్చలో పలు ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సకాలంలో 'పెట్టుబడి' అందేనా?

- ఎకరాకు రూ.4వేల పంపిణీకి.. అడ్డంకిగా మారిన నగదు కొరత
- ఒకేసారి రూ.5,680కోట్లు అవసరం
- ఫలించని రాష్ట్ర ప్రభుత్వ చర్చలు
- కేంద్రం, ఆర్‌బీఐ నుంచి విముఖత
- మే 15కు అసాధ్యమంటున్న నిపుణులు



హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పెద్ద నోట్లు రద్దు నిర్ణయం తర్వాత దేశ వ్యాప్తంగా నగదు కష్టాలు ఎక్కువయ్యాయి. నాటి నుంచి నేటి వరకు సామాన్యులు నగదు కోసం అవస్థలు పడుతూనే ఉన్నారు. ప్రస్తుతం నగదు కొరత సమస్య రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, అధికారులకు తలబొప్పి కట్టిస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పెట్టుబడి పథకం'కు నగదు కొరత సమస్యగా మారింది. ప్రస్తుత పరిస్థితిని చూస్తే ఈ పథకం ద్వారా అందే పెట్టుబడి రైతులకు సకాలంలో చేరేలా లేదు. రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడిగా నగదు ఇచ్చేందుకు ప్రభుత్వం దాదాపు ఆరు వేల కోట్ల రూపాయలు సమకూర్చుకోవలసి ఉంటుంది. ఒకేసారి అంత పెద్ద మొత్తంలో నగదు సమకూరడం ఎటూ చూసినా సాధ్యపడని విషయంగా కనిపిస్తుంది. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఇప్పటికే తలలు పట్టుకుంటున్నారు. 'పెట్టుబడి' పథకానికి సహకారం అందించే విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా సుముఖంగా లేదని తెలిసింది. దీంతో మే 15 వరకు రైతులకు నగదు అందడం కష్టమనే చెప్పాలి.

ఒకేసారి రూ.5680 కోట్లు..

రైతులకు ముందస్తు పెట్టుబడి కోసం ఎకరానికి రూ.4వేలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 1.42 కోట్ల ఎకరాల పట్టా భూమి 70 లక్షల మంది రైతుల చేతుల్లో ఉంది. వీరందరికి ఎకరాకు రూ.4 వేల చొప్పున మే 1 నుంచి 15వ తేదీ మధ్యలో నగదు అందజేయాలని ప్రభుత్వం భావించింది. రైతులకు నగదు నేరుగా ఇవ్వడం సాధ్యం కాకపోవడంతోపాటు అనేక సమస్యలు ఏర్పడతాయనే ఉద్దేశంతో పెట్టుబడి సొమ్మును చెక్కు రూపంలో ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామసభలు నిర్వహించి రోజుకు వెయ్యి గ్రామాల చొప్పున చెక్కుల పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రభుత్వం ఇచ్చిన చెక్కులను రైతులు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తే డబ్బు ఎప్పటికీ చేతికి అందుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. చెక్కులు, నగదు కావడానికి కనీసం నెల రోజులు పడుతుందని అంటున్నారు. ఇదే జరిగితే పెట్టుబడి పథకం విషయంలో ప్రభుత్వ ఆశయం నీరుగారినట్టే.. ఎందుకంటే.. అప్పటికే వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుంది. సాగుకు కావాల్సిన అవసరాలను రైతులు అప్పటికే సమకూర్చుకుంటారు. మే 15వ తేదీకి చెక్కులు అందినా.. డబ్బులు జూన్ 15కు రైతులకు అందుతాయి. అప్పటికే ఖరీఫ్ పనులు జోరందుకుంటాయి. దీంతో రైతులు సాగు అవసరాల కోసం అప్పులు చేయక తప్పదు.

కేంద్రం మొండి చెయ్యి

పెట్టుబడి నగదు పథకం అమలుకు నిర్ణయం తీసుకున్న నాటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం నగదు కొరతను అధిగమించడంపై కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌తో కూడిన రాష్ట్ర బృందం ఢిల్లీ వెళ్లి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ, ఆర్‌బీఐ అధికారులను కలిశారు. పథకం అమలుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఆర్థిక శాఖ నుంచి ఎటువంటి స్పందన లేదు. దీంతో సీఎం కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు. ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన కేసీఆర్ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసి పరిస్థితిని వివరించారు. అంతపెద్ద మొత్తంలో నగదు నిల్వలు సమకూర్చడం కష్టమైన పని అని వారు తేల్చి చెప్పడంతో ఏం చేయాలో తెలియక ఇటు ప్రభుత్వం, అటు అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

జూన్-జూలైలోనే డబ్బు అవసరం

ఈ సంవత్సరానికి సంబంధించి దిగుబడి అయిన పంటను అమ్మగా సమకూరిన డబ్బు చాలామంది రైతుల చేతికి వస్తుంది. ఈ మొత్తంలో కొంత మొత్తాన్ని పంట పెట్టుబడికి, మిగిలిన సొమ్ము అప్పు తీర్చడానికి రైతులు వెచ్చిస్తారు. ఎన్నో ఏళ్లుగా రైతులు అనుసరిస్తున్న విధానం ఇదే. దుక్కి దున్నడం, చదును చేయడం, విత్తనాలు తెచ్చుకోవడం కోసం కావాల్సిన సొమ్మును సిద్ధం చేసి పెట్టుకుంటారు. అసలు రైతులకు డబ్బులకు ఇబ్బంది అయ్యేదల్లా.. జూన్, జూలై నెలల్లోనే. ఆ సమయంలోనే ఎక్కువ మంది రైతులు రుణాల కోసం ప్రయత్నిస్తుంటారు. ఒక వేళ ప్రభుత్వం మే నెలలో చెక్కులు ఇచ్చినప్పటికీ రైతులు వాటిని జూన్, జూలైలో నగదుగా మార్చుకుంటారు. అందువల్ల భారమంతా కేంద్రంపై వేయకుండా, పథకం అమలుకు వేరే మార్గాలు అన్వేషించాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు సూచించింది. నగదు కొరత నేపథ్యంలో పెట్టుబడి పథకం ఏ స్థాయిలో సఫలం అవుతుందో, రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందో మరి కొద్ది రోజుల్లో తెలుస్తుంది.

ప్రధాని జోక్యంతో రెండు వేల కోట్లే!

సీఎం కేసీఆర్ ఆర్‌బీఐ అధికారులను కలిసిన సమయంలో ప్రధానికి కలిస్తే ఫలితం ఉండవచ్చని పలువురు అధికారులు ఆయనకు సూచన చేశారు. అయితే ప్రధానిని కలిస్తే ఏ మేరకు ఉపయోగం ఉంటుందనే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీసింది. ఒకవేళ ప్రధానిని కలిస్తే రూ.2 వేల కోట్ల వరకు నగదు నిల్వలు అందే అవకాశం ఉందని తెలిసింది. అయితే అవసరమైన నగదుతో పోల్చుకుంటే రెండు వేల కోట్లు ఏమూలకు వస్తాయని ఆందోళన మొదలయ్యింది. అయితే రైతులందరికీ ఒకే తేదీలు కాకుండా వేర్వేరు తేదీలను చెక్కులపై ముద్రించి ఇస్తే కొంతవరకు సమస్య తీరుతుందని పలువురు అధికారులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళితే.. చెక్కులు ఇచ్చిన వెంటనే రైతులందరూ బ్యాంకులకు వెళ్లడం కష్టమే.

డిసెంబరులోనే ఎన్నికలు!

- ముందస్తు నిర్వహణ ఖాయం
- ఎంఐఎంపై అన్ని చోట్లా పోటీ
- డీసీసీ అధ్యక్షులకు నో టికెట్
- కేసీఆర్‌కు ఇవే అఖరి ఎన్నికలు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో ఉత్తమ్



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి): ఈ సంవత్సరం డిసెంబరులోనే శాసన సభ ఎన్నికలు వచ్చే అవకాశముందని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలోపు కేసీఆర్ దుర్మార్గపు పాలన అంతమవుతుందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంఐఎంపై అన్ని చోట్లా పోట చేస్తామని స్పష్టం చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్నికల్లో పోటీ చేయ కూడదని అధిష్ఠానం ఆదేశించిందని, ఈ విషయంలో డీసీసీ అధ్యక్షులతో రాహుల్ గాంధీ కూడా మాట్లాడనున్నట్లు తెలిపారు.

అందరి ఆమోదంతోనే బస్సు యాత్ర

పార్టీ నాయకులతో చర్చించిన తరువాతే బస్సు యాత్ర చేయాలని నిర్ణయించినట్లు ఉత్తమ్ వెల్లడించారు. బస్సు యాత్ర ఏకపక్షమని కొంత మంది చేస్తున్న విమర్శలు సరికాదన్నారు. మహిళలు, యువత, రైతులు, విద్యార్థులతో యాత్రలో మాట్లాడతామన్నారు. జన చైతన్య యాత్రగా పేరుపెట్టిన ఈ యాత్ర సందర్భంగా వివిధ పార్టీల నుంచి చేరికలు ఉంటాయన్నారు. రెండు దశలుగా జరిగే యాత్ర ముగింపు సమావేశం జూన్ 1న జరుగుతుందని తెలిపారు... ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హాజరవుతారని చెప్పారు. రెండో దశలో జరిగే పాదయాత్రలు కూడా పార్టీ అదిష్ఠానం ఆమోదంతోనే చేస్తున్నామని స్పష్టంచేశారు.

విభజన హామీలు నెరవేరలేదు

తెలంగాణ బిల్లు ఆమోదం పొంది నాలుగేళ్లు పూర్తియ్యిందని, రాజ్యసభలో టీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ లేకున్నా కాంగ్రెస్ చొరవతోనే బిల్లు పాస్ అయిందని ఉత్తమ్ చెప్పారు. కేసీఆర్ నాలుగేళ్ల పాలనలో ప్రజల కల చెదిరిందన్నారు. రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన సాగుతుందని ఉత్తమ్ విమర్శించారు. విభజన బిల్లులో ఉన్న వాటిని కూడా కేసీఆర్ సాధించలేకపోయారన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎయిమ్స్ వంటివి సాధించలేదన్నారు. ప్రధాని మోదీని ఢీకొట్టే దమ్ము కేసీఆర్‌కు లేదన్నారు. అరుణ్, జైట్లీ, అరవింద్ సుబ్రమ ణియన్ వంటి వారితో పొగడ్తలు తప్ప, సాధించిందిలేదని ఎద్దేవా చేశారు. ఉద్యమ సమయంలో తెలంగాణను వ్యతిరేకించిన వారిని కేసీఆర్ అందలం ఎక్కించారని చెప్పారు. కేసీఆర్‌కు ఇదే ఆఖరి బడ్జెట్ అన్నారు. దళితులకు 3 ఎకరాల భూమి హామీ నిలబెట్టుకోవాలన్నారు.

యాత్ర ప్రారంభానికి చిదంబరం

ఈ నెల 26 నుంచి చేవెళ్లలో ప్రారంభం కానున్న ప్రజా చైతన్య యాత్ర కు కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం రానున్నారని, ఆయన తో మరికొంత మంది ఏఐసీసీ నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉందని ఉత్తమ్ తెలిపారు.

ఆరేపల్లి మోహన్‌పై సర్వే గుస్సా

సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ ఎస్సీ సెల్ చైర్మన్ అరేపల్లి మోహన్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ భేటీకి తనను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు.

ఉత్తమ్‌ను కలిసిన మందకృష్ణ

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డిని గాంధీభవన్‌లో కలుసుకున్నారు. ఎస్సీ వర్గీకరణపై ప్రధాన మంత్రికి రాహుల్ గాంధీతో లేఖ రాయించాలని కోరారు. లోక్‌సభలో ఎస్సీ వర్గీకరణ కు కాంగ్రెస్ మద్దతు ఇవ్వాలని మందకృష్ణ కోరారు. వర్గీకరణ సమస్యపై త్వరలో రాష్ట్ర బంద్‌కు పిలువు ఇవ్వనున్నట్లు తెలిపారు. తమ ఆందోళనకు మద్దతు ఇవ్వాల్సిందిగా ఆయన ఉత్తమ్‌ను కోరారు.

సోనియాపై పుస్తకం ఆవిష్కరణ

ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన తిరుమలగిరి సురేందర్ రాసిన 'సోనియమ్మకు వందనం' అనే పుస్తకాన్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన ఎల్‌డీఎంఆర్ సమావేశంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు అన్యాయం: ఉత్తమ్

ఈ నెల 26 నుంచి చేపట్టనున్న ప్రజా చైతన్య యాత్రలో కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తామని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. బస్సు యాత్రలో ప్రభుత్వ వైఫల్యాలతో పాటు, అన్ని వర్గాలను కేసీఆర్ మోసం చేస్తున్న తీరును చెబుతామన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన ఎస్సీ సెల్ సమావేశంలో ఉత్తమ్, భట్టి, సర్వే తదితరులు పాల్గొన్నారు. దళితులను కేసీఆర్ మొదటి నుంచి మోసం చేస్తునే ఉన్నారని ఉత్తమ్ విమర్శించారు. మంత్రి వర్గంలో దళితులకు స్థానం కల్పించలేదన్నారు. మందకృష్ణ మాదిగను 2 సార్ల జైలుకు పంపించారని విమర్శించారు. కాంగ్రెస్‌లో దళితులు ఏ స్థానంలోకైనా రావచ్చని, ఆ అవకాశం టీఆర్ఎస్‌లో ఉందా అని ప్రశ్నించారు. మూడెకరాల భూమికోసం రాష్ట్రంలో అర్హులైన కుటుంబాలు 7 నుంచి 8 లక్షల వరకు ఉన్నాయన్నారు. వీరికి భూమి ఇవ్వలేకపోతే ఎకరం 5 లక్షల చొప్పన 15 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

రాజీనామా చేయించి రండి

- సెమీఫైనల్‌లో ఎవరి దమ్ము ఎంతో తెలుస్తుంది
- సీఎం కేసీఆర్‌కు కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ సవాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయిస్తే సెమీఫైనల్ ఆడుదామని, అప్పుడు ఎవరి దమ్ము ఎంతో తెలిసిపోతుందని శాసనమండలిలో కాంగ్రెస్ పక్ష నేత షబ్బీర్ అలీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సవాల్ విసిరారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. ముస్లిం, ఎస్టీ రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి కేసీఆర్ తమ వైఖరిని చెప్పాలని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు.

ముస్లిం, ఎస్టీ రిజర్వేషన్ బిల్లులను కేంద్ర ప్రభుత్వం తిప్పి పంపించిందని ఆయన చెప్పారు. 2017 ఏప్రిల్ 16న అసెంబ్లీ, కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో ముస్లిం రిజర్వేషన్లు 12 శాతం, ఎస్టీ రిజర్వేషన్లను 10 శాతానికి పెంచుతూ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. హోం శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ విభాగం ఈ బిల్లులు తిరస్కరించి, వెనక్కి పంపిందన్నారు. ఈ బిల్లు నిజంగా తిరస్కరణకు గురైందా లేదా అన్న విషయం చెప్పాలని షబ్బీర్ డిమాండ్ చేశారు. బిల్లు ఆమోదం పొందకపోతే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ధర్నా చేస్తామని కేసీఆర్ గతంలో చేసిన ప్రకటనను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, రిజర్వేషన్ బిల్లులపై టీఆర్ఎస్ ఎంపీలు సభలో కేంద్రాన్ని నిలదీస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. కేసుల భయంతోనే కేసీఆర్ ప్రధాని మోదీ అంటే భయపడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్పందించకుంటే తామే ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకుపోతామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్ని బాగున్నాయని కేంద్ర ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ చెప్పడాన్ని షబ్బీర్ అలీ తప్పుపట్టారు.

మనం


జనం కోసం.. అక్షర యజ్ఞం..

బుధవారం, ఫిబ్రవరి 21


ద్వైపాక్షిక ముందడుగు

భారత్ (ఆర్యావర్తం), ఇరాన్ (ఆర్యుల భూమి) మధ్య భౌగోళిక రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఎన్ని భేదాభిప్రాయాలున్నా, పరస్పరం సహకరించుకోవలసిన చారిత్రక అవసరాలున్నాయి. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో సోవియట్ రష్యాతో చమురు దిగుమతుల ఒప్పందంలో భాగంగాను, నేరుగాను ఇరాన్ నుంచి చమురు దిగుమతులు భారతీయ ఇంధన అవసరాలు తీర్చడంలో కీలకపాత్ర పోషించాయి. అలాంటిది సోవియట్ రష్యా కుప్పకూలడంతో ఏర్పడిన అమెరికా కేంద్రత ఏకధ్రువ ప్రపంచంలో ఇరాన్‌తో భారత్ సంబంధాలు కొంత బలహీనపడ్డాయి. నేడు రష్యా, ఈయూ దేశాల మద్దతుతో చైనా సామ్రాజ్యం దూకుడుగా అమెరికాను ఢీకొడుతున్న సందర్భంలో ఇరాన్‌తో ద్వైపాక్షిక పునరుద్ధరణ భారత్‌కు తక్షణావసరంగా ముందు నిలిచింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ ఈ నెల 15 నుంచి 17 వతేదీ వరకూ మూడురోజులు భారత పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. రౌహానీ పర్యటనలో భాగంగా ఇరుదేశాల మధ్య తొమ్మిది ఒప్పందాలు జరిగాయి. ఇరాన్‌లో మన దేశం నిర్మించిన తొలిదశ చాబహార్ ఓడరేవు నిర్వహణలో భాగస్వామ్యం, సరుకులపై ద్వంద్వపన్నుల నివారణ, వైద్యం, ఇంధన రంగాల్లో సహకారం, నేరస్తుల అప్పగింత తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. అమెరికా భౌగోళిక రాజకీయ వ్యూహంలో భాగంగా ఇరాన్‌తో తలపడుతున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ పర్యటన జరిగిన నెలరోజులకు ఇరాన్ అధ్యక్షుడు రౌహానీ భారత్‌ను సందర్శించి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునే వైపుగా మరొక అడుగు ముందుకు వేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. అలీనోద్యమ నేతగా ప్రచ్ఛన్న యుద్ధకాలంలో కీలక పాత్రపోషించిన భారత్‌తో చెలిమికి గతం నుంచి ఇరాన్ అత్యంత ప్రాధాన్యమిస్తోంది. అదే సమయంలో ఇరాన్‌పై ఆంక్షల విషయంలో భారత్ తటస్థ వైఖరి అవలంభించినప్పటికీ భద్రతా మండలిలో మనకు శాశ్వత సభ్యత్వం రావాలని కోరుకుంటున్న దేశాలలో ఒకటిగా నిలిచింది. భారత్‌కు, ముఖ్యంగా నిజాం సంస్థానానికి ఇరాన్‌తో చారిత్రక సాంస్కృతిక అనుబంధం ఉండడంతో, రౌహానీ పర్యటన హైదరాబాద్ నుంచి ప్రారంభమవడం విశేషం.

ప్రపంచ చమురు నిల్వల్లో మూడవస్థానం. సహజవాయువు నిక్షేపాల్లో రెండవ స్థానంలో ఉన్న ఇరాన్ అమెరికా విధించిన ఆంక్షల కారణంగా ఈ శిలాజ ఇంధనాలను అమ్ముకోవడంలో అనేక ఇబ్బందులు పడుతోంది. భారత్‌కు ఇంధన అవసరాలు భారీగా ఉండడమే కాక, కొత్త సిల్క్ రోడ్ నిర్మాణంతో అమెరికానే కాకుండా, మనదేశాన్ని కూడా అష్టదిగ్బంధనం చేసేందుకు ప్రయత్నిస్తున్న చైనా సామ్రాజ్యవాద భౌగోళికార్థిక రాజకీయవ్యూహాన్ని తిప్పికొట్టాలంటే మధ్యప్రాచ్యంలోని ఇరాన్‌తో దోస్తీ అత్యవసరం. ఇరాన్‌లోని చాబహార్ రేవు తొలిదశ నిర్మాణంతో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణలో ముందడుగు పడింది. అమెరికా ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగంగా సిరియా కేంద్రంగా పశ్చిమాసియా యుద్ధక్షేత్రాల్లో ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ప్రజ్వరిల్ల వచ్చు అనే పాశ్చాత్య దేశాల మీడియా కథనాలు వస్తున్నాయి. అదే సమయంలో ఇప్పటికే ఇరాన్, సౌదీ అరేబియా దేశాలు మధ్య షియా, సున్నీతెగల తరతరాల వైషమ్యాల కొనసాగింపుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక రూపాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయి. జార్జి బుష్ పాలనా కాలంలో, ఒబామా తొలిదశ పాలనా కాలంలో ఇరాన్‌తో మన దేశం చెలిమికి ఒక మోస్తరు ఆటంకాలెదురైనా, అనంతర కాలంలో అణ్వాయుధాల తయారీ చేస్తున్నదనే సాకుతో అమెరికా ఆంక్షలు విధించడం ప్రారంభమైన నాటినుంచి ఇరుదేశాల దౌత్యసంబంధాల్లో ప్రారంభమైన స్తబ్దత ట్రంప్ రాకతో సందిగ్ధంలో పడ్డాయి. వేగంగా మారుతున్న భౌగోళిక రాజకీయ యవనికలో అమెరికాకు ఈయూపై పట్టు తగ్గిపోవడంతోపాటు నమ్మదగిన ఆసియా నేస్తంగా భారత్ దగ్గరవుతోంది. అమెరికా సహకారానికి కొనసాగింపుగా పెరుగుతున్న భారత్ జోక్యానికి చెక్ పేట్టేందుకు చైనా, రష్యాలు పాక్ సహకారంతో జరుగుతున్న ఆఫ్ఘాన్ శాంతి స్థాపనయత్నాలపై ఇరాన్‌కూ ఆసక్తి చూపుతోంది. అమెరికా ఒత్తిడి, ఆంక్షల కారణంగా ఇరాన్‌లో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణాన్ని మన దేశం మధ్యలోనే వదిలేస్తే, తగిన సహాయ సహకారాలు అందించేందుకు చైనా సంసిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో మన స్వీయ ప్రయోజనాలు, భౌగోళిక రాజకీయ ప్రయోజనాలకు మధ్యే మార్గంలో భారత్ వ్యవహరించాల్సి ఉంటుంది. ఇరాన్‌తో దౌత్యం రెండు రకాలుగా లాభిస్తుంది కాబట్టి భారత పాలకులు ఆచితూచి అడుగేయాలి. రౌహానీ పర్యటనతో ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న అపార్థాలన్నీ తొలగి మైత్రీ బంధం పటిష్టం కాగలదని ఆశిద్దాం.



మంచిమాట



'స్వేచ్ఛలేని పత్రికలు స్వేచ్ఛని ప్రచారం చేయలేవు'

- కొడవటిగంటి కుటుంబరావు

మరో ప్రయత్నం




జి. హరగోపాల్

స్వేచ్ఛారావం

ప్రముఖ జర్నలిస్టు వెన్నెలకంటి రామారావు 'మనం' దినపత్రికకు ఒక కాలమ్ రాయమని అడిగినప్పుడు రాయడానికి ప్రధాన కారణం దేశంలో,అలాగే తెలంగాణ రాష్ట్రంలో స్వేచ్ఛకు ముంచుకు వస్తున్న ప్రమాదం. గతంలో 'నమస్తే తెలంగాణ' పత్రికలో దాదాపు రెండున్నర సంవత్సరాలు ఇదే టైటిల్ తో ఒక కాలమ్ రాశాను. అది తెలంగాణ ఉద్యమ కాలం. ఉద్యమం గురించే కాక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ప్రజల ఆకాంక్షలు కొంతవరకైనా నెరవేరుతాయని, స్వేచ్ఛ వికసిస్తుందని కొంత భ్రమించిన కాలం. రాజ్యస్వభావం కొంత అవగాహన ఉన్న నేను ఇలాంటి భ్రమలకు లోనుకావడానికి కొంత అవగాహనలోపం, కొంత ఆశాజీవి కావడం... ఉద్యమం నుంచి ఎదిగిన తెరాస నాయకత్వానికి స్వేచ్ఛ పట్ల కొంతైనా గౌరవం ఉంటుందని, ప్రజలకు తమ సమస్యల మీద ఉద్యమించడానికి, పోరాడడానికి కావలసిన ప్రజాస్వామ్య చోటు(democratic space) పెరుగుతుందని ఆశించాం. తీరా రాష్ట్రమేర్పడి ఉద్యమపార్టీ అధికారంలోకి రావడంతో పరిస్థితి తారుమారైంది. బహుశా ఉద్యమాలు నిర్మించిన వారికి ఉద్యమాలను ఎలా అణచాలో బాగా తెలుసుంటుందనుకుంటాను. ఇందిరా పార్కు ధర్నా చౌక్‌ను ఎత్తివేస్తారని కలలో కూడా ఊహించలేదు. ఈ చౌక్ తెలంగాణ ఉద్యమానికి ఇరుసులా పనిచేసింది. ప్రస్తుత ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ఇక్కడి నుంచి ఎదిగినవాళ్లే. తాము కూర్చున్న కొమ్మను తామే నరుకుకోవడం అనే నాను డి ఉందికాని మొత్తం చెట్టును నరికివేయడం గురించి మనం వినలేదు. ఒక ప్రజాస్వామ్య ఉద్యమం నుంచి పుట్టుకురావడమన్నది బహుశా ఒక చారిత్రక సంద ర్భం కావచ్చు లేదా వైపరీత్యం కావచ్చు.

నా దృష్టిలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రజలు విస్తృతంగా పాల్గొనడానికి ప్రధాన కారణం ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న రాజ్య నిర్బంధం. ముఖ్యంగా వెంగళరావు ప్రభుత్వంతో ప్రారంభమైన ఈ నిర్బంధం ఎన్.టి.రామారావు కాలం వరకు విజృంభించి పౌరహక్కుల నాయకులను హతమార్చే దశకు దిగజారింది. ఎన్.టీ.ఆర్ ఒక కొత్త పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లో అధికారంలోకి వచ్చాడు. ఆయన వాగ్ధాటి, ఆకర్షణ సాధారణమైందేమీ కాదు. దీనిని మాక్స్‌వెబర్ (Max weber) సమ్మోహనలో అధికారం (Charismatic authority) అని సూత్రీకరించాడు. ఈయన ముఖ్యమంత్రిత్వంలో రాజ్యం అణచడం అంతా ఇంతా కాదు. తొమ్మిది నెలల్లో అధికారంలోకి వచ్చి ఐదేళ్ళకు అంటే ఒకే ఒక టర్మ్ తర్వాత చిత్తుగా ఓడిపోయాడు. నిర్బంధంతో విసిగిన ప్రజలు ఏదీ లెక్కచేయకుండా ఆయనను గద్దెదించారు. తర్వాత కాలంలో నిర్బంధం తగ్గిందని కాదు కాని కొంత మెరుగు. ఏది ఏమైనా నియంతృత్వాన్ని తెలంగాణ ప్రజలు సహించరన్నది ఉధృతంగా జరిగిన తెలంగాణ ఉద్యమంలో స్పష్టంగా చూశాం. వచ్చే ఎన్నికలలో తెరాస పార్టీ ఓడితే దానికి ఒకే ఒక కారణం ఇప్పుడు అమలు ఔతున్న నిర్బంధం.

గతంలో ఎన్నడు లేనివిధంగా మొత్తంగా సభలు సమావేశాలు పెట్టుకోవడానికి వీలులేని ఒక పాలనా విధానం ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్నది. హాలు మీటింగ్‌లు పెట్టుకోవడానికి ఎవరి అనుమతి అవసరం లేదు. అది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. అలాంటి సభకు అనుమతి నిరాకరించడానికి వీలులేదు కనుక హాలు యజమానులను పోలీసులు బెదిరించడం పరిపాటి ఐపోయింది. ఎంతకాద న్నా హాలు యజమానులు సాహసవంతులేం కాదు. ఎక్కడ ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో, పోలీసులు తమను ఏ కేసులో ఇరికిస్తారో అన్న భయమున్న వాళ్ళే! తమ హాలులో మీటింగ్‌లు పెట్టుకోవచ్చు అని అన్నవాళ్లే సభా నిర్వాహకులను బతిమిలాడి తమ హాలులో మీటింగ్ వద్దని అనడం చూస్తే వాళ్ళమీద జాలివేస్తుంది. వాళ్ళను బెదిరించిన వాళ్ళమీద ఆగ్రహం కలుగుతుంది. హాలు మీటింగ్‌లు దాటి తెరాస ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి ఇంట్లో కూడా మీటింగ్ పెట్టుకొనడానికి అభ్యంతరం చెప్పేదాకా వెళ్ళింది. జనగామలో ఎ.నర్సింహారెడ్డి ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, ప్రస్తుతం తెలుగు ప్రజలను విస్తృతంగా తన రచనల ద్వారా చైతన్యపరస్తున్న వ్యక్తిని ఉదయం పోలీసుస్టేషన్ తీసుకొచ్చి సాయంత్రం దాకా నిర్బంధించారు. కేవలం అమరుడు సంతోష్ సంస్మరణ సభ మిత్రులు, బంధువుల తో జరుపుకొంటామన్నందుకు అభ్యంతరం చెప్పడమేకాక ఆయనను పోలీసుస్టేషన్‌లో కూర్చోబెట్టారు. సంతోష్ తల్లికి అమరుడైన తన కుమారుడి రాజకీయాలతో అంగీకారం లేకపోవచ్చు, కేవలం తన కొడుకు జ్ఞాపకం కొరకు ఆమె ఇంట్లో బంధుమిత్రులు కలవడాన్ని ఆపడమేమిటి? రాజ్య నిర్బంధానికి ఒక హద్దు ఉండాలి కదా. మన రాజ్యాంగమేమైంది? పౌర హక్కులు ఏమయ్యాయి? పౌరసమాజమేమైంది? తల్లి ప్రేమేమైంది? సమాజ మార్పు కొరకు ప్రాణాలిచ్చిన అమరుల పట్ల కనీస గౌరమేమైంది? ఇక రాజ్యమే సమాజమైదే మనిషి వ్యక్తిగత జీవితం ఏమౌతుంది, పౌరుడి మనుగడ ఏమౌతుంది?




గతంలో స్వేచ్ఛారావం ఆగడానికి నేను కారణం కాదు. పత్రిక మీద ఒత్తిడి చేసి ఆ కాలమ్‌ను ఆపారు. పత్రికా స్వేచ్ఛకు చాలా బంధాలున్నాయి. ఇప్పుడు రాజ్య నిర్బంధమే కాక పౌర సమాజంలో ఫాసిస్టు శక్తులు కూడా బలపడ్డాయి. తమ భావ జాలానికి ఎవరు అడ్డుపడ్డా వాళ్ళని జాతి విద్రోహులుగా ప్రచారం చేస్తున్నారు. ఇవాళ దేశభక్తి కొందరి సొత్తై పోయింది. ప్రజలను ప్రేమించేవాళ్ళు, అన్ని మతాలు గౌరవించదగ్గవే అనేవాళ్ళు, రాజ్యాంగ ప్రమాణాల గురించి మాట్లాడే వాళ్లందరి మీద ముద్రలు వేస్తున్నారు. గౌరీ లంకేష్ లాంటి సాహస జర్నలిస్టులను ఇంటికి వెళ్ళి చంపినా ఇంతవరకు హంతకులెవరో తెలవదు, రాజ్య నిర్బంధం ఒకవైపు సమాజంలోని ఫాసిస్టు మూకలు ఒకవైపు స్వేచ్ఛ మీద దాడులు చేస్తున్న సందర్భంలో స్వేచ్ఛారావం కాపాడుకోవలసిన అవసరాన్ని గుర్తించే ఈ కాలమ్ రాయడానికి అంగీకరించాను.

తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోపే నిర్బంధం ప్రారంభమయ్యింది. తెలం గాణ వచ్చిందన్న ఆనందం ఇంకకముందే, పోలీసు రాజ్యం నేనున్నానంటూ బయలుదేరింది. ఇక సభ తర్వాత సభకు ఆటంకాలు, విద్యార్థుల సభలకు అనుమతి లేకపోవడం, మాట్లాడితే మావోయిస్టు అనుబంధ సంస్థలు అని వేధించడం. నిజానికి నిషేధించింది మావోయిస్టు ఆయుధాన్ని కానీ వాళ్ల రాజకీయాలని కాదు. రాజకీయాలని ఎలా నిషేధిస్తారు? మార్కెట్‌లో మావోయిస్టు సాహిత్యం విస్తృతంగా అందుబాటులో ఉంది. గత రెండు, మూడు దశాబ్దాలలో మావోయిస్టు ఉద్యమం మీద దాదాపు యాభై ప్రామాణికమైన పరిశోధనా గ్రంథాలు వచ్చాయి. అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన విశ్వవిద్యాలయాలలో మావోయిజం మీద లోతైన పరిశోధన జరుగుతున్నది. పుస్తకాలలో చర్చ జరుగుతున్నపుడు, మాట్లాడటాన్ని ఎలా నిషేధిస్తారు? ఇది పూర్తి అవగాహనా లోపం. మావోయిస్టు అనుబంధ సంస్థలు మీటింగ్ పెట్టుకున్నంత మాత్రాన విప్లవాలు రావు, విప్లవం రావడమే జరిగితే దానిని ఎవ్వరూ ఆపలేరు. ఆపగలిగితే ఏ విప్లవం ప్రపంచ చరిత్రలో వచ్చి ఉండేది కాదు.

ఈ నిర్బంధం పెరుగుతున్న సందర్భంలో 'స్వేచ్ఛారావం' పునర్జన్మ తీసుకుంటున్నది. 'మనం' పత్రికల ఎంత భావ ప్రకటనా స్వేచ్ఛ ఇస్తుందో తెలియదు. గతంలో స్వేచ్ఛారావం ఆగడానికి నేను కారణం కాదు. పత్రిక మీద ఒత్తిడి చేసి ఆ కాలమ్‌ను ఆపారు. పత్రికా స్వేచ్ఛకు చాలా బంధాలున్నాయి. ఇప్పుడు రాజ్య నిర్బంధమే కాక పౌర సమాజంలో ఫాసిస్టు శక్తులు కూడా బలపడ్డాయి. తమ భావ జాలానికి ఎవరు అడ్డుపడ్డా వాళ్ళని జాతి విద్రోహులుగా ప్రచారం చేస్తున్నారు. ఇవాళ దేశభక్తి కొందరి సొత్తై పోయింది. ప్రజలను ప్రేమించేవాళ్లు, అన్ని మతాలు గౌరవించదగ్గవే అనేవాళ్లు, రాజ్యాంగ ప్రమాణాల గురించి మాట్లాడే వాళ్లందరి మీద ముద్రలు వేస్తున్నారు. గౌరీ లంకేష్ లాంటి సాహస జర్నలిస్టులను ఇంటికి వెళ్ళి చంపినా ఇంతవరకు హంతకులెవరో తెలవదు, రాజ్య నిర్బంధం ఒకవైపు సమాజంలోని ఫాసిస్టు మూకలు ఒకవైపు స్వేచ్ఛ మీద దాడులు చేస్తున్న సందర్భంలో స్వేచ్ఛారావం కాపాడుకోవలసిన అవసరాన్ని గుర్తించే ఈ కాలమ్ రాయడానికి అంగీకరించాను. నా స్వేచ్ఛకు అడ్డు రానంత వరకూ ఈ కాలమ్ కొనసాగుతుందని పాఠకులకు హామీ పడుతున్నాను.

ముప్పు సుడిలో మాతృభాషలు!

జాతి మనుగడకు, సాహిత్య సంపదను వారసత్వంగా అందించడానికి మాతృభాషెంతో దోహదం చేస్తుంది. ఫిబ్రవరి 21వ తేదీని అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవంగా ప్రకటించింది. మాతృభాష మృతభాష కాకుండా సజీవంగా తొణికిసలాడేందుకు మాతృభాష అమలు తీరుతెన్నులపై దృష్టి సారించాలి. 'దేశభాషలందు తెలుగు లెస్స'గా నిలవాలంటే పాలకులు, ప్రజలు ప్రేమతో అమ్మనుడి విధానాన్ని అమలు చేయాలి. గత మూడు దశాబ్దాలుగా చొచ్చుకు వచ్చిన ప్రపంచీకరణ, పాలకుల భిన్నస్వరాలు, ఆంగ్లభాష పెత్తనం అమ్మనుడుల అస్తిత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి, పలచన చేస్తున్నాయి. ఉభయ తెలుగురాష్ట్రాల ప్రజలు, భాషావేత్తలు, భాషాభిమానులు, పదవీ విరమణ పొందిన ప్రభుత్వోద్యోగులు, యువతరం ఈ భాషా కుట్రలపై ధ్వజమెత్తాల్సివుంది. త్రిభాషా సూత్రం అర్థమే మారిపోయింది. అన్ని భాషల్ని ఆంగ్లం తొక్కిపెడుతూ, తన పెత్తనాన్ని, ఆధిపత్యాన్ని అనంతంగా చాటుకుంటోంది. ఉత్తరాది హిందీ పెత్తనాన్ని కేంద్రం ఉద్దేశపూర్వకంగా రుద్దుతూనే ఉంది. మాతృభాషల ప్రాముఖ్యాన్ని గుర్తించిన యునెస్కో 1999 నవంబర్ 17న మాతృభాషల పరిరక్షణకు కృషిచేయాలని పిలుపునిచ్చింది. దీనిపై అప్పటినుంచి యునెస్కో డైరెక్టర్ జనరల్ సందేశాలు ఇస్తూనే ఉన్నారు. ఐక్యరాజ్య సమితి ఈ విషయాన్ని ధ్రువీకరించడంతో 2008 నుంచి మాతృభాషా పరిరక్షణ దినోత్సవాన్ని పాటిస్తున్నారు. అంతర్జాతీయంగా మాతృభాషా పరరక్షణోద్యమానికి వేదిక ఏర్పడి, భాషామేధావుల్లో భాషాపరిరక్షణ వంటి సరికొత్త ఆలోచనలకు ఈ దినోత్సవం స్ఫూర్తినిచ్చింది. ఢాకాలో బెంగాలీ పరిరక్షణమై ఉద్యమించి చెలరేగిన హింస, పోలీస్ కాల్పుల్లో ఎంతో మంది అశువులు బాశారు. వారి చైతన్యవంతమైన ఉద్యమాన్ని స్మరిస్తూ మాతృభాషాదినోత్సవ పరిరక్షణ భావనలకు యునెస్కో గట్టి పునాదులే వేసింది. ప్రపంచంలో 200 దేశాల్లో ఉన్న 730 కోట్ల జనాభాలో ఒకటి రెండు దేశాలే మినహాయించి అన్ని దేశాల్లో ప్రపంచీకరణ వల్ల మాతృభాషలు గడ్డుపరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు యునెస్కో నివేదికలు సహా భాషానిపుణులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అమ్మనుడులకు పెద్దపీటవేసే చైనా, జపాన్, జర్మన్, రష్యా వంటి దేశాల్లో మాతృభాషలపై ఆంగ్ల ప్రభావం, పెత్తనం పడుతోందన్న వార్తలు తరచుగా అందుతుండడం భాషావేత్తలకు ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 6700 భాషలున్నాయని చెబుతున్నారు. రెండు తెలుగురాష్ట్రాల్లో మాతృభాష అస్తిత్వ పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోంది. ఈరెండు రాష్ట్రాల్లో తెలుగు పట్ల తీసుకుంటున్న చర్యలు పెద్దగా ఆశాజనకంగా కనిపించడం లేదు. వారసత్వంగా సాధించుకున్నదంతా కరిగిపోయి. ఈ జాతి పరాయీకరణ బాటలో నడుస్తూ గుర్తింపు గౌరవాలను విదనాక తప్పని పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని భాషావేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలోయునెస్కో ప్రకటనలు భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఏ భాషైతే 30 శాతం మాట్లాడటం తగ్గిపోతే ఆ భాషా ఉనికికి ప్రమాద ఘంటికలు మొదలైనట్లేనని స్పష్టంచేసింది. ఆంగ్ల ఆధిపత్యంలో కూరుకుపోయిన మనం మాతృభాషా పరిరక్షణకు విధిగా ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడింది. తెలుగుభాషోద్యమ సంస్థలన్నీ ఒక గొడుగు కిందకు వచ్చి పోరాటపంథాను అవలంబిస్తే తప్ప ప్రభుత్వాల్లో, ప్రజల్లో మార్పులు రావన్నది భాషావేత్తల అభిప్రాయం. ఫిబ్రవరి 21న మాతృభాషా దినోత్సవంతో పాటు 1966 నుంచి సెప్టెంబర్ 8ని అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం, తెలుగునాట ఆగస్టు 29ని గిడుగు జయంతిని, సెప్టెంబర్ 21ని గురజాడ జయంతిని ఆధునిక తెలుగు సాహిత్య దినోత్సవంగా, సెప్టెంబర్ 9ని కాళోజీ జయంతిని తెలుగు మాండలిక భాషాదినోత్సవంగా, మే 28ని సురవరం ప్రతాపరెడ్డి జయంతిని తెలుగు వారసత్వ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు భాషా పరిరక్షణకు తెలుగు భాషోద్యమ సమాఖ్య, తెలుగురథం, తెలుగు దండు, తెలుగు రక్షణ సమితి, డా.వెల్చాల కొండలరావు తెలుగుభాష పరిరక్షణ సమాఖ్య వంటి భాషోద్యమ వేదకలు, తెలంగాణ సాహిత్య పరిషత్తు వంటివి ఒక్కతాటిపై పనిచేయాల్సి ఉంది. వివిధ వర్సిటీల్లో తెలుగు భాషా పీఠాలు, లింగ్విస్టిక్ భాషావిభాగాలు పనిచేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం ద్రావిడ భాషా విద్యాలయం 1997 నుంచి దక్షిణాది భాషళ పరిరక్షణకు కృషిచేస్తోంది. తెలుగు అకాడమి, తెలంగాణ సాహిత్య అకాడమి,తెలుగు విశ్వవిద్యాలయం వంటి ప్రభుత్వసంస్థలు మాతృభాషోద్యమంలో కీలకపాత్ర పోషించాల్సి ఉంది. దేశంలో 22 అధికార భాషలుండగా, తమిళ, కన్నడ, ఒరియా, మలయాళం, తెలుగు, సంస్కృతం వంటి ఆరుభాషలకు కేంద్రం నుంచి ప్రాచీనహోదా లభించింది. తెలుగు రాష్ట్రాల్లో ఏడుకోట్ల మంది జనాభా ఉండగా, జాతీయ, అంతర్జాతీయంగా మరో 11 కోట్ల మంది తెలుగు మాట్లాడే వారున్నారు. హిందీ తరువాత తెలుగు మాట్లాడేవారే ఎక్కువగా ఉన్నా తెలుగు భాషని ఇతర రాష్ట్రాల వారు పేర్కొనకపోవడంతో బెంగాలీ ద్వితీయస్థానంలోకి వచ్చి తెలుగు తృతీయ స్థానంలోకి నెట్టబడింది. ఇటీవలి కాలంలో తెలుగు మాధ్యమానికి స్వస్తిచెప్పి ఆంగ్ల మాధ్యమానికి తెరతీయాలని ప్రభుత్వాల విధానంగా మారడంతో తెలుగు మాధ్యమ పాఠశాలలు, కళాశాలలు మూతపడుతున్నాయి. అమ్మనుడికి ఘోరాపరాథం జరిగిపోతోంది. మాతృభాషైన తెలుగును కనీసం శిశువు నుంచి ఐదో తరగతి వరకు నేర్పాలని, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ భాషావేత్తల సర్వేలు, కొఠారి కమిషన్ లాంటి విద్యాకమిషన్లు సూచించినా ఫలితం కనిపించడం లేదు. ఆంగ్ల పాఠశాలలు ప్రైవేట్ రంగంలోకి చొచ్చుకుపోతున్నాయి. మాతృభాషా పరిరక్షణ కోసం కేవలం ర్యాలీలు, ప్రకటనలతో సరిపోదని, వివిధ వేడుకల్లో సమావేశాల్లో భాషోద్యమం ప్రభావం చూపినపుడే తెలుగు అమలు సాధ్యమవుతుందనిభాషావేత్తలు అంటున్నారు. 2018ని తెలుగు భాషా సాంస్కృతిక సంవత్సరంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల జరిగిన విజయవాడ పుస్తకమహోత్సంలో ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు అంతార్జాతీయ తెలుగు మహాసభలను నిర్వహించారు. దేశంలో హిందీ, ఆంగ్లం మినహా ఇతర మాతృభాషలు బతికి బట్టకట్టాలంటే కేంద్రం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ భాషా విధానాలు ప్రకటించాల్సి ఉందని భాషావేత్తలు చెబుతున్నారు. తెలంగాణ ఏర్పడిన మూడేళ్లలో రాష్ట్రప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన 8 వందల గురుకుల పాఠశాలు, కళాశాలల్లో తెలుగు ఊసే లేకుండా ఆంగ్ల మాధ్యమంలోనే ప్రారంభమయ్యాయి. ఇటీవల తెలుగు మహాసభల్లో మాత్రం ఇంటర్‌లో ఆప్షన్‌గా కాకుండా కచ్చితంగా తెలుగు సబ్జెక్టు తీసుకోవాలని జీవో తెస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ప్రాథమికస్థాయిలోవిద్యాబోధన అంశాన్ని భాషావేత్తలు ప్రస్తావిస్తున్నారు. ఉభయరాష్ట్రాల్లో తెలుగు ప్రాధికార సంస్థల ఏర్పాటు, ఎక్కడో ఒకచోట ప్రాచీన హోదా కార్యాలయం ఏర్పాటు వంటి అంశాలు మాత్రం చర్చకు రాలేదు. అధికార భాషా సంఘం ఒక్క తెలంగాణలో మాత్రం నామమాత్రంగా పనిచేస్తోంది.



జాతీయ, అంతర్జాతీయ భాషల ప్రభావం అమ్మభాషలకు అడ్డంకిగా మారింది. మనదేశంలో అంతర్జాతీయస్థాయిలో అత్యధికంగా 197 భాషలు అంతరించే దశకు చేరుకున్నాయి. వీటిల్లోనూ 81 భాషలకు ముప్పుప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. 42 భాషలు ఏ క్షణానైనా మనుగడ కోల్పోవచ్చు. ఆంగ్ల, హిందీ పరిజ్ఞానం ఉన్నవారికే ఉద్యోగావకాశాలుండడంతో 26 కోట్ల నుంచి 42 కోట్లకు, ఆంగ్లం మాట్లాడేవారి సంఖ్య 32 కోట్ల నుంచి 48 కోట్లకు పెరిగింది. ఇది 250 మాండలికాకు ముప్పుగా పరిణమించింది.భారత్‌లోని 780 భాషల్లో దాదాపు 400 భాషలువచ్చే యాభై ఏళ్లలో అంతరించే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని ప్రముఖ భాషావేత్త గణస్త్రష్ ఎన్.దేవి చేసిన ప్రకటన భాషావేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో అధికార భాషా సంఘానికి, సాహిత్య అకాడమీకి చట్టబద్ధత కల్పించడం, తెలుగు అమలుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేయడం, అంతర్జాతీయ తెలుగు అధ్యయన సంస్థను ఏర్పాటుచేయడం, సీబీఎస్ఈ పాఠశాలల్లో తెలుగులో బోధనకు చర్యలు తీసుకోవడం వంటి చర్యలనుతెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కృషిచేయవలసి ఉన్నది.

◆ సంకేపల్లి నాగేంద్రశర్మ
9441797650


తెలుగు సూర్యుడు

కవిత

మద మాత్సర్యాలతో విర్రవీగే
కారు మేఘాలు తమ కబంధ హస్తాల్లో
బాల భానుణ్ణి బందీని చేశాయి
పౌరుషంతో రగిలిన తెలుగు సూర్యుడు
పిడికిలి బిగించి, చీకటిని చీల్చుకుని
తెలుగు వెలుగులు ఆశీర్వాదాక్షితలుగా
జగతి నిండుగా చల్లుకుంటూ
తూరుపు కనుమల నుండి
తెలుగు తల్లికి సంభ్రమంగా సుప్రభాతం పలుకుతున్నాడు
మైమరచిన వేకువ తులసి వేదమంత్రాలు వల్లిస్తున్నది
తెలుగు వాకిట రమణీయపు రంగవల్లులు
పేడ కళ్ళాపి పచ్చి వాసనకు పరవశించి పోతున్నాయి
మామిడాకు తోరణాలు శుభ స్వాగతాలు పలుకుతున్నవి
పట్టు పావడాలు ఉగాది పండుగ జరుపుకుంటున్నాయి
తెలుగు కోయిలలు తేటగీతులై
తరతరాల తెలుగు చరిత్రను తేటతెల్లం చేస్తున్నాయి
తెలుగు పిల్ల తెమ్మెరలు వింజామరలై
అణువణువునూ పులకరింప చేస్తున్నాయి
కొలను లోని కమలములు
నిండు ముత్తైదువలై మంగళహారతులు పాడుతున్నయ్
ఓటమిని జయించిన వీరుడా! తెలుగు సూర్యుడా!
అజరామరం నీ తెలుగు వెలుగులు...

- కాసర లక్ష్మీ సరోజారెడ్డి
9440332632

మాతృభాష



మాతృభాష మాతృమూర్తి వంటిది
మమకారం వంటిది మాతృభాష
మానవత్వం ఉన్నది మాతృభాష
మతంలేనిది మాతృభాష
మనుషులందరికి అవసరం మాతృభాష
ప్రపంచీకరణాలు మానవత్వం ఉన్నది
ఒక్కటే మాతృభాష
మనుషులందరికి అవసరం మాతృభాష

- పి.శృతి
8వ తరగతి

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com

తూణీరం

మార్కెట్‌లో లభిస్తున్న వస్తువుల గురించి ఇవాళ వాణిజ్య ప్రకటనల ద్వారానే సమాచారం అందుతున్నప్పటికీ, ఆ సమాచారం తప్పుదోవ పట్టించేదిగానే ఉండడం శోచనీయం. ఇది ఎంతటి సామాజిక రుగ్మతలకు దారితీస్తుందో ఇక్కడ మానసిక నిపుణులు, సామాజిక కార్యకర్తల మాటల్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

పదం

'డిసెప్టివ్ అడ్వర్‌టైజ్‌మెంట్స్' (మోసపూరిత ప్రకటనలు) : వినియోగదారుల్ని తప్పుదోవ పట్టించే చర్య లేదా వ్యక్తీకరణ లేదా కార్యక్రమం లేదా ఉపమానం వంటివి మోసపూరిత ప్రకటనల కిందికి వస్తాయి. ఇలాంటి విషయాల్లో ఫిర్యాదులు అందినట్టయితే, ఆయా ప్రకటనల్లోని అభ్యంతరకర సమాచారాన్ని ఫిర్యాదుదారు నిరూపించాల్సి ఉంటుంది.

పథం

అత్యున్నతమైన వ్యక్తి ఏది సరైనదో అర్థం చేసుకుంటాడు, అథముడు ఏది సులభంగా అమ్ముడవుతుందో అర్థం చేసుకుంటాడు.

- చైనీస్ తత్త్వవేత్త కన్ఫ్యూషియస్

అబద్ధాలే!



- డాక్టర్ వీరేందర్, సైకాలజిస్ట్

ముద్ర: ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యాల మీద వాణిజ్య ప్రకటనల ప్రభావం ఎలా ఉంటుందో చెబుతారా?

డాక్టర్ వీరేందర్: సమాజంలో అత్యధికులు మార్కెట్‌లో లభించే వస్తువుల గురించిన సమాచారాన్ని తెలుసుకోవడానికి వాణిజ్య ప్రకటనల మీదే ఆధారపడుతున్నారు. అయితే ముఖ్యంగా యువత..., అమ్మాయిలు, అబ్బాయిలు ఈ ప్రకటనల మోజులో పడి శారీరక సౌందర్యమే నిజమైన సౌందర్యంగా నమ్ముతున్నారు. రోజంతా తమ శరీరాలు ప్రకటనల్లో చూపించిన విధంగా అందంగా లేవని అసంతృప్తి చెందుతున్నారు. వాణిజ్య ప్రకటనలు ప్రజల్ని భౌతికంగా, మానసికంగా, ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి. అందుకే మేము కొన్ని ప్రత్యేక రంగాల్లో ఇలాంటి ప్రకటనల్ని నిషేధించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. ఉదాహరణకు పాలిచ్చే తల్లుల విషయమే తీసుకోండి, అందం గురించిన అవాస్తవాల్ని ఇలా ప్రకటనల ద్వారా వ్యాప్తి చేయడం వల్ల, పుట్టిన పిల్లలకు తల్లిపాలు అందడం లేదు. దాంతో పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది.

అమానవీయం!

- దేవి, సామాజిక కార్యకర్త

ముద్ర: వాణిజ్య ప్రకటనల్లో మానవీయ, సామాజిక కోణాలు ఎంతవరకు ప్రతిబింబిస్తున్నాయి?

దేవి: నిజానికి వాణిజ్య ప్రకటనలన్నవే మానవీయ విలువలకు వ్యతిరేకమైనవి. ఇవి కేవలం సరుకు అమ్మకాలకు మాత్రమే సంబంధించినవి. అయితే తమ వస్తువుల్ని అమ్ముకోవడం కోసం మనుషుల మనసులో ఏదో ఒక మూలను తాకే అంశాల్ని తీసుకుని, ఆ భావోద్వేగాల్ని కూడా దుర్వినియోగ



పరుస్తున్నారు. ఉదాహరణకు వజ్రాల వ్యాపారానికి సంబంధించిన ఒక వాణిజ్య ప్రకటనలో ఒక గర్భవతికి భర్త వజ్రాల్ని బహూకరిస్తాడు. చూడ్డానికి ఇదంతా మనుషుల మధ్య ప్రేమానుబంధాలకు సంబంధించిన సానుకూల వ్యవహారంగానే కనిపిస్తుంది. కానీ ఇలాంటి ప్రకటనల ద్వారా వీళ్ళు ప్రేమానుబంధాల్నే ఏకమొత్తంగా అవమానిస్తున్నారు. వస్తువును దాని గుణగణాలతో అమ్మడం మానేసి, మానవసంబంధాల్ని వ్యాపార వస్తువును చేయడం మాత్రం అమానవీయం.



తప్పుడు సందేశాలే!



- రమణారెడ్డి, ప్రముఖ చిత్రకారులు, శిల్పి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు

ముద్ర: సృజనాత్మకత పేరుతో లక్షలాది వాణిజ్యప్రకటనల్ని రూపొందిస్తున్నారు. అయితే ఇదంతా సామాజిక బాధ్యతతోనే జరుగుతోందా?

రమణారెడ్డి: సృజనాత్మకతకు రెండు ముఖాలుంటాయి. దాన్ని మంచికి, చెడుకు కూడా ఉపయోగించుకునే వీలుంది. అయితే ఆర్టిస్టు లేదా వాణిజ్య ప్రకటనల రూపకర్త తన చేతిలో ప్రతిభ ఉంది కదాని సమాజానికి తప్పుడు సందేశాలు ఇవ్వకూడదు. తన సృజనాత్మకతను సమాజంలోని అత్యధిక ప్రజానీకాన్ని తప్పుదోవ పట్టించేందుకు ఉపయోగించకూడదు. సృజనాత్మకత అన్నది ఒక శక్తిమంతమైన ఆయుధం. అందుకే ఇలాంటి సృజనకారులకు ప్రజల పట్ల బాధ్యత ఉండితీరాలి. ప్రజల్ని తప్పుదోవ పట్టించకూడదు. ఉన్నదాని కంటే అతిగా చూపించడం, ప్రలోభ పెట్టడం వంటివి చేయకూడదు. తాము ఏ వస్తువు గురించి చెబుతున్నారో, దాని గుణాల్ని, గొప్పతనాన్ని చెబితే చాలు. తప్పుడు సందేశాలు ఇవ్వకూడదు.

ఇంటర్వ్యూలు : పసుపులేటి గీత

ఏది సత్యం? ఏదసత్యం?

సంశయాత్మకంగా భారతీయ వాణిజ్య ప్రకటనల శైలి


'వాణిజ్య ప్రకటనలన్నీ చట్టబద్ధమైన అబద్ధాలే' అని ఆంగ్ల రచయిత హెచ్.జి. వెల్స్ ఏనాడో చెప్పారు. వాణిజ్య ప్రకటనలు అంటే వినియోగదారుల్ని ఆకర్షించి, వారి నుంచి డబ్బు రాబట్టే కళ. నిజానికి ఇది నూటికి తొంభై శాతం డబ్బు తప్ప మరే ఇతర ప్రయోజనాల్ని ఆశించి చేసే పని కాదు. యాక్స్ డియోడరెంట్ (శరీర సుగంధాన్ని పెంచే ద్రవ్యం) తాలూకు వాణిజ్య ప్రకటనలో చెప్పినట్టు, తన జీవితంలో ఎలాంటి మార్పు జరగలేదని ఒక వ్యక్తి ఆ మధ్య కోర్టుకెక్కాడు. యాక్స్ కంపెనీ వాగ్దాన భంగం చేసిందన్నది ఆ వ్యక్తి అభియోగం. ఆ వాణిజ్య ప్రకటనలో ఫలానా డియోడరెంట్‌ను వాడితే అమ్మాయిలు అబ్బాయిల కోసం క్యూలు కడతారని చెప్పారు. అయితే తాను అదే డియోడరెంట్‌ను వాడినా ఒక్కమ్మాయి కూడా తన వెంట పడలేదని ఆ వ్యక్తి ఆవేదన చెందుతూ కోర్టును ఆశ్రయించాడు! మరో తాజా వాణిజ్య ప్రకటన చూద్దాం, బడికి ఆలస్యమైపోయింది. స్కూలు తలుపులు మూసేశారు. కొందరు పిల్లలు ఆలస్యంగా వచ్చారు. వాళ్ళని స్కూలు వాచ్‌మ్యాన్ లోపలికి రానివ్వలేదు. ఎంత వేడుకున్నా అతను తలుపులు తీయడం లేదు. అంతలో ఒక కుర్రాడు మోకాలు పట్టుకుని, కుంటుతూ వచ్చి, 'కింద పడిపోయాను....' అంటూ దీనంగా మొహం పెడతాడు. ఆ పిల్లవాడి మోకాలికి గాయమై ఉంటుంది. వాచ్‌మ్యాన్‌కు జాలేస్తుంది. గేటు తీసి ఆ పిల్లవాణ్ణి లోపలికి రమ్మంటాడు. పిల్లవాడు లోపలికి వచ్చి, గేటు బయట నిలబడి పోయిన మిగతా పిల్లల్ని చూస్తూ, 'ఫలానా టాటూ వేసుకో..., వెధవని చేసెయ్...!' అంటూ వెర్రిగా నవ్వుతాడు. అంటే వాడి మోకాలికి తగిలిన దెబ్బ నిజంగా దెబ్బ కాదు, అదొక టాటూ అన్న మాట. ఏదో మిఠాయో, చాక్లెట్టో ... గుర్తు లేదు కానీ, దాన్ని కొంటే దెబ్బల్లాంటి టాటూల్ని ఉచితంగా ఇస్తారట. అయితే, ఇక్కడ గుండెల్లో కలుక్కుమనే విషయం ఏమిటంటే, దెబ్బ తగిలిన పిల్లవాడు కదాని, జాలి తలచి బడిలోకి రానిస్తే, ఐదేళ్ళ పిల్లవాడు ఆ జాలిని, మానవతా దృక్పథాన్ని హేళన చేస్తూ, 'వెధవని చేసెయ్...' అనడం మాత్రం ఒకింత ఆలోచనలో పడేస్తుంది. ఒకానొక కంపెనీ తాలూకు నూడుల్స్‌లో హానికారక పదార్థాలున్నట్టు ఇటీవల వెల్లడైన నేపథ్యంలో పెద్దదుమారమే చెలరేగింది కదా, ఆ సమయంలో ఇతర నూడుల్ కంపెనీలు తమ ఉత్పాదనల్లో ఎలాంటి హానికారక పదార్థాలు లేవని చెప్పుకుంటూ వాణిజ్య ప్రకటనల్ని తయారు చేయాల్సి వచ్చింది. తమ మీద వచ్చిన ఆరోపణల్ని తప్పని నిరూపించడానికి అప్పటికప్పుడు నడుం బిగించే వాణిజ్య సంస్థలు, తమ వస్తువుల్ని అమ్ముకోవడానికి ప్రకటనల పేరిట నానా అబద్ధాలు ఆడతాయన్నది జగద్విదితం.

భారతీయ వాణిజ్య ప్రకటనల చరిత్రలో ఎన్నో చేదు అనుభవాలున్నాయి. ఒక వస్తువుకు మార్కెట్‌లో మంచి డిమాండ్‌ను కల్పించడంలో వాణిజ్య ప్రకటన ప్రధాన పాత్రను పోషిస్తుంది. వార్తాపత్రికలు, టీవీ ఛానెళ్ళు, అంతర్జాలం వంటి మీడియా వేదికగా ఈ వాణిజ్య ప్రకటనలు సమాజం ముందుకు వస్తుంటాయి. మార్కెట్ వస్తువుల రూపంలో మన ఆర్థిక సామర్థ్యాన్ని, ఉద్వేగాల రూపంలో మన కుటుంబ సంబంధాల్ని ప్రభావితం చేస్తూనే ఉంటుంది.

శరవేగం

ఛలోక్తులతో, హాస్యరస స్ఫోరకమైన వ్యక్తీకరణలతో, సున్నితమైన, సునిశితమైన సందేశాలతో పాటు చవకబారు సంస్కృతిని కూడా సమాజం మీద వెదజల్లుతోంది భారతీయ వాణిజ్య ప్రకటనల రంగం. కొన్ని వాణిజ్య ప్రకటనలు పాఠకుల్ని, ప్రేక్షకుల్ని ఇబ్బందిపెడుతుంటే, మరికొన్ని వారి సహనాన్ని పరీక్షిస్తుంటాయి. భారతీయ వాణిజ్య ప్రకటనల రంగం చిన్నపాటి వ్యాపారంగా మొదలై, ఇవాళ స్థూల జాతీయ ఆదాయంలో గరిష్టశాతం వాటాను కలిగి ఉండేంత పెద్ద పరిశ్రమగా మారిపోయింది. ఆసియా ఖండంలో చైనా తరువాత భారతీయ వాణిజ్య ప్రకటనల రంగమే శరవేగంతో ముందుకు దూసుకు వెళుతోంది. భారతీయ గరిష్ట జాతీయ ఆదాయంలో వాణిజ్య ప్రకటనల వాటా ప్రస్తుత ఏడాదికి 0.45 శాతానికి పెరిగింది. దేశంలో వాణిజ్య ప్రకటనల రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం కూడా పలు అవకాశాల్ని కల్పిస్తోంది. ప్రకటనల మీద పెట్టే ఖర్చు ఆర్థిక రంగాన్ని పరిపుష్టం చేయడానికి ఉపయోగపడుతుందన్న భావనతో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ రంగానికి అనుకూలంగా తన విధివిధానాల్ని రూపొందించుకుంది. వాణిజ్య ప్రకటనల ఆదాయంలో వార్తాపత్రికలు 41.2 శాతాన్ని, టెలివిజన్ రంగం 38.2 శాతాన్ని, డిజిటల్ ప్రకటనల రంగం 11 శాతాన్ని, రేడియో, సినిమా, తదితర మాధ్యమాలు పదిశాతాన్ని కలిగి ఉన్నాయి. భారతీయ డిజిటల్ వాణిజ్య ప్రకటనల ఆదాయం 2020 నాటికి 25,500 కోట్ల రూపాయలకు పెరగనున్నదని కొన్ని అంచనాల్లో తేలింది. ఆన్‌లైన్ వాణిజ్య ప్రకటనల ఆదాయం 2013 నుంచి 2018 నాటికి పదివేల కోట్ల రూపాయలకు పెరిగింది.

వీక్షణం




182 దోషాలు

పెరుగుతున్న ప్రకటనల ఆదాయాన్ని చూసి సంతోషపడాలా, లేక తరుగుతున్న విలువల గురించి బాధపడాలా? భారతీయ వాణిజ్య ప్రకటనల నియంత్రణ మండలిగా చెప్పుకోదగిన 'భారతీయ వాణిజ్య ప్రకటనల ప్రమాణాల మండలి' (ఎఎస్‌సిఐ) గత ఏడాది నవంబర్ నెలలో 182 వాణిజ్య ప్రకటనల్ని మోసపూరిత ప్రకటనలుగా తేల్చింది. వీటిలో కెల్లాగ్స్, ఇమామి, కెవిన్ కేర్, ఏషియన్ పెయింట్స్, ఎల్‌జి ఎలక్ట్రానిక్స్, హోండాకార్స్ ఇండియా, రిలయెన్స్ రీటైల్ వంటి హేమాహేమీ వాణిజ్య సంస్థల తాలూకు ప్రకటనలు కూడా ఉన్నాయి. ఎఎస్‌సిఐకి చెందిన ఫిర్యాదుల విభాగం 'కస్టమర్ కంప్లైంట్స్ కౌన్సిల్' (సిసిసి) నవంబర్, 2017లో 243 ఫిర్యాదుల్ని స్వీకరించింది. ఎఎస్‌సిఐ ఏకమొత్తంగా స్వీకరించిన 243 ఫిర్యాదుల్లో 152 వాణిజ్య ప్రకటనల్ని సుమోటోగా స్వీకరించి, విచారణ జరిపింది. ఎఎస్‌సిఐ విచారణ జరిపిన ఫిర్యాదుల్లో ఆరోగ్య రంగానికి సంబంధించిన 65 ప్రకటనలు, విద్యారంగానికి సంబంధించిన 96 ప్రకటనలు, వ్యక్తిగత సంరక్షణకు సంబంధించిన మూడు ప్రకటనలు, ఆహార, పానీయాలకు సంబంధించిన ఏడు ప్రకటనలు, ఇతర రంగాలకు సంబంధించిన 11 ప్రకటనలు ఉన్నాయి. ఫేస్‌బుక్ యాప్‌కు సంబంధించిన ఒక ప్రకటన మీద కూడా ఫిర్యాదు వచ్చింది. ఫేస్‌బుక్ యాప్ అన్నివిధాలా అందుబాటులో ఉందని చెప్పినప్పటికీ, ఆ యాప్ కేవలం వెబ్ బ్రౌజర్ ద్వారా మాత్రమే అందుబాటులో ఉందని తేలింది. ప్రకటనలో చెప్పిన విషయం అసత్యమని తెలుస్తోంది. కెల్లాగ్స్‌కు సంబంధించిన ఓట్స్, స్పెషల్ కె వాణిజ్య ప్రకటనలు కూడా ఎఎస్‌సిఐ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టు తేలింది. 'ఇన్‌వర్టర్ లీనియర్' సౌలభ్యంతో లభించే ఎల్‌జి రిఫ్రెజిరేటర్లలో వారం రోజుల పాటు కాయగూరల్ని నిల్వ చేసుకోవచ్చునంటూ చేసిన ప్రకటన కూడా అసత్యాల పుట్ట అని తేలింది. ఎందుకంటే ఈ సౌలభ్యం లేని ఫ్రిజ్‌లలో కూడా కాయగూరలు వారం రోజుల పాటు నిల్వ ఉంటాయి. ఏషియన్ పెయింట్స్ రాయల్ అట్మోస్ వాణిజ్య ప్రకటనలో గదిలోని గాలి కాలుష్యాన్ని ఆ పెయింట్ హరించి వేస్తుందని చెప్పారు. అది నిజానికి ఆచరణ సాధ్యం కాని విషయమని ఎఎస్‌సిఐ అభిప్రాయపడింది. రోజంతా సగటు మనిషి తన జీవనపోరాటంలో అలసిపోయి సేదతీరేందుకు ఆధారపడేది టీవీ, సినిమా, తరువాత ఆన్‌లైన్ బ్రౌజింగ్‌ల వంటి సౌకర్యాల మీదే. కానీ ఈ వేదికలన్నీ ఇప్పుడు వాణిజ్య సంస్థలు తమ ఉత్పాదనల గురించి బాకాలు వాయించుకోవడానికి ప్రకటనల అడ్డాలుగా మారిపోతున్నాయి. రాజకీయ పార్టీలు కూడా ఓట్ల పండుగ నాడు చేసిన వాగ్దానాల్ని గాలికి వదిలేయడంలో కాకలు తీరిన అనుభవాన్ని ప్రదర్శిస్తున్నాయి. 'సత్యం' అనేది ఒక సంస్కారం. వ్యవస్థలోని అణువణువూ ఆ సంస్కారంతో నిండితే తప్ప ఇక్కడ వాగ్దానాలకు అసలైన ప్రయోజనం సిద్ధించదు.


- కల్కి

మెరుపు



సృ'జనా'త్మకం

సృజనాత్మకత కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి రూపొందించే వాణిజ్య ప్రకటనల్లో వెదకడం నేతిబీర కాయలో నెయ్యి కోసం వెదకడం వంటిదే! అయినప్పటికీ కొన్ని వాణిజ్య ప్రకటనలు కొత్తతరహా ఆలోచనా విధానాన్ని ప్రజలకు పరిచయం చేయడం ముదావహమే. డబ్బు కోసం విడుదల చేసే వాణిజ్య ప్రకటనల్లో కొన్ని మనసును తాకే భావవ్యక్తీకరణను కలిగి ఉండడాన్ని మనం గమనించవచ్చు. ఉదాహరణకు ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ వారి 'పాపాకి పప్పీ' ప్రకటననే తీసుకుంటే, తల్లిదండ్రులు వృద్ధులైన తరువాత వారికి తమ పిల్లలే తల్లిదండ్రులవ్వాల్సిన అవసరాన్ని చెబుతుందీ వాణిజ్యప్రకటన. 'డాబర్ వాటిక' వారి 'బేర్ అండ్ బ్యూటిఫుల్' ప్రకటనలో ఒక మహిళా కాన్సర్ రోగి జబ్బు నుంచి కోలుకున్నప్పటికీ, కిమోథెరపీ వల్ల జుట్టంతా రాలిపోగా, ఆమెను తోటివారు ఎంత ఆప్యాయంగా స్వీకరిస్తారో ఈ వాణిజ్య ప్రకటన చెబుతుంది. అలాగే 'నిర్మా' వారి అంబులెన్స్ ప్రకటన కూడా మహిళల్ని సబలలుగా చూపుతుంది. ఏరియల్ వాషింగ్ పౌడర్ వాణిజ్యప్రకటనలో బట్టలు ఉతకడమన్నది కేవలం మహిళల పని మాత్రమే కాదని, అలాంటి పనుల్లో లైంగిక వివక్షకు తావులేదని చెబుతుంది. అలాగే సామాజిక సమస్యల మీద ప్రతిస్పందిస్తూ విడుదల చేసే ప్రకటనల్లో నిజమైన సృజనాత్మకత మనకు కళ్ళకు కడుతుంది. అలాంటి కొన్ని సామాజిక సందేశాలకు సంబంధించిన ప్రకటనల్ని ఇక్కడ చూద్దాం.



బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా రూపొందించిన ప్రకటన.

కిటికీ



మద్యం సేవించి వాహనాన్ని నడపరాదంటూ రూపొందించిన ప్రకటన.



ధూమపాన నిషేధాన్ని ఉద్దేశించిన ప్రకటన.

దేశమంతటికీ ఒకే ట్రైబ్యునల్

జాతీయ స్థాయిలో ఏర్పాటు



హైదరాబాద్, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): రాష్ట్రాల మధ్య నదులకు సంబంధించి ఇకపై ప్రత్యేకంగా ట్రైబ్యునళ్లు ఉండవని, దేశమంతా ఒకే ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తామని కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రకటించారు. ప్రస్తుతం జరుగుతున్న కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో ఒకే ట్రైబ్యునల్ బిల్లును ఆమోదిస్తామని వెల్లడించారు. రాష్ట్రాల మధ్య జలజగడాలు జాతీయ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయిన, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. అర్జున్‌రామ్ మేఘ్వాల్ నేతృత్వంలో హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల జలవనరుల ప్రాంతీయ సదస్సు జరిగింది. దక్షిణాది రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులు హాజరయ్యారు. ఈ సదస్సులో జలవివాదాలకు అంతం పలకడం, కోర్టుల వెలుపల పరిష్కారాలే లక్ష్యంగా చర్చ జరిగింది. సదస్సులో దక్షిణాది రాష్ట్రాల జలవివాదాల పరిష్కారానికి రోడ్ మ్యాప్‌పై చర్చించారు. సమావేశం అనంతరం మేఘ్వాల్ మాట్లాడుతూ.. జలవివాదాలకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. కోర్టులు, ట్రైబ్యునళ్ల వల్ల కాలయాపన, వృథా ఖర్చు జరుగుతోందని తెలిపారు. ఏళ్ల తరబడి జాప్యం వల్ల సమస్య మరింత జఠిలమవుతుందన్నారు. సమస్య ఎంత త్వరగా పరిష్కారమైతే అంత త్వరగా అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. జలవివాదాల పరిష్కారం ప్రధాని ప్రాధాన్యతల్లో ఒకటి అని మేఘ్వాల్ గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితుల అవగాహనకు, సమస్యల ముగింపునకు కార్యాచరణపై నితిన్ గడ్కరీ తనను ఇక్కడికి పంపారని తెలిపారు. సంక్లిష్టమైన వ్యవహారాలను ఇంకా జఠిలం చేయొద్దని కేంద్ర మంత్రి సూచించారు. తమిళనాడు-కర్ణాటక మధ్య జలవివాదాలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు దరిమిలా ఆరు వారాల్లో కావేరి మేనేజ్ మెంటు బోర్డు, కావేరి రెగ్యులేటర్ అథారిటీని ఏర్పాటు చేస్తున్నామని కేంద్రమంత్రి ప్రకటించారు. రాష్ట్రాలలో సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు పెంచుతామని, నాబార్డు వంటి సంస్థలు, లేదా ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారుజ దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను హైదరాబాద్ డిక్లరేషన్ గా పిలవవచ్చునని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సదస్సు రొటీన్ సమావేశం కాదని, ఇందులో చేసే తీర్మానాలతో జల వివాదాల పరిష్కారం దిశగా రోడ్ మ్యాప్ సిద్ధమవుతుందని తెలిపారు. సంక్లిష్టమైన వ్యవహారాలను ఇంకా జఠిల చేయొద్దని ఆయన దక్షిణాది ఇరిగేషన్ మంత్రులు,ఉన్నతాధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

గోదావరిలో నీటి లభ్యతపై అధ్యయనం తర్వాతే అనుసంధానం: హరీశ్

గోదావరిలో నీటి లభ్యతపై సమగ్ర అధ్యయనం చేసిన తర్వాత, తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన 1500 టీఎంసీల నీటి అవసరాలు తీరాక నదుల అనుసంధానంపై నిర్ణయం తీసుకోవాలని దక్షిణాది రాష్ట్రాల జలవనరుల ప్రాంతీయ సదస్సులో మంత్రి హరీశ్‌రావు వాదించారు. నదుల అనుసంధానంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అయితే తమ రాష్ట్రప్రయోజనాలను పరిరక్షించుకోవడం తమ ప్రాథమిక బాధ్యత అని ఆయన అన్నారు. గోదావరి బేసిన్ లో తెలంగాణకు 954 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. కృష్ణాలో ఇప్పటికే నీటి కొరత ఏర్పడిందని, మరోవైపు కర్ణాటకలోని ఆల్మట్టి ఎత్తు పెంపునకు బ్రిజేష్ ట్రిబ్యూనల్ అనుమతించినందున భవిష్యత్తులో నదిలో దిగువ రాష్ట్రాలకు మరింత నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నది. కాబట్టి కృష్ణా ప్రాజెక్టుల్లో నీటి కొరతను అధిగమించడానికి తాము గోదావరిపైననే ఆధాపడవలసి వస్తుందని హరీశ్ అన్నారు .కాబట్టి నదుల అనుసంధానం జరపడానికి ముందు రాష్ట్రాల అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని మంత్రి సూచించారు. కాగా, కృష్ణాలో వాడుతున్న 299 టీఎంసీలతోపాటు అదనంగా మరో 260 టీఎంసీల నీటిని వాడుకునేందుకు తెలంగాణ ప్రయత్నిస్తోందని సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఆరోపించింది. వాటిని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తిప్పికొట్టారు. ఏపీవినిరాధారమైన ఆరోపణలు చేస్తున్నదన్నారు. ఆర్డీఎస్ ఆధునీకరణ విషయంలోనూ ఇదే ధోరణిని ఆంధ్రప్రదేశ్ ప్రదర్శిస్తున్నట్టు పేర్కొన్నారు. తుమ్మిల్ల లిఫ్ట్ పథకం వల్ల రాయలసీమ ప్రాంతానికి నష్టం జరుతుందని ఏపీసలహాదారు చేసిన ఫిర్యాదును మంత్రి హరీశ్ రావు ఖండించారు. ఆర్డీఎస్ ద్వారా 87,000 ఎకరాలకు సాగునీరందవలసి ఉండగా ఏనాడూ 20 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందించలేకపోయినట్టు చెప్పారు. తాము బచావత్ ట్రైబ్యునల్ కేటాయించిన 15.90 టీఎంసీలకు మించి ఒక్క చుక్క ఎక్కువ వాడుకోబోమనిని మంత్రి అన్నారు. ఆర్డీఎస్ ఆనకట్ట ఎత్తు పెంచుతున్నారని, తద్వారా సుంకేశుల ఆయకట్టుకు నష్టం వాటిల్లుతుందని ఏపీ ఆరోపణలను కూడా మంత్రి హరీశ్‌రావు ఖండించారు. నిజానికి ఆర్డీఎస్ ఆనకట్ట ఎత్తుని ఒక అడుగు పెంచాలని నిపుణుల కమిటీ సిఫారసు చేసినా 6 ఇంచులు మాత్రమే పెంచడానికి టెండర్లు పిలిచారని మంత్రి గుర్తు చేశారు. పనులు చేపట్టిన ప్రతీసారి ఆంధ్రప్రదేశ్ శాంతి భద్రతల సమస్యను సృష్టించి పనులను ఆపుతున్నారని జోషి అన్నారు. నదీజలాల పంపిణీ విషయంలోనూ 'రూల్ ఆఫ్ లా' అమలు చేయాలని సీఎస్ జోషి వ్యాఖ్యానించినప్పుడు ఆయనతో కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ కూడా ఏకీభవించారు. ఏపీ ఫిర్యాదులు, అభ్యంతరాలపట్ల కేంద్రమంత్రి విస్మయం ప్రకటించారు. తెలంగాణలో సాగునీటి వసతి పెరిగితే అది దేశానికే మంచిదని, పాకిస్థాన్‌కు కాదని ఏపీకి చురకలు అంటించారు. కాగా, జలవివాదాలకు సంబంధించి ఒక రాష్ట్రం కోసం ఒక ట్రైబ్యునల్ పెట్టడం వల్ల ఏళ్ల తరబడి కాలయాపన జరుగుతున్నదని మంత్రి హరీశ్ రావు అన్నారు. దీంతో దీర్ఘకాలికంగా సమస్యలు పరిష్కరించలేక పోతున్నట్టు తెలిపారు. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ 14 సంవత్సరాలుగా పనిచేస్తున్నా ఇప్పటి వరకు తుది తీర్పు రాలేదన్నారు.

ఈ ప్రతిపాదనను కేంద్ర మంత్రి ఆమోదిస్తూ.. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు తెస్తామని ప్రకటించారు. తెలంగాణలో కొత్త ప్రాజెక్టులేవీ నిర్మించడం లేదని, పాతవి, ఆన్ గోయింగ్ ప్రాజెక్టులనే పూర్తి చేస్తున్నామని హరీశ్ స్పష్టం చేశారు. పోలవరం వల్ల తెలంగాణలో ముఖ్యమైన కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్నట్టు చెప్పారు. కేంద్రం జోక్యం చేసుకొని ముంపు నివారణకు చర్యలు తీసుకో వాలని కేంద్రాన్ని కోరారు. ఈ సమావేశంలో కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో సహా ఆరు రాష్ట్రాల అధికారులు, ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీలు,కేంద్ర జలసంఘం ఛైర్మన్ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మెట్రో వేగం పెంచండి

(మొదటి పేజీ తరువాయి)



కార్యకలాపాలపై బేగంపేట మెట్రో రైల్ భవన్‌లో మంత్రి కేటీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దీనికి మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. తొలుత మెట్రో పనితీరును గురించి మంత్రి వాకబు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైళ్ల సంఖ్యను, సమయాన్ని పెంచేందుకు ప్రయత్నించాలని సూచించారు. మెట్రో టికెటింగ్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. మెట్రో స్టేషన్ నుంచి ప్రయాణికులు సమీపంలోని ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సు సదుపాయంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఆర్టీసీతోపాటు ఇతర అంశాలను పరిశీలించాలన్నారు. సెట్విన్ వంటి సంస్థల ఆధ్వర్యంలో 100 ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. మెట్రో కారిడార్‌లో పార్కింగ్, ఫుట్‌పాత్, రోడ్ల వంటి మౌలిక వసతుల కల్పన వేగంగా జరగాలన్నారు. మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ మాట్లాడుతూ.. రైళ్ల సర్వీసుల సంఖ్యతోపాటు వేగాన్ని త్వరలో పెంచుతామని దీని ద్వారా ప్రయాణ సమయం మరింత తగ్గుతుందని మెట్రోరైల్ ఎండీ ఎన్వీయస్ రెడ్డి మంత్రికి తెలిపారు. ఇతర మెట్రోలతో పోల్చితే హైదరాబాద్ మెట్రోలో ప్రయాణీకుల సంఖ్య బాగుందన్నారు. చెన్నై లాంటి నగరాల్లో రెండు సంవత్సరాల్లో ప్రయాణిస్తున్న సంఖ్యతో పోలిస్తే నగర మెట్రోలో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉందని మెట్రో అధికారులు కేటీఆర్‌కు చెప్పారు. ప్రారంభం నాటి నుంచి ఇప్పటిదాకా ఎలాంటి సమస్యలు లేకుండా మెట్రో కార్యకలాపాలు నడుస్తున్నాయన్నారు. అలాగే.. పార్కింగ్ సదుపాయాన్ని మరింత పెంచడం కోసం 12 మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయాలకు టెండర్లు పిలుస్తున్నామని వివరించారు. నాంపల్లి మెట్రో స్టేషన్ వద్ద ఈఎంఎల్పీ సదుపాయానికి వారం పది రోజుల్లో టెండర్లు పూర్తి కానున్నట్లు తెలిపారు. ఉప్పల్ స్టేడియం నుంచి మెట్రో స్టేషన్ వరకు స్కైవాక్ నిర్మాణానికి స్టేడియం అథారిటీ ఆసక్తి వ్యక్తం చేసిందన్నారు. మెట్రో స్టేషన్లతోపాటు, ఆయా కారిడార్లలో మూత్రశాలలు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మెట్రోలో మిగిలిన కారిడార్ల నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని, ఆయా కారిడార్ల పనుల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. అమీర్‌పేట్ నుంచి హైటెక్ సిటీ వరకు పనులు వేగంగా నిర్వహిస్తున్నామని అధికారులు మంత్రికి తెలిపారు. మెట్రో రెండో దశ ప్రణాళికలపైన ఈ సందర్భంగా మంత్రి చర్చించారు. కారిడార్ల ఎంపిక, స్టేషన్ల గుర్తింపు, నిధుల సేకరణ వంటి అంశాలపైన ఒక నివేదిక సిద్ధం చేయాలని, త్వరలో ముఖ్యమంత్రి ఈ అంశంపై సమీక్షించే అవకాశం ఉన్నదని అధికారులకు తెలిపారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో (మెట్రోరైలు) ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి అదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్ట్‌కు కనెక్టివిటి ఉండేలా ప్రణాళికలు తయారు చేయాలని మెట్రో అధికారులను కోరారు.

ఓ జిల్లా బదులు మరో జిల్లాలో!

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. దీనిపై అభ్యర్థులు, విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. విద్యార్థులు ఎంచుకున్న జిల్లాలోనే పరీక్షాకేంద్రాన్ని కేటాయించాలని డిమాండ్ చేశాయి. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడం తగదని హితవు పలికాయి. టీఎస్‌పీఎస్‌సీ అధికారులు తమ చేతగాని తనాన్ని సీజీజీ మీదకు నెట్టేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని పలువురు అభ్యర్థులు ఆరోపించారు.

హాల్‌టికెట్ల జారీ నిలిపివేత..

అభ్యర్థుల నుంచి ఎదురైన వ్యతిరేకత కారణంగా టీఆర్‌టీ హాల్ టికెట్ల జారీని నిలిపివేస్తున్నామని టీఎస్‌పీఎస్‌సీ ప్రకటించింది. అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్ ప్రకారం కాకుండా దూరంగా పరీక్షా కేంద్రాలు కేటాయించారని, దీనిపై పునరాలోచించాలని అభ్యర్థులు చేసుకున్న విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని మంగళవారం సాయంత్రం అధికారులు ప్రకటించారు. సరిచేసిన హాల్‌టికెట్లను టీఎస్‌పీఎస్‌సీ వెబ్‌సైట్‌లో త్వరలో ఉంచుతామని పేర్కొన్నారు. ఇదివరకే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థులు మరోసారి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్షా కేంద్రాల మార్పునకు అనుగుణంగా పరీక్షకు హాజరుకావాలని సూచించారు.పరీక్ష వాయిదా పడుతుందనే వదంతులను నమ్మవద్దని అధికారులు కోరారు.

ఎంపీల జీతాల పెంపుకు ఓ పద్ధతి లేదా!

- మార్చి 6లోగా సమాధానమివ్వండి
- కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పార్లమెంట్ సభ్యుల వేతనాల పెంపుకు ఒక నిర్దిష్టమైన విధానాన్ని ఎందుకు అనుసరించడం లేదని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. 2006లో ఎంపీల వేతనాల పెంపుకు ఒక విధానాన్ని అనుసరిస్తామని అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని, కానీ ఇన్నేళ్లవుతున్నా ఆ నిర్ణయాన్ని అమలు చేయలేదని లోక్ ప్రహరీ అనే స్వచ్ఛంద సంస్థ వేసిన పిటిషన్‌పై విచారించిన సందర్భంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. వేతనాల పెంపునకు సంబంధించిన ఈ అంశంపై ప్రభుత్వాలు 12ఏళ్లుగా జాప్యం చేస్తున్నాయని కోర్టు అసహనం వ్యక్తం చేసింది. కేంద్రం ఈ అంశంపై తమ వైఖరిని మార్చి 6లోగా చెప్పాలని జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది.

శిశు గృహాల్లో మరణాలు నిజమేనా?

- వివరణ ఇవ్వండి.. సర్కారుకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (మనం లీగల్ ప్రతినిధి): ప్రభుత్వ నిర్వహిస్తున్న శిశు సంరక్షణ గృహాల్లో శిశు మరణాల సంఖ్య గణనీయంగా ఉందనేది నిజమో కాదో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ నిర్వహణలోని శిశు మందిరాల్లో మరణాలు బాగా ఉన్నాయని, శిశు విక్రయాలు కూడా జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ బాలల హక్కుల సంఘం ఫౌండర్ ప్రెసిడెంట్ అచ్యుతరావు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు మంగళవారం మరోసారి విచారణ జరిపిందినల్లగొండ జిల్లాల్లోనే ఏడాది కాలంలో 32 మంది మత్యువాతపడ్డారని, మొత్తం 40 మంది వరకూ చనిపోయారని చెప్పారు. ఇంతమంది పిల్లలు చనిపోయారా.. చనిపోతే అందుకు బాధ్యత వహించాల్సిన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారు.. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని తెలంగాణను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది.

విచారణ తేదీ కచ్చితంగా చెప్పలేం

- బీజేపీ నేత నాగం పిటిషన్‌లో హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (మనం లీగల్ ప్రతినిధి): పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కోసం ఎలక్ట్రో మెకానికల్ పరికరాల కొనుగోలు పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని అదనంగా వెచ్చిస్తున్నారంటూ బీజేపీ నేత,మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌పై ఎప్పుడు విచారణ చేస్తామో నిర్దిష్టంగా చెప్పలేమని హైకోర్టు ప్రకటించింది. తమ రిట్‌పై ప్రభుత్వం కౌంటర్ వేసిందని, దానికి బదులు కూడా ఇచ్చామని, రిట్‌ను విచారించాలని నాగం న్యాయవాది మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్‌ను కోరారు.

కోల్ ఇండియా క్లోజ్!

(మొదటి పేజీ తరువాయి)



అంతమవుతుంది. తదనుగుణంగా ప్రభుత్వరంగ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) గుత్తాధిపత్యానికి తెరపడుతుంది. అటుపైన బొగ్గు ఉత్పత్తి కాస్తా ప్రైవేటు రంగం చేతిలోకి వెళ్లి వాణిజ్యపరంగా తవ్వకాలకు రంగం సిద్ధమవుతుంది. మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంత్రిమండలి సమావేశమైన సందర్భంగా ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సీసీఈఏ) బొగ్గు రంగం ప్రైవేటీకరణ ప్రతిపాదనను ఆమోదించింది. బొగ్గు రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్కరణగా కేంద్ర రైల్వే, బొగ్గుశాఖ మంత్రి పీయూష్ గోయెల్ దీన్ని అభివర్ణించారు. మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను ఆయన విలేకరులకు వివరించారు. ప్రస్తుతం ప్రైవేటు సంస్థల సొంత అవసరాల కోసం బొగ్గు తవ్వకానికి అనుమతిస్తు న్నట్లు ఈ సందర్భంగా గుర్తుచేశారు. సీసీఈఏ తాజా నిర్ణయంతో అమలు కానున్న భారీ సంస్కరణద్వారా సీఐఎల్ గుత్తాధిపత్య శకం ముగిసి పోటీతత్వానికి బీజం పడుతుందని మంత్రి చెప్పారు. పెట్టుబడుల ప్రవాహం పెరిగి లక్షలాది ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు అందుబాటు లోకి వస్తాయన్నారు. అంతేకాకుండా విద్యుత్ చార్జీలు కూడా తగ్గే అవకాశం ఉందన్నారు. ''వాణిజ్యపరమైన ఉత్పాదనకు అనుమతించ డం వల్ల బొగ్గు తవ్వకంలో పోటీతత్వం పెరుగుతుంది. అత్యాధునిక సాంకేతికత వాడకం సాధ్యమవుతుంది. పెట్టుబడులు ఇబ్బడిముబ్బడి గా రావడంవల్ల బొగ్గు రంగంతో ముడిపడిన రంగాల్లో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు మెండుగా అందుబా టులోకి వస్తాయి. అలాగే గనులున్న ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధికి బాటలు పడతాయి'' అని పీయూష్ గోయెల్ చెప్పారు.

ఇక జరగబోయేది ఏమిటి?

కేంద్ర మంత్రిమండలి తాజా నిర్ణయం నేపథ్యంలో పెద్ద, మధ్యతరహా, చిన్నతరహా గనులలో తవ్వకాలకు ప్రైవేటు కంపెనీలను అనుమతిస్తారు. ఆ మేరకు బొగ్గు అమ్మకాల కోసం గనులు, క్షేత్రాల వేలం ప్రక్రియను కూడా కేబినెట్ ఆమోదించింది. బొగ్గు గనుల (ప్రత్యేక నిబంధనలు) చట్టం-2015; గనులు, ఖనిజాల (అభివృద్ధి-నియంత్రణ) చట్టం-1957 ప్రకారం ఈ ప్రక్రియ సాగుతుందని కేంద్ర బొగ్గు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రైవేటీకరణవల్ల బొగ్గు సరఫరాకు భరోసా ఏర్పడి ఇంధన భద్రత లభిస్తుందని మంత్రి వివరించారు. కేటాయింపు ప్రక్రియలో పారదర్శకతకు, వాణిజ్య సౌలభ్యానికి ప్రాధాన్యం లభిస్తుందని, దీంతో సహజ వనరులు జాతీయాభివృద్ధికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. బొగ్గు వాస్తవ ఉత్పత్తిపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు 'టన్నుకు/రూపాయల' చెల్లింపు మొత్తం ప్రాతిపదికన వేలం వేస్తారు. ఈ మేరకు అత్యధిక మొత్తానికి పాడుకున్న సంస్థకు గనులు/క్షేత్రాలను కేటాయిస్తారు. అయితే, బొగ్గు అమ్మకం లేదా విక్రయంసహా వినియోగంపై ఎలాంటి ఆంక్షలూ ఉండవు. ''బొగ్గు అమ్మకానికి అనుమతిస్తూ గనులను వేలం వేయగా వచ్చే మొత్తం నిధులు ఆయా క్షేత్రాలున్న రాష్ట్రాలకే వెళ్తాయి. దీనివల్ల రాబడులు పెరిగి వెనుకబడిన ప్రాంతాలతోపాటు అక్కడి గిరిజనుల అభివృద్ధికి వినియోగించుకునే వీలు కలుగుతుంది'' అని బొగ్గు శాఖ ప్రకటన పేర్కొంది. ఈ పోటీతత్వం వల్ల దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెరిగి దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుందని, విలువైన విదేశీ మారకం ఆదా అవుతుందని మంత్రి పేర్కొన్నారు. దీని ప్రభావం కోల్ ఇండియాపై ఎలా ఉంటుందన్న ప్రశ్నకు- పోటీతత్వం ఫలితంగా ఈ ప్రభుత్వరంగ సంస్థకు మేలు కలుగుతుందని బదులిచ్చారు. దేశంలో 30వేల కోట్ల టన్నుల బొగ్గు నిల్వలున్నాయన్న అంచనా నేపథ్యంలో కేంద్ర మంత్రిమండలి తాజా నిర్ణయంతో పశ్చిమ బెంగాల్, ఒడిసా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు భారీగా లబ్ధి పొందనున్నాయి.

కర్ణాటకలో 2,920 కోట్లతో జాతీయ రహదారి విస్తరణ

కర్ణాటక రాష్ట్రంలో బెంగళూరు-మైసూరు మధ్య జాతీయ రహదారి (ఎన్‌హెచ్-275) విస్తరణ పథకానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా రూ.2,920 కోట్లతో నిడగట్ట-మైసూరు మార్గంలో 74.2 కిలోమీటరు నుంచి 135.4 కిలోమీటరు వరకు ఆరు వరుసలుగా వెడల్పు చేస్తారు. ఈ మేరకు రోడ్డు రవాణా -హైవేల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దాదాపు 2.48 లక్షల పనిదినాల సామర్థ్యంగల ఈ విస్తరణ పథకంవల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. అలాగే ఉత్తరాఖండ్ రాష్ట్రంలో చేపట్టే 'చార్‌ధామ్' ప్రాజెక్టులో భాగంగా కేదారనాథ్, బద్రీనాథ్, యమునోత్రి, గంగోత్రిలను అనుసంధానిస్తూ సొరంగ మార్గం నిర్మిస్తారు. మొత్తం రూ.1,384 కోట్లతో ఈ పనులను చేపట్టేందుకు సీసీఈఏ ఆమోదించింది. దీంతో 20 కిలోమీటర్ల మేర ప్రయాణం తగ్గడమేగాక గంట సమయం ఆదా అవుతుంది. ఇక ఒడిసా, ఛత్తీస్‌గఢ్‌ల మధ్య మహానది జల వివాద పరిష్కారం కోసం ట్రైబ్యునల్ ఏర్పాటుకు మంత్రిమండలి అంగీకారం తెలిపింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పట్టణ)కింద పట్టణ గృహ నిర్మాణానికి అదనపు బడ్జెట్ మద్దతు ఇచ్చే ప్రతిపాదనను కూడా కేబినెట్ అంగీకరించింది. ఈ పథకం కింద పట్టణ పేదల కోసం 1.2 కోట్ల ఇళ్లు నిర్మించాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సంకల్పించిన సంగతి తెలిసిందే.

సిరియాలో మారణహోమం 100 మంది పౌరుల మృతి

బీరుట్, ఫిబ్రవరి 20: సిరియా సైన్యం కురిపించిన బాంబుల వర్షంలో 100 మందికి పైగా పౌరులు మృతి చెందారు. మృతి చెందిన వారిలో 20 మంది చిన్నారులు కూడా ఉన్నారు. ఘౌటా తూర్పు ప్రాంతం ఇంకా తిరుగుబాటుదారుల ఆధీనంలోనే ఉండగా వారిపై పోరు కొనసాగిస్తున్న సిరియా సైన్యం జరిపిన ఈ దాడిలో మృతుల సంఖ్య మరింత పెరిగే సూచన ఉన్నట్టు స్థానిక మీడియా అంచనా వేస్తోంది. కాగా 2015 తరువాత జరిగిన అతిపెద్ద మారణహోమంగా దీన్ని సిరియాలోని మానవ హక్కుల పరిశీలన సంస్థ పేర్కొంది. సోమవారం డెమాస్కస్ వద్ద ఈ దాడి జరిగింది.

మాల్దీవ్స్‌లో చైనా యుద్ధ నౌకలు


షాంఘై, ఫిబ్రవరి 20: చైనాకు చెందిన 11 యుద్ధ నౌకలు హిందూ మహాసముద్ర జలాల్లో తిష్టవేశాయి. హిందూ మహాసముద్ర జలాల్లో ఒక నావికా దళంతో పాటు ఒక యుద్ధ నౌక, మూడు సపోర్ట్ యుద్ధ ట్యాంకులు ప్రవేశించినట్టు చైనా న్యూస్ పోర్టల్ 'సైనా' పేర్కొంది. సైనా కథనంలో భాగంగా ''యుద్ధ నౌకలతో పాటు ఇతర సామగ్రిని చూస్తే భారత్, చైనా నౌకాదళాల మధ్య పెద్ద తేడా లేదు'' అని పేర్కొంది. అయితే ఎప్పుడు యుద్ధనౌకలు ఈ జలాల్లో ప్రవేశించాయి? ఎంతకాలం పాటు ఇక్కడే ఉంటాయి? వంటి విషయాలను మాత్రం ఆ వెబ్‌సైట్ వెల్లడించలేదు. పలు ద్వీపాల సమూహమైన మాల్దీవులతో మనదేశానికి దీర్ఘకాలంగా రాజకీయ, రక్షణ ఒప్పందాలున్నాయి. 4 లక్షల ముస్లిం జనాభా ఉన్న మాల్దీవుల్లో చైనా తన ఉనికిని అంతకంతకూ చాటుకుంటోందని, ఈ విషయంలో భారత్ కలుగజేసుకోవాలంటూ అక్కడి ప్రతిపక్షాలు కోరాయి. మరోవైపు విలాసవంతమైన హోటళ్లకు పుట్టిల్లు అయిన మాల్దీవ్స్‌లో సాధారణ పరిస్థితులు ఏర్పడే వరకూ అక్కడ పర్యటించవద్దని తమ ప్రజలకు చైనా ప్రభుత్వం సూచించింది.

చైనాకు దీటుగా మరో 'మార్గం'

- ఓబీవోఆర్‌కు ప్రత్యామ్నాయం
- అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో
- భారత్ చర్చలు.. ఆసిస్ పత్రిక కథనం



మెల్‌బోర్న్, ఫిబ్రవరి 20: చైనా నిర్మిస్తున్న 'వన్ బెల్ట్ వన్ రోడ్' ప్రాజెక్టు దీటుగా మరో అంతర్జాతీయ ప్రత్యామ్నాయ 'మార్గం' రూపకల్పనకు భారత్ అడుగులేస్తోంది. ఇందుకోసం అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో చర్చలు జరుపుతోంది. ప్రపంచమంతటా ముఖ్యంగా పసిఫిక్ మహాసముద్రానికి ఆనుకొని ఉన్న పోర్టులను కలిపేలా రోడ్డు, రైలు మార్గాల నిర్మాణానికి ప్రణాళిక రచిస్తోంది. ఇప్పటికే ఆసియా, ఆఫ్రికా, యూరప్‌లను కలుపుతూ చైనా నిర్మించ తలపెట్టిన వన్ బెల్ట్ వన్ రోడ్ (ఓబీవోఆర్)కు దీటుగా.. చైనా సైతం ఈ ప్రత్యామ్నాయ మార్గంపై ఆధారపడేలా ఇది ఉండాలని పై నాలుగు దేశాలు భావిస్తున్నాయి. ఈ మేరకు సోమవారం ఆస్ట్రేలియాకు చెందిన వార్త పత్రిక ఆస్ట్రేలియా ఫైనాన్షియల్ రివ్యూ (ఏఎఫ్ఆర్) ఒక కథనాన్ని ప్రకటించింది. ఈ నాలుగు దేశాలు కలిసి త్వరలోనే ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నాయని, భవిష్యత్తులో ఇది చాలా కీలకం కానుందని అమెరికాకు చెందిన ఓ అధికారి పేర్కొన్నట్లు ఈ కథనం వెల్లడించింది. అయితే ఇప్పుడే దీన్ని ప్రకటించే స్థాయిలో లేదని ఆయన చెప్పారు. దీనిపై భారత్ ఇప్పటికే ఈ నాలుగు దేశాలతో చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. బుధవారం ఆస్ట్రేలియా ప్రధాని టర్న్‌బుల్ అమెరికా పర్యటనలో అధ్యక్షుడు ట్రంప్‌తో దీనిపైనే ప్రధానంగా చర్చిస్తారని వివరించారు. చైనా ఓబీవోఆర్ ప్రాజెక్టుకు ఇది 'ప్రత్యామ్నాయం' మాత్రమేనని, పోటీగా భావించాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. తాము చైనా చేపడుతున్న ఈ భారీ మౌలిక వసతుల ప్రాజెక్టును వ్యతిరేకించడం లేదని, కేవలం చైనా తన సొంతంగా ఒక పోర్టును నిర్మించడం వల్ల ప్రయోజనం ఉండదని, అక్కడితో సరిపెడితే అది ఆర్థికంగా చాలా భారమవుతుందని ఆ అధికారి అభిప్రాయపడ్డారు. ఈ తరహా పోర్టులను కలిపేలా రోడ్డు, రైలు మార్గాలను నిర్మించి తాము ఆర్థికంగా మరింత సరళతరం చేస్తామని చెప్పారు. దీనిపై జపాన్ చీఫ్ కేబినెట్ సెక్రటరీ యొషిహిదే సుగా స్పందిస్తూ.. జపాన్-అమెరికా-ఆస్ట్రేలియా-భారత్ ఎప్పటికప్పుడూ పరస్పర ప్రయోజనాల దృష్ట్యా చర్చలు జరుపుతూనే ఉంటాయని, ఇప్పుడు నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టు కూడా చైనాకు పోటీగా కాదని, కేవలం ప్రత్యామ్నాయం మాత్రమేనని అన్నారు.



కాగా, చైనా ఓబీవోఆర్ పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) మీదుగా వెళ్తుంన్నందున భారత్ ఆ ప్రాజెక్టును బహిరంగంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఇది భారత సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమేనన్న వాదనను ఆమెరికా కూడా సమర్థిస్తోంది. మరి కొన్ని దేశాలు కూడా భారత్‌కు ఈ విషయంలో మద్దతు పలికాయి. ఈ క్రమంలో చైనా దూకుడుకు కళ్లెం వేసేందుకు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో పరస్పర సహకారంపై గత ఏడాది భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా ప్రతినిధుల తొలి భేటీ జరిగింది.

బలూచిస్థాన్ ఉగ్రవాదులతో చైనా చర్చలు

- సీపీఈసీ భద్రతకు రహస్య సంప్రదింపులు

బీజింగ్, ఫిబ్రవరి 20: చైనా-పాకిస్థాన్ ఎకనమిక్ కారిడార్ భద్రత కోసం బలూచిస్థాన్ ఉగ్రవాదులతో చైనా రహస్యంగా చర్చలు జరిపించింది. దాదాపు ఐదేళ్లుగా చైనా వారితో సంప్రదింపులు జరుపుతున్నట్లు బ్రిటిష్ వార్త పత్రిక కథనం ప్రచురించింది. సీపీఈసీలో భాగంగా ఉన్న ప్రాజెక్ట్‌లు లక్ష్యంగా దాడులు చేయకూడదని చైనా.. ఉగ్రవాదులను కోరినట్లు పాకిస్థాన్‌కి చెందిన ఓ అధికారి వెల్లడించారని ఇందులో పేర్కొంది. దాదాపు 60 బిలియన్ డాలర్లతో చేపడుతున్న ఆర్థిక కారిడార్ ప్రాజెక్ట్‌లపై ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని రెండు నెలల క్రితం పాకిస్థాన్‌లోని చైనా అధికారులకు ఆ దేశ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భారీగా భద్రతను పెంచాలని, కొన్ని నెలల పాటు చైనా నుంచి పర్యటనలు తగ్గించాల్సిందిగా ఆదేశించింది. అత్యవసర సమావేశాల్లో పాక్ మిలిటరీ, పోలీస్ అధికారులకు చైనీయులు సహకరించాలని కోరింది. బలూచిస్థాన్ రెబల్స్‌తో చైనా చర్చలు జరపడాన్ని పాక్ ఉన్నత వర్గాలు కూడా ఆహ్వానిస్తున్నట్లు కొందరు అధికారులు పేర్కొన్నారు.

11 బ్యాంకు ఖాతాలు ఎటాచ్

- 'రోటోమాక్' కొఠారీపై ఐటీశాఖ కొరడా
- ఆదాయపన్ను ఎగవేశారంటూ ఆరోపణలు
- రూ. 85 కోట్ల రికవరీ కోసమే ఖాతాల స్తంభన
- కొఠారీ తీసుకున్న రుణం రూ. 2919 కోట్లు
- వడ్డీతో కలిపి ఇప్పటికి రూ. 3695 కోట్లు
- విక్రమ్‌పై మనీలాండరింగ్ కేసు పెట్టిన ఈడీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: రోటోమాక్ గ్రూపు అధినేత విక్రమ్ కొఠారీకి మరిన్ని కష్టాలు వచ్చిపడ్డాయి. ఇప్పటికే ఒకవైపు సీబీఐ, మరోవైపు ఈడీ అధికారులు ముమ్మరంగా విచారణ జరుపుతుండగా ఇప్పుడు ఆదాయపన్ను శాఖ కూడా రంగంలోకి దిగింది. ఆ గ్రూపుతో సంబంధం ఉన్న 11 బ్యాంకు ఖాతాలను ఎటాచ్ చేసింది. ఆదాయపన్ను ఎగవేతలకు పాల్పడ్డారన్న ఆరోపణలు కూడా కొఠారీకి చెందిన రోటోమాక్ గ్రూపుపై రావడంతో ఈ చర్యలు తీసుకుంది. ఉత్తర ప్రదేశ్‌లోని వివిధ బ్యాంకు శాఖలలో ఉన్న ఈ అకౌంట్లను సోమవారం రాత్రి ఎటాచ్ చేశారు. కొఠారీ దాదాపు రూ. 85 కోట్ల మేర పన్నులు చెల్లించాల్సి ఉందని, వాటిని రికవరీ చేసుకోడానికే ఈ ఎటాచ్‌మెంట్ అని చెబుతున్నారు. గత నెలలో కూడా ఇదే గ్రూపునకు చెందిన మూడు ఖాతాలను ఆదాయపన్ను శాఖ ఎటాచ్ చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ కేంద్రంగా కొనసాగుతున్న రోటోమ్యాక్ గ్రూపు మొత్తం ఏడు బ్యాంకుల కన్సార్షియం నుంచి రూ. 3695 కోట్ల మేర రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టిందని సీబీఐ, ఈడీ ఆరోపించిన విషయం తెలిసిందే. దీంతో రోటోమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మీద, దాని డైరెక్టర్ విక్రమ్ కొఠారీ, ఆయన భార్య సాధనా కొఠారీ, కొడుకు రాహుల్ కొఠారీపై సీబీఐ కేసు నమోదుచేసింది. ఈ ముగ్గురితో పాటు గుర్తుతెలియని బ్యాంకు అధికారులపై కూడా కేసు పెట్టారు. బ్యాంక్ ఆఫ్ బరోడా చేసిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదైంది. కొఠారీ తీసుకున్న మొత్తం రుణం రూ. 2,919 కోట్లని.. వడ్డీతో కలిపి రూ. 3695 కోట్లకు చేరిందని సీబీఐ అధికారులు తెలిపారు. ఆ తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా కొఠారీపై మనీలాండరింగ్ కేసు పెట్టింది. ఇప్పుడు బ్యాంకుల నుంచి రుణంగా తీసుకున్న మొత్తాలను కూడా విదేశాలకు ఏమైనా పంపేశారా.. వాటి సాయంతో అక్రమంగా ఏమైనా ఆస్తులు సంపాదించి, నల్లధనం పోగేశారా అనే కోణాలలో ఈడీ దర్యాప్తు చేయనుంది. ఇలా క్రమంగా విక్రమ్ కొఠారీపై ఉచ్చు బిగుసుకుంటోంది.


కుటుంబ సభ్యులతో విక్రమ్ కొఠారీ

రైతులేమో ఆత్మహత్యలు.. వీళ్లేమో విదేశాలకు!

పీఎన్‌బీ కుంభకోణంపై సిట్ వేయండి.. నీరవ్‌ను రప్పించేందుకు చర్యలు తీసుకోండి

- పీఎన్‌బీ ఉన్నతాధికారులనూ విచారించండి
- సుప్రీంకోర్టులో రెండు పిటిషన్లు
- విచారణకు స్వీకరించిన న్యాయస్థానం
- ఎల్లుండి ధర్మాసనం ముందుకు కేసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో రూ. 11,000 వేల కోట్లకు పైగా భారీ కుంభకోణంపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)తో విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన రెండు పిల్‌లను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ అంశంపై శుక్రవారం విచారణ జరుపుతామని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం వెల్లడించింది. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీని భారత్‌కు రప్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకునేలా, ముఖ్యంగా రెండు నెలల్లోగా అయన్ని భారత్‌కు రప్పించేందుకు తగిన చర్యలు తీసుకునేలా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని, కొన్ని ఉపశమన చర్యలు తీసుకోవాలని పిటిషనర్లలో ఒకరైన వినీత్ దండా తన పిటిషన్‌లో కోర్టును అభ్యర్థించారు. అలాగే.. పీఎన్‌బీ ఉన్నతస్థాయి విచారణ జరపాలని కూడా కోర్టును కోరారు. పది కోట్లకు మించిన రుణాల మంజూరుకు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ తగిన నిబంధనలు జారీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. నీరవ్ మోదీ కంపెనీలకు ఆర్‌బీఐ రుణ నిబంధనలను పాటించకుండా రుణాలను మంజూరు చేశారని కూడా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. మరో పిటిషనర్ ఎంఎల్ శర్మ కూడా ఇలాంటి విజ్ఞప్తితోనే పిటిషన్ వేశారు. ఈ కుంభకోణంలో పెద్ద తలకాయల పాత్ర (రాజకీయ నేతలు-ఉన్నతాధికారులు) ఉన్నందున సర్వోన్నత న్యాయస్థానంలోని న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు (సిట్) బృందాన్ని ఏర్పాటు చేసి కేసును విచారించాలని అభ్యర్థించారు. ఈ కుంభకోణం ద్వారా ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన కోర్టుకు తెలిపారు. పేద రైతులు బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాన్ని చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతుంటే.. మరోవైపు మాల్యా, నీరవ్ లాంటి వారు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాలకు చెక్కేస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. సామాన్య ప్రజల హక్కులను కాపాడేందుకు సుప్రీంకోర్టు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. రుణాలు చెల్లించక పోవడంపై బ్యాంకు అధికారులు పేద రైతులపై దురుసుగా ప్రవర్తించిన ఘటనలు, రైతులు డబ్బు కట్టలేక ఆత్మహత్యలు చేసుకున్న పలు ఘటనలను పిటిషన్‌లో ప్రస్తావించారు. మరో వైపు నీరవ్ మోదీ, ఆయన మామ ఛోక్సీలు భారీ మోసాలకు పాల్పడి ఎంచక్కా కుటుంబంతో సహా సులువుగా విదేశాలకు పారిపోగలిగారని పేర్కొన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు భారీ కుంభకోణంలో రిజర్వు బ్యాంకు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఇలాంటి భారీ కుంభకోణాల ప్రభావం తిరిగి ప్రజలపైనే పడుతుందని.. వారి నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అధిక పన్నులు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, రిజర్వు బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకులను ఈ కేసులో కక్షిదారులుగా పేర్కొన్నారు. నీరవ్ మోదీని వీలైనంత త్వరగా భారత్ రప్పించడానికి గల అన్ని చర్యలను తీసుకోవడంపై కేంద్రానికి మార్గదర్శకాలు జారీ చేయాలని, డబ్బు రికవరీ చేయడానికి చర్యలు వేగవంతం చేయాలని పిటిషన్‌లో కోరారు. అలాగే అవినీతికి పాల్పడిన పీఎన్‌బీ అధికారులపై చర్యలు తీసుకోవాలని, రుణాల మంజూరుకు కొత్త మార్గదర్శకాలు నిర్దేశించాలని, నిబంధనలు బాగా కఠినతరం చేయాలని కోరారు. రూ.500కోట్లు, అంతకు పైగా రుణం తీసుకునే వారి వివరాలను, రుణాలు చెల్లించని వారి జాబితాను ప్రభుత్వం అందజేయాలని అభ్యర్థించారు. ఈ రెండు పిటిషన్లను విచారణకు స్వీకరించిన కోర్టు ఈ నెల 23కు వాయిదా వేసింది.


రాణేలోని పీఎన్‌బీలో ఈడీ తనిఖీలు

ఆరు ఫ్లాట్ల విలువ.. 900 కోట్లు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పీఎన్‌బీ కుంభకోణం కేసులో ముంబైలో నీరవ్ మోదీకి చెందిన పలు స్థిరాస్తులను ఆదాయపన్ను శాఖ జప్తు చేసిన విషయం తెలిసిందే. అయితే.. ముంబైలో సముద్రానికి అభిముఖంగా ఉన్న సముద్ర మహల్‌లోనూ ఆరు ఫ్లాట్లను సీజ్ చేశారు. అయితే ఒక్కో ఫ్లాటు విలువ రూ.150 కోట్ల చొప్పున మొత్తం విలువ రూ.900 కోట్ల వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ఆరు ఫ్లాట్లు కూడా నీరవ్ మోదీ, భార్య అమీ మోదీ పేరుపై ఉన్నాయని గుర్తించారు. ఇప్పటి వరకు ఈ కేసులో 20 స్థిరాస్తులను సీజ్ చేయగా.. వాటి విలువ కూడా వేల కోట్లకు పైగానే ఉంటుందని ఆదాయపన్ను శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గ్రోవెన్సర్ హౌజ్‌లో నాలుగు ఫ్లాట్లు, ముంబైలో పెద్దార్ రోడ్డులో రెండు ఫ్లాట్లు ఉన్నట్లు తెలుస్తోంది.

నీరవ్ మోదీకి చెల్లింపులు..

- సింఘ్వీ సతీమణికి ఐటీ నోటీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: నీరవ్‌మోదీ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ పార్టీ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వీ సతీమణి అనితా సింఘ్వీ ఆదాయపన్ను శాఖ మంగళవారం నోటీసులు జారీ చేసింది. నీరవ్‌మోదీ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించినప్పుడు.. ఓ లెడ్జర్ బుక్కులో 'అన్‌అకౌంటెడ్ పెయిడ్' ఖాతాలో సింఘ్వీ సతీమణి భారీ మొత్తంలో చెల్లించినట్లుగా అధికారులు గుర్తించారు. సాధారణంగా ఇలాంటి ఖాతాలను ఉన్నతస్థాయి వ్యక్తుల కోసం, భారీ స్థాయిలో కొనుగోళ్లు జరిపేవారి కోసం ఉపయోగిస్తుంటారని సదరు అధికారి వెల్లడించారు. 2014లో మే 20, అదే ఏడాది ఆగస్టు 21, 2015 జనవరి 17న దాదాపు రూ.1.5 కోట్ల మేరకు వజ్రాలు, బంగారు ఆభరణాలు కొనుగోలు చేసినట్లుగా గుర్తించామని తెలిపారు.

చోక్సీని విచారించండి: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ మెహుల్ చోక్సీ అవకతవకలకు పాల్పడ్డారంటూ 2016లో దాఖలైన కేసులో తక్షణమే దర్యాప్తు ప్రారంభించాలని పోలీసులకు ఢిల్లీ హైకోర్టు మంగళవారం ఆదేశించింది. ఎక్కువ లాభాలు వస్తాయని చోక్సీ ఆశచూపించడంతో గీతాంజలి ఫ్రాంచజీని తాము కొనుగోలు చేశామని, ఆ ఫ్రాంచజీలో రూ.3 కోట్ల వజ్రాభరణాలు అమ్మకానికి పెడతామని చోక్సీ సంస్థ పేర్కొన్నదని వైభవ్ ఖురానియా అనే వ్యక్తి తెలిపారు. ఇందుకోసం తాము సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.1.5 కోట్లను గీతాంజలి జెమ్స్‌కు చెల్లించామన్నారు. అయితే.. ఫ్రాంచజీ ప్రారంభించకపోగా.. తమ డబ్బు తిరిగి ఇవ్వట్లేదంటూ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు అప్పటి నుంచీ విచారణలోనే ఉంది. తాజాగా సదరు వ్యక్తి ఢిల్లీ కోర్టును ఆశ్రయించగా దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించింది.

తప్పంతా మీదే!

- రుణాలు చెల్లించడం నా వల్ల కాదు: నీరవ్ మోదీ
- అప్ప 6వేల కోట్ల లోపే.. కోట్లలో వడ్డీలు ముట్టలేదా!
- అత్యుత్సాహంతో నా ప్రతిష్ఠను సర్వనాశనం చేశారు
- సీనియర్ అధికారి విపుల్ అంబానీసహా ఐదుగురి అరెస్ట్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పంజాబ్ నేషనల్ బ్యాంకును నిలువునా దోచు కున్న 'నీరవు'డు- బకాయిలు రాబట్టుకునే తొందరలో తనను సర్వనాశనం చేసిందంటూ బ్యాంకుపైనే నిందలు మోపాడు. తనపై సీబీఐకి ఫిర్యాదు చేసి జాతీయంగా, అంతర్జాతీయంగా పరువు తీసేశారంటూ ఈ నెల 15, 16 తేదీ ల్లో బ్యాంకుకు రాసిన లేఖలో నీరవ్ మోదీ ఆరోపించాడు. మంగళవారం వెలు గుచూసిన ఈ లేఖలో అతడు పలు విషయాలను ప్రస్తావిస్తూ బ్యాంకు తీరును దుయ్యబట్టాడు. అత్యుత్సాహంతో తన బ్రాండు విలువను మట్టిపాలు చేసి, అప్పు చెల్లించలేని అసమర్థుడుగా మిగిల్చిందని వజ్ర బేహారి ధ్వజమెత్తాడు. అసలు తాను బకాయిపడిన మొత్తాన్ని పీఎన్‌బీ రెట్టింపు చేసి చెబుతున్నదని మండిపడ్డాడు. తన కంపెనీల బకాయిలు రూ.5,600 కోట్లకు మించకపోయినా, రూ.11,400 కోట్లుగా ఫిర్యాదులో ప్రకటించిందని పేర్కొన్నారు. దీంతో తన యాజమాన్యంలోని 'ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్, ఫైర్‌స్టార్ డైమండ్స్ ఇంటర్నేషనల్' సంస్థల ఉనికే ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశాడు. పైగా ఈ అంశాన్ని మీడియా సంచలనం చేయడంతో దర్యాప్తు సంస్థలు తనిఖీ, సోదా, శోధనలకు దిగి ఆస్తులను జప్తు చేశాయని పేర్కొన్నాడు. దీంతో దేశంలోనేగాక విదేశాల్లోనూ తన పరువు గంగలో కలిసిందని ఆక్రోశం వెళ్లగక్కాడు. ఫిర్యాదు సమర్పించిన తర్వాత కూడా తన ఆస్తులు విక్రయించి అప్పులు తీర్చేందుకు ప్రతి పాదించినట్లు లేఖలో గుర్తుచేశారు. దీంతోపాటు ఫిబ్రవరి 13, 15 తేదీల్లో తన ప్రతినిధులు చర్చించడంతోపాటు ఈ మెయిల్‌ద్వారా సంప్రదింపులు సాగినా పీఎన్‌బీ పారదర్శకంగా వ్యవహరించలేదని ఆరోపించాడు. దేశీయంగా తన వ్యాపారాల విలువ రూ.6,500 కోట్లుగనుక అవి విక్రయించి చెల్లింపులు చేస్తే రుణభారం తగ్గేదని పేర్కొన్నాడు. కానీ... ఆస్తుల జప్తు, బ్యాంకు ఖాతాల స్తంభన వంటి చర్యల ఫలితంగా ఇప్పుడిక అప్పులు చెల్లించలేని దుస్థితి ఏర్పడిందని వాపోయాడు. కాగా, మంగళవారం రాత్రి నీరవ్ మోదీ సంస్థలో సీనియర్ అధికారి విపుల్ అంబానీసహా ఐదుగురు అధికారులను లోతుగా ప్రశ్నించిన సీబీఐ... ఆ తర్వాత వారిని అరెస్ట్ చేసినట్లు ప్రకటించింది.

నా వాళ్లకు ఎలాంటి సంబంధం లేదు

ఫైర్‌స్టార్ సంస్థలు కొన్నేళ్లుగా కొనుగోలుదారు రుణ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నాయని నీరవ్ మోదీ పేర్కొన్నాడు. ఏనాడూ ఎగవేత మాటే లేదని, పైగా బ్యాంకు కూడా తమ నుంచి కోట్ల రూపాయలలో వడ్డీలు, రుసుములు ఆర్జించిందని గుర్తుచేశాడు. ఈ వ్యాపారాలతో తన భార్యకు, సోదరుడికి ఎలాంటి సంబంధం లేకపోయినా వారితోపాటు సమీప బంధువు, 'గీతాంజలి జెమ్స్' అధినేత మెహుల్ చోక్సీని కూడా నిందితులను చేయడం అన్యాయమని ఆక్రోశించాడు. ఈ కేసుల ఫలితంగా స్వదేశంలో రూ.5,649 కోట్ల విలువైన ఆస్తులను సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నాడు. ఫలితంగా వాటిని విక్రయించి అప్పు తీర్చే అవకాశం కోల్పోయానన్నాడు. తన కరెంటు ఖాతాల్లోని సొమ్ముతో 2,200 మంది ఉద్యోగులకు జీతాలిచ్చేందుకు అనుమతించాల్సిందిగా బ్యాంకును కోరాడు. కాగా, మెహుల్ చోక్సీ నాలుగేళ్ల కిందటే పట్టుబడాల్సిందని ఆ సంస్థ మాజీ ఎండీ సంతోష్ శ్రీవాస్తవ వ్యాఖ్యానించారు. ఖాతాల తారుమారు, విలువల వెల్లడిలో ఖాతాదారులను ఏమార్చడం వంటి ఆయన అనైతిక కార్యకలాపాలు సహించలేకనే తాను ఆ సంస్థ నుంచి వైదొలగానని పేర్కొన్నారు. దీనిపై అన్ని ఆధారాలతో ఈడీని కలిసినా, ఆర్థిక నేరాల విభాగం అధికారులను కలిసినా వారు స్పందించలేదని తెలిపారు. మరోవైపు పీఎన్‌బీతో నీరవ్ మోదీ లావాదేవీలన్నీ నమోదైనవేనని, సీబీఐ దీనికి విరుద్ధంగా ఆరోపణలు నమోదు చేసిందని ఆయన లాయర్ విజయ్ అగర్వాల్ ఆరోపించారు. అయితే, నీరవ్ ఎక్కడున్నారన్న ప్రశ్నకు మాత్రం ఆయన జవాబివ్వలేదు. ఇక నీరవ్ మోదీ మోసం ఉదంతంపై నివేదిక సమర్పించాలని కేంద్ర నిఘా కమిషన్ సోమవారం నాడే పీఎన్‌బీతోపాటు కేంద్ర ఆర్థిక శాఖను ఆదేశించింది. మూడేళ్ల సర్వీసు పూర్తిచేసిన అధికారులను, ఐదేళ్లపాటు పనిచేసిన కిందిస్థాయి సిబ్బందిని కూడా వారి స్థానాల నుంచి బదిలీ చేయాలని అన్ని బ్యాంకులకూ సూచించింది.

అవినీతి అధికారులపై బ్యాంకుల ఉదాసీనత

అవినీతి ఆరోపణలున్న వివిధ బ్యాంకుల అధికారులపై చర్యలకు అనుమతి ఇవ్వాలని కేంద్ర నిఘా కమిషన్ సూచించినా యాజమాన్యాలు బేఖాతరు చేశాయి. ఈ మేరకు ఎస్‌బీఐ, యూకో, పీఎన్‌బీలకు చెందిన 9 మంది సీనియర్ అధికారులపై చర్యలకు సీవీసీ సిఫారసు చేసింది. నిబంధనల దీనిపై 4 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సీవీసీ వద్దగల తాజా సమాచారం మేరకు... ఈ 9 మందికిగాను ఎస్‌బీఐలో ఐదుగురు, యూకో బ్యాంకులో ముగ్గురు, పీఎన్‌బీ ఒకరు వంతున అధికారులున్నారు. వీరందరిపైనా విచారణకు అనుమతిపై నిర్ణయం 2017 జూన్ నుంచీ పెండింగ్‌లో ఉండటం యాజమాన్యాల ఉదాసీనతకు పరాకాష్ఠ.

యాజమాన్యం... ఆడిటర్ల వైఫల్యమే: జైట్లీ

పీఎన్‌బీలో భారీ మోసంపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం తొలిసారి నోరు విప్పారు. యాజమాన్యంతోపాటు ఆడిటర్ల వైఫల్యమే ఆ బ్యాంకులో రూ.11,400 కోట్ల మోసానికి కారణమని స్పష్టం చేశారు. బ్యాంకు యాజమాన్యాలకు నిర్ణయాధికారం ఉందని, వారు దాన్ని సమర్థంగా, సముచితంగా వినియోగించుకోవాల్సి ఉందన్నారు. కానీ, వారీ విషయంలో విఫలమయ్యారని తాజా ఉదంతం రుజువు చేస్తోందన్నారు.

ఆ వివరాలు చెప్పం

పుణె, ఫిబ్రవరి 20: విజయ్ మాల్యా, లలిత్ మోదీలను స్వదేశం రప్పించేందుకు ఎంత ఖర్చు చేశారో వెల్లడించేందుకు సీబీఐ నిరాకరించింది. ఓ సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం కింద ఈ వివరాలు కోరారు. అయితే, దీనికి సంబంధించి 2011లోనే నోటిఫికేషన్ విడుదల చేశామని, దాని ప్రకారం వివరాలు వెల్లడించే అవసరం లేదని పేర్కొంది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24 కింద కొన్ని సంస్థలకు మినహాయింపు ఉందన్నది తెలుసుకోవాలని దరఖాస్తుదారుకు సూచించింది. మనీ లాండరింగ్‌కు పాల్పడి లలిత్ మోదీ, బ్యాంకులకు రూ.9వేలకోట్లకు పైగా ఎగ్గొట్టి విజయ్ మాల్యా విదేశాలకు పారిపోవడం తెలిసిందే.



నేడే కమల్ అరంగేట్రం

- మదురైలో పార్టీ ప్రకటన.. బహిరంగ సభకు కేజ్రీవాల్
- రజినీకాంత్‌కూ ఆహ్వానం

చెన్నై, ఫిబ్రవరి 20: తమిళనాడులో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిష్కృతం కానుంది. రాజకీయ రంగ ప్రవేశం చేయనున్నట్లు గతంలోనే ప్రకటించిన తమిళ సినీ నటుడు కమల్ హాసన్ బుధవారం తన పార్టీ పేరును, జెండాను ఆవిష్కరించాలని నిర్ణయించారు. తన రాజకీయ ప్రస్థానానికి వేదికగా మదురైను కమల్ ఎంపిక చేసుకున్నారు. మదురైలోని ఒట్టకట్టాయి గ్రౌండ్స్‌లో బుధవారం సాయంత్రం 6 గంటలకు కమల్ తన రాజకీయ పార్టీ పేరును ప్రకటించనున్నారు. జెండాను ఆవిష్కరించనున్నారు. దీంతో ఆయన పార్టీ పేరేంటో.. జెండా ఎలా ఉండబోతోందోనన్న ఆసక్తి ప్రజల్లో నెలకొంది. ఈ సభను విజయవంతం చేసేందుకు కమల్ అభిమానులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ బహిరంగ సభకు ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ కూడా హాజరుకానున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో కమల్ హాసన్ కేజ్రీవాల్‌తో భేటీ అయ్యారు. ఆ సందర్భంలో కమల్ లాంటి వ్యక్తులు రాజకీయాల్లోకి రావాలని కేజ్రీవాల్ ఆకాంక్షించారు. బుధవారం ఉదయం రామేశ్వరంలో ఉన్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఇంటిని సందర్శించడంతో కమల్ రాజకీయ ప్రస్థానంలో తొలి అడుగు పడనుంది. ఇదిలా ఉంటే, ఈ కార్యక్రమానికి రజనీకాంత్‌ను కూడా కమల్ ఇప్పటికే ఆహ్వానించారు. రజినీ హాజరవుతారా లేదా అని విలేకరులు కమల్‌ను ప్రశ్నించగా.. అది ఆయన నిర్ణయమని చెప్పారు. డీఎంకే ప్రెసిడెంట్ కరుణానిధితో కూడా కమల్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ ప్రకటన కార్యక్రమానికి రావాల్సిందిగా కరుణానిధిని, స్టాలిన్‌ను కమల్ కోరారు. ఇక కమల్ రాజకీయాల్లో రావడాన్ని లెఫ్ట్ నేతలతో సహా పలువురు స్వాగతించారు. డీఎమ్‌డీకే నేత కెప్టెన్ విజయకాంత్ కూడా కమల్ రాజకీయాల్లో రాణించాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లోకి రానున్నట్లు 2017 నవంబర్‌లో కమల్ హాసన్ ప్రకటించారు. ఆయన సహ నటుడు రజినీకాంత్ కూడా రాజకీయాల్లోకి రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.

ఆప్ ఎమ్మెల్యేలు నన్ను కొట్టారు

- సీఎం కేజ్రీవాల్ సమక్షంలోనే దాడి చేశారు
- ఢిల్లీ సీఎస్ అన్షుప్రకాశ్ ఆరోపణ.. గవర్నర్‌కు ఫిర్యాదు
- దాడి జరగలేదు.. ఆరోపణలు అబద్ధం..: సీఎంవో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆప్ ఎమ్మెల్యేలు తనపై దాడికి పాల్పడ్డారని సీఎస్ అన్షు ప్రకాశ్ ఆరోపించారు. ఈమేరకు సోమవారం రాత్రి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్‌ను కలిసి దాడి ఘటనను వివరించారు. ముఖ్యమంత్రి ఎదురుగానే ఎమ్మెల్యేలు తనపై చేయిచేసుకున్నారంటూ తెలిపారు. సదరు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలంటూ ఎల్‌జీని కోరారు. ప్రభుత్వ పథకాలపై సమీక్షా సమావేశం సందర్భంగా సీఎం కేజ్రీవాల్ ఇంట్లో చోటుచేసుకున్న పరిణామాలను వివరిస్తూ.. ఇంటింటికీ ప్రభుత్వ సేవల పథకంపై సమీక్షకు రమ్మంటూ సీఎంవో నుంచి తనకు సమాచారం అందిందని తెలిపారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మరికొంతమంది అధికారులతో కలిసి సీఎం కేజ్రీవాల్ ఇంటికి వెళ్లినట్లు సీఎస్ వివరించారు. ఈ భేటీకి ఆప్ ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యారని పేర్కొన్నారు. సమావేశంలో చర్చ జరుగుతుండగా ఆప్ ఎమ్మెల్యేలు తనతో వాగ్యుద్ధం పెట్టుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ఒక్కసారిగా తనపై దాడి చేసి, చేయి చేసుకున్నారని వివరించారు. సాక్షాత్తూ సీఎం కేజ్రీవాల్ ముందే ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. ఈ సంఘటనలో తన కళ్లజోడు పగిలిపోయిందని లెఫ్టినెంట్ గవర్నర్‌కు సీఎస్ వివరించారు. కాగా, సీఎస్‌పై దాడి ఘటన నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఐఏఎస్‌ల సంఘం సమావేశమైంది. ప్రభుత్వ ఉన్నతాధికారిపై దాడికి పాల్పడడం దురదృష్టకరమని వ్యాఖ్యానించిన సంఘం నేతలు.. దీనిపై ఎల్‌జీ బైజల్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.


అన్షుప్రకాశ్

నిరాధార ఆరోపణలు

సీఎస్‌పై ఎమ్మెల్యేలు దాడిచేశారనే మాట అవాస్తవమని, అవన్నీ నిరాధార ఆరోపణలని ముఖ్యమంత్రి కార్యాలయం కొట్టిపారేసింది. ఈ వివాదానికి సంబంధించి ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సీఎంవో స్పందించింది. సమీక్షా సమావేశం కోసమే సీఎస్‌తో పాటు ఇతర అధికారులను పిలిచినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ భేటీలో సీఎస్‌పై ఎలాంటి దాడి జరగలేదని వెల్లడించింది. దీనికి సంబంధించి సీసీ ఫుటేజ్‌లు చూస్తే ఈ విషయం తెలుస్తుందని పేర్కొంది. కాగా, సీఎం నివాసంలో జరిగిన సమావేశంలో సీఎస్ అన్షు ప్రకాశ్ తమను దుర్భాషలాడారంటూ సంగమ్ విహార్ పోలీస్ స్టేషన్లో ఆప్ ఎమ్మెల్యే ప్రకాశ్ జర్వల్ ఫిర్యాదు చేశారు.

అగ్ని-2 ప్రయోగం విజయవంతం

బాలాసోర్(ఒడిసా), ఫిబ్రవరి 20: అణ్వస్త్ర సామర్థ్యంగల మధ్య శ్రేణి క్షిపణి అగ్ని-2ను విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఒడిసాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి మంగళవారం ఈ క్షిపణిని ప్రయోగించినట్లు తెలిపింది. రెండు వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగల సామర్థ్యం అగ్ని-2 క్షిపణికి ఉందని పేర్కొంది. అగ్ని-2 క్షిపణి పొడవు 21 మీటర్లు కాగా సుమారు 16 టన్నుల బరువు ఉంటుంది. వెయ్యి కిలోల వార్‌హెడ్‌ను మోసుకెళ్ల గలిగే సామర్థ్యం దీనికుంది. ఉపరితలం నుంచి ఉపరితలానికి దూసుకెళ్లే ఈ క్షిపణిని ఉదయం 8:38 నిమిషాలకు నాలుగో ప్రయోగ వేదిక నుంచి పరీక్షించినట్లు అధికారులు వివరించారు. అగ్ని-2 క్షిపణిని రూపొందించిన డీఆర్‌డీవో గతంలోనే దీనిని సైన్యానికి అప్పగించింది. తాజాగా సైనిక వ్యూహాత్మక సన్నాహక పరీక్షలలో భాగంగా ఈ క్షిపణిని ప్రయోగించినట్లు సమాచారం.





అదే నాకు పద్మభూషణ్‌తో సమానం

- విజయనిర్మల

సీనియర్ నటీమణి, దర్శకురాలు, నిర్మాత, గిన్నిస్‌బుక్ రికార్డ్ హోల్డర్ విజయనిర్మల మంగళవారం ఉదయం అభిమానుల సమక్షంలో తన 73వ పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా హీరో కృష్ణ మాట్లాడుతూ ''అక్కినేని నాగేశ్వరరావు, రజనీకాంత్, శివాజీ గణేశన్ వంటి స్టార్ హీరోలతో సినిమాలు తీసిన ఏకైక లేడీ డైరెక్టర్ విజయనిర్మల. ఆమె దర్శకత్వంలో తెరకెక్కిన 44 చిత్రాల్లో సగానికి పైగా సినిమాల్లో నేను నటించినందుకు సంతోషంగా ఉంది. ప్రతి ఏడాది ఈ విధంగా మా ఇంటికి విచ్చేసి తమ అభిమానాన్ని చాటుకొంటున్న అభిమానులందరికీ కృతజ్ఞతలు. గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు గౌరవించిన విజయనిర్మలను త్వరలోనే భారత ప్రభుత్వం తగిన రీతిలో సత్కరిస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు. విజయనిర్మల మాట్లాడుతూ ''నా పుట్టినరోజు వేడుకలకు అభిమానులు రావడం చూసి సంతోషించిన దాసరిగారు 'ఏ స్టార్ హీరోయిన్‌కీ ఈ రేంజ్ క్రేజ్ లేదు' అన్నారు. అదే నాకు పద్మభూషణ్‌తో సమానం. నా పుట్టినరోజు వేడుకలకు హాజరైన అభిమానులందరికీ కృతజ్ఞతలు'' అన్నారు. నిర్మాత, సీనియర్ పాత్రికేయులు బి.ఎ.రాజు మాట్లాడుతూ ''దాసరి, బాపు వంటి టాప్ డైరెక్టర్స్ ఫస్ట్ హీరోయిన్ విజయనిర్మలగారు. అలాగే విజయశాంతిలాంటి స్టార్ హీరోయిన్‌ను 'కిలాడి కృష్ణుడు'తో తెలుగు తెరకు పరిచయం చేసింది కూడా విజయనిర్మలగారే. అంతటి ఘనత కలిగిన విజయనిర్మల పుట్టినరోజు వేడుకల్లో భాగస్వాములవ్వడం సంతోషంగా ఉంది'' అన్నారు. నరేష్ మాట్లాడుతూ ''మా కుటుంబ సభ్యులందరి పుట్టినరోజులకు ఈ విధంగా అభిమానులు విచ్చేయడం చాలా సంతోషంగా ఉంటుంది. ఎలాంటి స్వార్థం లేకుండా కేవలం అభిమానంతో ఇక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ నా ధన్యవాదాలు'' అన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు విజయనిర్మల 73 వేల రూపాయల చెక్‌ను అందించారు.

రాజమౌళి సినిమాలో రాశి?

'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన రాశిఖన్నా యంగ్ హీరోలతో భారీ చిత్రాల్లో నటించింది. ఇప్పటివరకు గ్లామర్ హీరోయిన్‌గానే కనిపించిన రాశి 'తొలిప్రేమ' చిత్రంలోని నటనతో మంచి నటిగా పేరు తెచ్చుకుంది. ఈ చిత్రంలో రాశి నటనకు ఫిదా అయిపోయిన దర్శకనిర్మాతలు ఆమె మంచి క్యారెక్టర్స్ ఇచ్చేందుకు పోటీలు పడుతున్నారు. నితిన్ హీరోగా దిల్‌రాజు నిర్మిస్తున్న 'శ్రీనివాసకల్యాణం' చిత్రంలో రాశిఖన్నా హీరోయిన్. ఇప్పుడీ అమ్మడికి ఓ భారీ ఆఫర్ వచ్చిందన్న వార్త ఫిలింనగర్‌లో చక్కర్లు కొడుతోంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో రాజమౌళి ఓ మల్టీస్టారర్ మూవీని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. అక్టోబర్ నుంచి సెట్స్ పైకి వెళ్ళనున్న ఈ సినిమాలో చరణ్‌కు జోడీగా రాశి హీరోయి న్‌గా నటించే అవకాశం ఉందని తెలుస్తోంది. 'తొలిప్రేమ' చిత్రంలోని రాశి నటనకు రాజమౌళి ఫిదా అయిపోయాడనీ, ఎన్టీఆర్, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో రూపొందే సినిమాలో రాశిఖన్నా ఓకే అయ్యిందని సమాచారం. అయితే ఈ విషయాన్ని యూనిట్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.





• అమితాబ్ బచ్చన్, సురేందర్‌రెడ్డి

డౌట్ క్లియర్

చిరంజీవి 151వ చిత్రంగా కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై రామ్‌చరణ్ నిర్మిస్తున్న చిత్రం 'సైరా.. నరసింహారెడ్డి'. సురేందర్‌రెడ్డి దర్శకుడు. ఇటీవల ప్రారంభమైన ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. ఇందులో నరసింహారెడ్డికి గురువు పాత్రను అమితాబ్ బచ్చన్ పోషిస్తున్నారు. అయితే అమితాబ్ ఈ సినిమా చెయ్యడం లేదన్న వార్తలు ఈమధ్య వినిపిస్తున్నాయి. ఈ సినిమాకి సంబంధించి కొంతమంది టెక్నీషియన్స్ తప్పుకోవడంతో అమితాబ్ కూడా సినిమా చెయ్యడం లేదన్న రూమర్ వచ్చింది. దీనికి ఫుల్‌స్టాప్ పెడుతూ అమితాబ్‌తో కలిసి తీయించుకున్న ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో అమితాబ్ 'సైరా' చిత్రంలో నరసింహారెడ్డి గురువు గోసాయి వెంకన్న పాత్రలో నటిస్తున్నారని సురేందర్‌రెడ్డి చెప్పకనే చెప్పారు. చిరంజీవి, అమితాబ్‌లతో పాటు, నయనతార, విజయ్ సేతుపతి, సుదీప్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి సంగీత దర్శకుడిగా ఇళయరాజా, కీరవాణి పేర్లు వినిపిస్తున్నాయి. అయితే ఎవరు ఆ బాధ్యతను తీసుకుంటారో తెలియాల్సి ఉంది.




• కల్యాణ్‌రామ్, హరికృష్ణ, ఎన్టీఆర్

నందమూరి మల్టీస్టారర్

మల్టీస్టారర్ సినిమాలు తెలుగులోనూ మంచి ఊపందుకున్నాయి. ఈ తరహా సినిమాలు చెయ్యడానికి తమ స్టార్‌డమ్‌ని కూడా పక్కన పెట్టి ఓకే చెప్తున్నారు. ఇక అక్కినేని ఫ్యామిలీ చేసిన మల్టీ స్టారర్ 'మనం' ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు నందమూరి ఫ్యామిలీ కూడా ఆ ప్రయోగం చెయ్యడానికి సిద్ధమవుతోందని తెలుస్తోంది. కల్యాణ్‌రామ్, ఎన్టీఆర్, హరికృష్ణ కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రాన్ని నిర్మించేందుకు రంగం సిద్ధమవుతోంది. కల్యాణ్‌రామ్ ప్రస్తుతం 'ఎం.ఎల్.ఎ.', 'నా నువ్వే' చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ రెండు సినిమాల తర్వాత పవన్ సాధినేని దర్శకత్వంలో ఈ మల్టీస్టారర్ ఉంటుందని తెలుస్తోంది. యన్.టి.ఆర్. ఆర్ట్స్ పతాకంపై నందమూరి కల్యాణ్‌రామ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తారు. ఎన్టీఆర్, హరికృష్ణ అతిథి పాత్రల్లో కనిపిస్తారని సమాచారం. ఈ సినిమాకి సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడకపోయినా త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తారని తెలుస్తోంది.

యుద్ధ నేపథ్యంలో మోహన్‌లాల్ 'యుద్ధభూమి'



• అల్లు శిరీష్

1971లో భారత సరిహద్దుల్లో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా మలయాళంలో తెరకెక్కిన చిత్రం '1971 బియాండ్ బార్డర్స్'. మేజర్ రవి దర్శకత్వం వహించారు. గత ఏడాది మలయాళంలో విడుదలై ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని జాష్ రాజ్ ప్రొడక్షన్స్, శ్రీలక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ బేనర్స్‌పై ఎ.ఎన్.బాలాజీ తెలుగులోకి అనువదిస్తున్నారు. ప్రస్తుతం అల్లు శిరీష్ డబ్బింగ్ చెబుతున్నారు. త్వరలో డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తి చేసి.. ఈ నెలాఖరులో ఆడియోను, మార్చిలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఎ.ఎన్.బాలాజి మాట్లాడుతూ ''ఈ చిత్ర దర్శకుడైన మేజర్ రవిగారు నిజ జీవితంలో కూడా మేజర్ కావడం విశేషం. ఈయన 1981లో ఆర్మీలో చేరి అనేక కీలక ఆపరేషన్స్‌ని లీడ్ చేసారు. మేజర్ రవి 2002 సంవత్సరంలో మొదటిసారిగా మెగాఫోన్ పట్టి 'పునర్జని' అనే మలయాళ చిత్రానికి దర్శకత్వం వహించారు. అప్పటి నుండి ఆయన తనకున్న దేశభక్తిని నిరూపిస్తూ తాను ఆర్మీలో పని చేసే సమయంలో జరిగిన ఆపరేషన్స్‌కి సంబంధించిన కొన్ని యథార్థ సంఘటనల ఆధారంగా ఎన్నో చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఈ చిత్ర కథ విషయానికొస్తే... 1971లో భారత్-పాక్ బార్డర్‌లో జరిగే వార్ నేపథ్యంలో ఎమోషనల్ డ్రామాగా సినిమా రూపొందింది. ముఖ్య పాత్రలలో మలయాళం సూపర్ స్టార్ మోహన్‌లాల్, అల్లు అరవింద్‌గారి తనయుడు అల్లు శిరీష్ నటించారు. ఈ చిత్రంలో మేజర్‌గా మోహన్‌లాల్, యంగ్ డైనమిక్ సోల్జర్‌గా అల్లు శిరీష్ కనిపిస్తారు. ఈ నెలాఖరులో ఆడియో విడుదల చేసి, మార్చి మొదటి వారంలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

నితిన్‌తో వెంకీ సినిమా

తొలి చిత్రం 'ఛలో'తో ఘనవిజయాన్ని అందుకున్నారు దర్శకుడు వెంకీ కుడుముల. తన తదుపరి చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ వారి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలో చేయబోతున్నారని కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. తాజా సమాచారం మేరకు ఈ సినిమాలో నితిన్ హీరోగా నటించే అవకాశం ఉందని తెలుస్తోంది. నితిన్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన 'అఆ' చిత్రానికి వెంకి సహాయ దర్శకుడిగా పనిచేశారు. త్వరలోనే ఈ సినిమాకి సంబంధించిన పూర్తి వివరాలు తెలుస్తాయి.



వరుణ్‌తేజ్ కొత్త సినిమా 'అహం బ్రహ్మాస్మి'?



'ఫిదా', 'తొలిప్రేమ' చిత్రాలతో వరస విజయాలు అందుకున్న వరుణ్‌తేజ్ తదుపరి చిత్రానికి 'అహంబ్రహ్మాస్మి' అనే పేరును ఖరారు చేసినట్టు వార్తలు వస్తున్నాయి. 'ఘాజీ' దర్శకుడు సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం ఏప్రిల్‌లో సెట్స్‌పైకి వెళ్ళనుంది. అంతరిక్షం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. 25 కోట్ల బడ్జెట్‌తో భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు 'అహంబ్రహ్మాస్మి' టైటిల్‌నే ఫైనల్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, ఈ సంవత్సరంలోనే చిత్రాన్ని విడుదల చేయాలని దర్శకనిర్మాతలు భావిస్తున్నారట.

ఆద్యంతం నవ్వించే ఊళ్లో పెళ్ళికి...



• రాజేంద్రప్రసాద్, సాక్షి చౌదరి

రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో జె.బి. క్రియేషన్స్ పతాకంపై శ్రీమతి భాగ్యలక్ష్మి నిర్మించిన సినిమా 'ఊ.పె.కు.హ'(ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి). 'నిధి' ప్రసాద్ దర్శకుడు. ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా జె.బి. క్రియేషన్స్ అధినేత విక్రమ్ మాట్లాడుతూ ''ఈ సినిమా ప్రేక్షకులు పెట్టిన ప్రతి రూపాయికి వినోదం అందిస్తుంది'' అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ '''నిధి' ప్రసాద్ తనను తాను కాంప్లికేటెడ్ చేసుకుని ప్రేక్షకులకు వినోదం ఇవ్వాలనుకుంటాడు. తనతో షూటింగ్ అంటే కష్టం. షూటింగ్ జరిగినంత సేపు తిట్టుకుని, విడుదల తర్వాత హ్యాపీగా ఫీలయ్యే వాళ్లలో నేనూ ఒకడ్ని. ప్రేక్షకులు హాయిగా నవ్వుకునే సినిమా ఇది'' అన్నారు. దర్శకుడు 'నిధి' ప్రసాద్ మాట్లాడుతూ ''షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కంప్లీట్ అయ్యాయి. సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఇందులో చాలామంది నటీనటులు, హాస్యనటులు నటించారు. సినిమా బాగా వచ్చింది. ఆద్యంతం నవ్విస్తుంది'' అన్నారు. సాక్షి చౌదరి మాట్లాడుతూ ''రాజేంద్రప్రసాద్‌గారితో నటించే అవకాశం దక్కినందుకు చాలా గొప్పగా ఫీలవుతున్నాను'' అన్నారు.

బెల్లంకొండ కొత్త సినిమా



బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నూతన దర్శకుడు శ్రీనివాస్ దర్శకత్వంలో వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ సొంటినేని (నాని) నిర్మించే చిత్రం ఫిబ్రవరి 22న ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా నిర్మాత నవీన్ సొంటినేని మాట్లాడుతూ ''బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా తెరకెక్కనున్న చిత్రంతో మా బ్యానర్‌ను ప్రారంభిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ''దృశ్యం, గోపాల గోపాల, డిక్టేటర్'' లాంటి సూపర్ హిట్ సినిమాలకు సహాయ దర్శకుడిగా పనిచేసిన శ్రీనివాస్ అద్భుతమైన కథను సిద్ధం చేశారు. సీనియర్ టెక్నీషియన్స్ ఈ చిత్రానికి వర్క్ చేయనున్నారు. త్వరలోనే మిగతా నటీనటుల మరియు సాంకేతిక నిపుణులను ప్రకటిస్తాం. ఫిబ్రవరి 22న హైద్రాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఈ చిత్రం ప్రారంభమవుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, సినిమాటోగ్రఫీ: ఛోటా కె.నాయుడు, సహ నిర్మాత: చాగంటి శాంతయ్య, నిర్మాత: నవీన్ సొంటినేని (నాని), నిర్మాణం: వంశధార క్రియేషన్స్, దర్శకత్వం: శ్రీనివాస్.

నిఖిల్ సరసన షాలినీ పాండే

కన్నడలో సూపర్‌హిట్ అయిన 'కిరిక్ పార్టీ'ని నిఖిల్ హీరోగా 'కిరాక్ పార్టీ' పేరుతో తెలుగులో రీమేక్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం మార్చి 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా విడుదలకు ముందే మరో రీమేక్‌ని ప్రారంభించేందుకు రెడీ అవుతున్నారు నిఖిల్. తమిళ్‌లో ఘనవిజయం సాధించిన 'కనిథన్' చిత్రం రీమేక్ త్వరలో సెట్స్‌పైకి వెళ్ళనుంది. 'కనిథన్' చిత్రానికి దర్శకత్వం వహించిన టి.ఎస్.సంతోష్ తెలుగు వెర్షన్‌ని కూడా రూపొందించనున్నారు. ఈ చిత్రంలో నిఖిల్ సరసన హీరోయిన్‌గా కేథరిన్ త్రెసా, మేఘా ఆకాశ్ పేర్లు వినించాయి. తాజాగా 'అర్జున్‌రెడ్డి' హీరోయిన్ షాలిని పాండే హీరోయిన్‌గా ఓకే అయిందని తెలుస్తోంది. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.



పల్లెల్లో పవర్ కట్



బిల్లులు చెల్లించని పంచాయతీలు

- డిస్కంలకు రూ. 97 కోట్ల బాకీ
- నోటీసులిచ్చినా స్పందన శూన్యం
- సరఫరా ఆపేస్తున్న పంపిణీ సంస్థలు


విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్‌బ్యూరో): రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేయడంతో పంచాయతీలు అంధకారంలోకి వెళ్లిపోతున్నాయి. ముఖ్యంగా ఆదాయం తక్కువగా ఉండే పంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించలేక కోతలకు గురవుతున్నాయి. విద్యుత్ బిల్లులు పేరుకుపోవడం, కట్టే స్థోమత పంచాయతీలకు లేకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ఆదాయం తక్కువగా ఉండే చిన్న పంచాయతీల విద్యుత్ బిల్లులను గతంలో రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేది. రాష్ట్ర విభజన తర్వాత ఆర్థిక ఇబ్బందుల పేరుతో ఆ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకొంది. పంచాయతీలకు అరకొరగా వచ్చే నిధులతోనే బిల్లులు చెల్లించుకోవాలని స్పష్టంచేసింది. 14వ ఆర్థిక సంఘం నిధులతో విద్యుత్ బిల్లులు చెల్లించాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. అయితే, పంచాయతీలకు వచ్చే కొద్దిపాటి నిధులపై సర్పంచ్‌లతో పాటు జన్మభూమి కమిటీ సభ్యుల పెత్తనం కొనసాగుతుండటంతో కమీషన్లు వచ్చే పనులకే వారు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కారణంగా విశాఖ కేంద్రంగా ఐదు జిల్లాలకు విద్యుత్‌ను సరఫరా చేసే ఈపీడీసీఎల్‌కు 2016-17 నాటికి పంచాయతీల బాకీలు రూ. 80.64 కోట్లకు చేరుకున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మరో రూ. 17 కోట్లు జతయ్యాయి. తిరుపతి కేంద్రంగా పనిచేసే ఎస్పీడీసీఎల్ పరిస్థితి కూడా దాదాపుగా ఇలానే ఉంది.

సర్కారుకు చెప్పినా..

పంచాయతీల నుంచి బకాయిలు కోట్లలో పేరుకుపోవడంతో డిస్కంల అధికారులు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీలకు సమాచారం పంపించి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. అయినా, సర్పంచ్‌లు పట్టించుకోకపోవడంతో బకాయిలు వసూలు కాలేదు. చివరకు నోటీసులు జారీ చేసినా ఫలితం కనిపించలేదు. విశాఖ జిల్లాలోని 925 పంచాయతీలకు గాను 50కి పైగా పంచాయతీలు గత మూడున్నరేళ్లుగా ఒక్క పైసా కూడా చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఇలా కరెంటు ఆపేసిన పంచాయతీలు ఎక్కువగా ఏజెన్సీలో ఉండటంతో అక్కడ పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. నోటీసు ఇచ్చిన 30 రోజుల్లో బకాయిలు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే 870 పంచాయతీలకు నోటీసులు జారీ అయ్యాయి. ఒకపక్క నిధులున్నా లేకున్నా పంచాయతీల్లో ఎల్ఈడీ బల్బుల పథకాన్ని నిర్బంధంగా అమలుచేస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ వాటిని వెలిగించేందుకు అవసరమైన విద్యుత్ సరఫరాపై దృష్టి సారించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమౌతున్నాయి. అధికారులు మాత్రం విద్యుత్ బకాయిలతో తమకు సంబంధం లేదని, సర్పంచ్‌లే వాటిని చెల్లించాలని స్పష్టం చేస్తున్నారు.

వాయిదాలలో కూడా చెల్లించడం లేదు

గ్రామ పంచాయతీలకు ఆదాయం ఉన్నా విద్యుత్ బకాయిలు చెల్లించడం లేదని ఈపీడీసీఎల్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒకేసారి కాకుండా వాయిదాల పద్ధతిలో చెల్లించే వెసులుబాటు కల్పించినా సర్పంచ్‌ల నుంచి స్పందన లేదని చెప్పారు. కొన్ని మేజర్ పంచాయతీలకు లక్షల్లో బకాయిలున్నాయన్నారు. దీంతో మరో మార్గం లేక నోటీసులిచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు.



మీ అధికారులను పంపండి

- రాష్ట్రానికి కేంద్ర హోం శాఖ లేఖ
- 23న విభజన హామీలపై భేటీ
- తెలంగాణ అధికారులకూ ఆహ్వానం
- నేడు ఏపీ కేబినెట్ సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి): రాష్ట్ర విభజన హామీలపై చర్చించేందుకు ఏపీ నుంచి సంబంధిత ఉన్నతాధికారులను ఢిల్లీకి పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్‌కు మంగళవారం కేంద్ర హోం శాఖ లేఖ రాసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కార్యదర్శి అధ్యక్షతన విభజన హామీలపై ఈ నెల 23న సాయంత్రం 4 గంటలకు సమావేశానికి రావాలని లేఖలో పేర్కొన్నారు. ఢిల్లీకి వచ్చేటప్పుడు విభజన చట్టంలో రాష్ట్రానికి రావాల్సిన అన్ని అంశాల గురించి సమగ్ర సమాచారం వెంట తేవాలని సూచించింది. విశాఖకు రైల్వే జోన్, రాష్ట్రంలోని ఆర్థిక, రెవెన్యూ లోటు, కడప ఉక్కు కర్మాగారం, దుగరాజపట్నం పోర్టు, విభజన చట్టంలోని 9, 10వ షెడ్యూల్ సంస్థల విభజన అంశాలపై ఈ నెల 23న సుదీర్ఘంగా కేంద్రం చర్చించనుంది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ తెలంగాణ అధికారులనూ పంపించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్రం హోం శాఖ సమాచారం అందించింది. కాగా కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు, నిరసనల నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిసింది. అయితే ఈ చర్చలు ఏ మేరకు ఫలిస్తాయో, కేంద్రం ఎంతవరకు ఆ సమస్యలను పరిష్కరిస్తుందో వేచి చూడాల్సిందే.

నేడు ఏపీ మంత్రి మండలి సమావేశం

ఏపీ సీఎం చంద్రబాబు నేతృత్వంలో బుధవారం రాష్ట్ర మంత్రి మండలి సమావేశం జరగనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి ఈ సమావేశం ప్రారంభం కానుంది. కాగా ఈ సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారని తెలుస్తోంది. అలాగే వచ్చే నెలలో రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర బడ్జెట్‌లో పెట్టాల్సిన కొన్ని కీలక అంశాలకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. అంతేకాకుండా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి ప్రస్తుతం సందిగ్ధత ఏర్పడిన పరిస్థితుల్లో రాష్ట్ర బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం నుంచి ఎంత మేరకు సాయం అందవచ్చనే అంశంపైనా మంత్రి మండలి చర్చించనున్నట్లు సమాచారం.



'హోదా' సెంటిమెంట్‌తో లబ్ధికి వైసీపీ యత్నం

- సోనియా, రాహుల్‌నూ నమ్మలేం
- విపక్షాలపై సీఎం చంద్రబాబు ఫైర్

అమరావతి, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి): ప్రత్యేక హోదా సెంటిమెంట్‌తో వైసీపీ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. మంగళవారం ఆయన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో విపక్షాల ఎత్తులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రత్యేక హోదా తప్ప వేరే అంశం మాట్లాడటం లేదని, ప్రజల్లో ఉన్న ఈ సెంటిమెంటును అడ్డంపెట్టుకుని రాజకీయ లాభం పొందాలని చూస్తోందని ధ్వజమెత్తారు. ఈ విషయంలో వైసీపీ రోజుకోలా మాట్లాడుతోందని, ఉప ఎన్నికలు రావన్న నమ్మకంతోనే ఎంపీల రాజీనామాలకు తెరతీసిందని ఆరోపించారు. దీనిపై ఇతర పార్టీలు విమర్శలు చేయడంతో మళ్లీ ఇప్పుడు అవిశ్వాసం అంటోందన్నారు. టీడీపీ కూడా అవిశ్వాసాన్ని చివరి అస్త్రంగా వాడేందుకు సిద్ధమనడంతో వైసీపీ మళ్లీ వెనక్కి తగ్గుతోందన్నారు. పార్లమెంట్‌లో తెలుగుదేశం ఎంపీలు గొడవ చేస్తుంటే కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్, సోనియా గాంధీలు కనీసం నోరు మెదపకుండా ఉండిపోయారని చంద్రబాబు విమర్శించారు. వీళ్లను నమ్ముకుని పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం ఎలా పెట్టాలని అన్నారు. రాజ్యసభలో కేవీపీ ప్లకార్డులు పట్టుకుంటే తమకు సంబంధం లేదని, సస్పెండ్ చేసుకోవచ్చని ఆ పార్టీ నేత ఆజాద్ అనడం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనమని చంద్రబాబు కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పంట పెట్టుబడికి రూ.12500

ప్రతి మే నెలలో రైతుకు అందిస్తాం



- పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్
- రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి
- పాడి పరిశ్రమకూ పెద్దపీట వేస్తాం: జగన్
- ప్రకాశం జిల్లాలో రైతు ఆత్మీయ సమ్మేళనం

ఒంగోలు, ఫిబ్రవరి 20: నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో ఏ ఒక్క రైతు ముఖంలో సంతోషం లేకుండా పోయిందని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో బేషరతుగా వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన బాబు అధికారంలోకి వచ్చాక రైతులను మోసం చేశారన్నారు. రైతుల కష్టాలు తీర్చేందుకు మళ్లీ రాజన్న రాజ్యం రావాలని జగన్ అన్నారు. 93వ రోజు ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా తిమ్మపాలెంలో రైతులతో ఆయన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పారు. రైతులకు వడ్డీలేకుండా రుణాలు మంజూరు చేస్తామని, ఆ వడ్డీ డబ్బులు ప్రభుత్వమే కడుతుందని తెలిపారు. జూన్ నెలలో రైతులు సాగుకు సన్నద్ధమవుతాడని, పంట పెట్టుబడుల కోసం అన్నదాతలు ఇబ్బంది పడకుండా మే నెలలోనే రూ.12500 ఇస్తామని హామీ ఇచ్చారు. కోరిన ప్రతి రైతన్నకు ఉచితంగా బోర్లు వేయిస్తామని, అన్నదాత ముఖంలో చిరునవ్వు ఉండేలా గిట్టుబాట ధరలకు ప్రభుత్వమే పంటను కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. ఇందుకోసం రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని జగన్ పేర్కొన్నారు. 'పాడి ఉన్న ఇంట సిరులు నిండునట.. కవ్వం తిరుగు ఇంట కరువుండదట' అంటూ పాడి పంటలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పారు. దళారీ నాయకుడిలా మారి చంద్రబాబు రైతులను బతకనిచ్చే పరిస్థితి లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఒకప్పుడు లాభాల్లో ఉన్న కోఆపరేటివ్ డైరీలు చంద్రబాబు సీఎం అయిన తర్వాత నష్టాల్లో నడుస్తున్నాయని, ఆయన ఇదంతా ఒక పథకం ప్రకారమే చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హఠాత్తుగా కరువు లేదా తుఫాన్లు వస్తే రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ, బీమా ఇచ్చే పరిస్థితి కూడా టీడీపీ ప్రభుత్వం లేదన్నారు. తమ ప్రభుత్వం వస్తే ప్రతి రైతన్నకూ తోడుగా ఉండేందుకు ప్రకృతి వైపరీత్యాల నిధిని ఏర్పాటు చేస్తామని జగన్ చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు ఎక్కడేసినది అక్కడే ఉందని, పెండింగ్‌లో ఉన్న ప్రతి ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

అది ఏక పక్ష నిర్ణయం

- అమరావతిలో హైకోర్టుపై లాయర్లతో సంప్రదింపులు లేవు.. కర్నూలులోనే పెట్టాలి
- ఉమ్మడి హైకోర్టులో పిటిషన్ దాఖలు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (మనం లీగల్ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టును అమరావతిలో పెట్టాలని న్యాయమూర్తులు ఏక పక్షంగా నిర్ణయం తీసుకున్నారంటూ రాయలసీమకు చెందిన న్యాయవాది నారాయణ స్వామి ఆరోపించారు. లాయర్లను కనీసం సంప్రదించకుండానే నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. శ్రీబాగ్ ఒడంబడికను అనుసరించి ఇప్పుడైనా హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరుతూ ఆయన తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పిటిషన్‌లో పైవిధంగా పేర్కొన్నారు. దీనిని విచారణకు స్వీకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషనర్ వ్యాఖ్యలపై ఆక్షేపించింది. న్యాయవాదులతో జడ్జిలు సమావేశాలు నిర్వహించాలా.. చరిత్రలో ఇలాంటి ఘటన ఎప్పుడైనా ఎక్కడైనా జరిగిందా.. అని బెంచ్ ప్రశ్నించింది. గతంలో ఇదే విషయమై వ్యాజ్యాలు దాఖలు చేసినప్పుడు కేంద్ర, రాష్ట్రాలకు హైకోర్టు నోటీసులిచ్చిందని, ఆ తర్వాత ఈ కేసు మళ్లీ విచారణకు నోచుకోలేదదని, దీనిని తక్షణం విచారణకు స్వీకరించాలని పిటిషనర్ కోరారు. రాయలసీమ ప్రాంతంలో ఏపీ హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ లాయర్లు సమ్మె చేస్తున్నారని వివరించారు. సమ్మెలు చేస్తున్నారని అత్యవసరంగా విచారణ చేపట్టలేమని బెంచ్ స్పష్టం చేసింది. సమ్మె విరమించి కేసు విచారణకు రావాలని సూచన చేసింది.

అవిశ్వాసానికి మద్దతివ్వండి

- లేదా మీరు పెట్టినా సరే: బొత్స

విజయవాడ ఫిబ్రవరి 20 (మనం న్యూస్): ఏపీకి అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వంపై తాము ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి టీడీపీ మద్దతు ఇవ్వాలని, లేదా టీడీపీ ప్రవేశపెడితే తాము మద్దతు ఇస్తామని వైసీపీ కీలక నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ నాలుగేళ్లుగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విభజన హామీలను సాధనలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ముఖ్యంగా ప్రత్యేక హోదా విషయంలో తెలుగుదేశం పార్టీ మాట మార్చి ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించి ప్రజల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. అలాగే పోలవరం నిధుల విషయంలో, విశాఖ రైల్వేజోన్, కడప స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం పోర్టు తదితర ప్రాజెక్టుల సాధనలో టీడీపీ కేంద్రం నుంచి ఎటువంటి హామీ పొందలేకపోయిందని బొత్స చెప్పారు. గత ఎన్నికలలో బీజేపీ, టీడీపీతో కలసి రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కూడా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో చేతులెత్తేశారని విమర్శించారు.

బీజేపీని టార్గెట్ చేయడం సరికాదు: ఎమ్మెల్యే ఆకుల

విజయవాడ, ఫిబ్రవరి 20 (మనం న్యూస్ ప్రతినిధి): మిత్రపక్షంగా ఉన్న టీడీపీ ఉద్దేశపూర్వకంగానే బీజేపీని టార్గెట్ చేస్తోందని రాజమండ్రి సిటీ బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో కేంద్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం జరుగుతోందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో బీజేపీ ఏం చెప్పిందో వాటినే అమలు చేస్తోందని ఆయన చెప్పుకొచ్చారు. ఏపీకి కేంద్రం అన్యాయం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలు సరికావన్నారు.

ప్రత్యేక హోదా ఆంధ్రా హక్కు

- టీడీపీ ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్

అమరావతి, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి): ప్రత్యేక హోదాను 2017 తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలో కొనసాగనివ్వమని కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ చెప్పటం వల్లే తాము ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్నామని టీడీపీ ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ చెప్పారు. అయితే కొన్ని రాష్ట్రాలకు హోదా కొనసాగించనున్నారని తెలిసిందని...ఇలా అయితే ఏపీకి హోదా ఇచ్చి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదాను తాము ఆంధ్ర రాష్ట్ర హక్కుగా భావిస్తున్నామని.. తప్పక సాధించి తీరతామని ఆయన చెప్పారు. అవిశ్వాసం అనేది చివరి అస్త్రం కావాలి గానీ, ప్రతిపక్షాలకు ప్రచారస్త్రం కాకూడదని కేశవ్ వైసీపీపై మండిపడ్డారు.

24 నుంచి విశాఖలో సీఐఐ సదస్సు

- 2,500 మంది ప్రతినిధులకు ఆహ్వానం
- పరిశ్రమల మంత్రి అమరనాథ రెడ్డి



అమరావతి, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి): విశాఖ వేదికగా ఈ నెల 24 నుంచి 26 వరకు సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నామని పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి చెప్పారు. సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాకు ఈ సదస్సుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా మూడో ఏడాది ఈ సదస్సును నిర్వహిస్తున్నామని మంత్రి చెప్పారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)తో కలిసి ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సదస్సుల్లో గతంలో కేంద్ర ప్రభుత్వం ప్లీనరీలు మాత్రమే జరిగేవని, ఈ సారి కేంద్రానికి చెందిన 11 ప్లీనరీ సెషన్స్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం 8 అంశాలపై ప్లీనరీలు ఉంటాయని తెలిపారు. వీటిలో సన్ రైజ్ ఏపీ, ఇండస్ట్రీ 4.0, స్కిల్ డెవలప్‌మెంట్, ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్, కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలు, మౌలికవసతుల అభివృద్ధి, ఆటోమొబైల్, టెక్స్‌టైల్, పునరుత్పాదక శక్తి, పర్యాటకం, ఏరోస్పేస్, డిఫెన్స్, ఫుడ్ ప్రాసెసింగ్, మెడికల్ ఎక్విప్‌మెంట్ తదితర అంశాలపై చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా కొరియా, జపాన్ దేశాలకు చెందిన రెండు సెషన్స్ కూడా జరుగుతాయన్నారు. ఈ సదస్సు ప్రారంభ రోజు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పాల్గొనే అవకాశం ఉందని, అలాగే సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు హాజరవుతారని తెలిపారు. 14 దేశాలకు చెందిన వాణిజ్య మంత్రులు, అంతర్జాతీయంగా పేరున్న 39 దేశాలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖ కంపెనీలకు చెందిన వ్యాపారవేత్తలు మొత్తం 2500 మందిని ఆహ్వానించినట్లు చెప్పారు. చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ అదృష్టమని, ఆయన వల్ల రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి అన్నారు. 2016లో జరిగిన భాగస్వామ్య సదస్సులో అన్ని శాఖలకు కలిపి రూ.3,44,201 కోట్ల పెట్టుబడులు... 7,03,727 మందికి ఉపాధి లభించే సంస్థల ఏర్పాటుకు సంబంధించి 290 అవగాహన ఒప్పందాలు జరిగాయన్నారు. వాటిలో 65.17 శాతం సంస్థలు, 44.26 శాతం పెట్టుబడులకు సంబంధించి ఉత్పత్తి ప్రారంభించిన్నట్లు తెలిపారు. 2016, 2017లో సదస్సుల్లో కలుపుకొని పరిశ్రమల శాఖ పరిధిలో 8,74,658 మందికి ఉపాధి లభించే రూ.2,92,300 కోట్ల పెట్టుబడులతో ప్రారంభించే ప్రాజెక్టులకు సంబంధించి 178 ఒప్పందాలు జరిగాయని పేర్కొన్నారు. వాటిలో 54 శాతం ప్రాజెక్టులు.. 57.80 శాతం పెట్టుబడులకు సంబంధించి ఉత్పత్తి ప్రారంభించినట్టు తెలిపారు. మిగిలిన ప్రాజెక్టులు కొన్ని నిర్మాణ దశలో, మరి కొన్ని యంత్రాలు అమర్చే దశలో, ఇంకొన్ని ప్రారంభించే దశలో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో సముద్ర తీరం అధికంగా ఉండటం, వ్యవసాయ ఉత్పత్తులు పెరగడం వల్ల ఫుడ్ ప్రాసెసింగ్ రంగం ఆశాజనకంగా ఉన్నట్లు తెలిపారు. ఈ రంగంలో రెండు సదస్సులలో 88,793 మందికి ఉపాధి కల్పించే రూ.9,702 కోట్లతో ప్రారంభించే ప్రాజెక్టులకు సంబంధించి 243 ఒప్పందాలు జరిగినట్లు చెప్పారు. వాటిలో 62 శాతం ప్రాజెక్టులు 65 శాతం పెట్టుబడులతో నిర్మాణదశలో ఉన్నట్లు తెలిపారు. కాగా, అనంతపురంలోని కియా కార్ల కంపెనీ ఫ్రేమ్ వర్క్ పనులను ఈ నెల 22న సీఎం ప్రారంభిస్తారని మంత్రి అమరనాథరెడ్డి తెలిపారు.

మత్స్యకారుల దీక్ష విరమణ

- చినరాజప్ప హామీ ఫలితం

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్‌బ్యూరో): మత్స్యకారులు ఎట్టకేలకు తమ నిరశన దీక్షలు విరమించారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా తమను ఎస్టీల జాబితాలో చేర్చాలంటూ 56 రోజులుగా విశాఖపట్నంలో చేస్తున్న దీక్షలను మంగళవారం విరమించారు. రానున్న బడ్జెట్ సమావేశాలలో ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇస్తుందని, తమ పార్టీ మత్స్యకారులకు న్యాయం చేస్తుందని ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప హామీ ఇవ్వడంతో దీక్షను విరమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అయితే, వైసీపీ నేతలు మాత్రం ఈ హామీలు బోగస్ అని ధ్వజమెత్తారు. తెలుగుదేశం నేతలు మత్స్యకారులను మభ్యపెట్టారని వైఎస్సార్‌సీపీ నగర మహిళా విభాగం అధ్యక్షురాలు గరికిన గౌరి విమర్శించారు.

అగ్రిగోల్డ్ ఫైళ్లు అప్పగించండి

- హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 20: అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులు,అప్పుల డాక్యుమెంట్లను సుభాష్ చంద్ర ఫౌండేషన్‌కు ఇవ్వాలని బ్యాంకులు, అగ్రిగోల్డ్ కంపెనీని హైకోర్టు ఆదేశించింది. అగ్రిగోల్డ్ కంపెనీ డిపాజిటర్లను మోసం చేసిందని, సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన రిట్లపై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. అగ్రిగోల్డ్ కంపెనీని స్వాధీనం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఆస్తుల స్వాధీనానికి అవసరమైన డాక్యుమెంట్లు అందజేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఫౌండేషన్ తరపు లాయర్ కోరారు. పత్రాలు ఇచ్చేందుకు అగ్రిగోల్డ్ కంపెనీ రెడీగానే ఉందని ఆ కంపెనీ తరపు న్యాయవాది బదులిచ్చారు. అగ్రిగోల్డ్ ఆస్తులు, అప్పుల పత్రాలన్నింటినీ ఫౌండేషన్‌కు ఇవ్వాలని న్యాయమూర్తులు రామసుబ్రమణియన్, ఎస్.వి.భట్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను కోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

పాస్‌బుక్ కోసం 15 వేలు లంచం

- ఏసీబీ వలలో చిక్కిన తహశీల్దార్

చిత్తూరు, ఫిబ్రవరి 20 (మనం న్యూస్): చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండల తహశీల్దార్‌గా పనిచేస్తున్న సుశీల రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయింది. పొలం పాసుబుక్ కోసం పాతపేటకు చెందిన రాజేంద్ర అనే రైతును దరఖాస్తు చేసుకోగా.. లంచం కోసం దాదాపు 6 నెలలుగా ఆమె వేధిస్తోంది. రూ.15 వేలు ఇస్తేనే పాసుబుక్ చేతిలో పెడతానని ఖరాకండీగా చెప్పడంతో అతడు విస్తుపోయాడు. దీంతో ఇక చేసేది లేక విసిగిపోయిన అతడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం అతడు లంచం సొమ్ము తహశీల్దార్ కార్యాలయంలోనే అందిస్తుండగా.. ఏసీబీ డీఎస్పీ తిరుమలేశ్ రెడ్డి ఆమెను అరెస్టు చేశారు.

పవన్‌కు చంద్రబాబంటే భయమా!



- పాచిపోయిన లడ్డూలన్నారు
- తీసుకున్న బాబునెందుకు ప్రశ్నించరు
- అవిశ్వాసానికి మేం రెడీ: అంబటి

అమరావతి, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి): అవిశ్వాస తీర్మానం విషయంలో పవన్‌కు తమ పార్టీ అధినేత జగన్ ఎక్కడా సవాల్ చేయలేదని ఆ పార్టీ నేత అంబటి రాంబాబు చెప్పారు. అవిశ్వాసానికి మీ పార్ట్‌నర్‌ను ఒప్పించండని మాత్రమే పవన్‌ను ఉద్దేశించి జగన్ వ్యాఖ్యానించినట్లు ఆయన స్పష్టం చేశారు. మీ సవాల్‌ను మేం స్వీకరించామని, మీరూ నిష్పాక్షికంగా వ్యవహరిస్తే శభాష్ అంటామని అంబటి వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ చిన్నపిల్లాడిలా వ్యవహరిస్తున్నారని అంబటి ఎద్దేవా చేశారు. చంద్రబాబు తన పార్ట్‌నర్ కాదంటూనే ప్రతిపక్షాన్ని ప్రశ్నించడం ఏమిటని ఆయన నిలదీశారు. కేవలం 1.25%తో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని, అందుకు కారణం పవన్ అని ప్రజలు అనుకుంటున్నారని అంబటి చెప్పారు. అలాంటప్పుడు చంద్రబాబును ప్రశ్నించే హక్కు పవన్‌కు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కానీ పవన్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక హోదా ఇచ్చినప్పుడు పాచిపోయిన లడ్డు ఇచ్చారని పవన్ చేసిన వ్యాఖ్యలను అంబటి గుర్తుచేశారు. మరి అలాంటి పాచి లడ్డూలను తీసుకుని బ్రహ్మాండంగా ఉన్నాయన్న చంద్రబాబును పవన్ ఎందుకు ప్రశ్నించరని మండిపడ్డారు. అవిశ్వాసం అక్కర్లేదన్న చంద్రబాబును పవన్ ఎందుకు నిలదీయరని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మంత్రి వర్గం నుంచి టీడీపీ నేతలు తప్పుకునేలా చంద్రబాబుపై పవన్ ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. అవిశ్వాసానికి మద్దతుగా ఇతర రాష్ట్రాల ఎంపీల మద్దతు కోరతానని పవన్ అనడం హాస్యాస్పదమని అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. మీరు అధికారంలోకి తీసుకొచ్చిన టీడీపీ తరపున 20 మంది ఎంపీలు ఉంటే.. వాళ్లను వదిలేసి ఇతర పార్టీల మద్దతు కూడగడతాననడమేంటని ఆయన పవన్‌ను నిలదీశారు. దీన్ని బట్టి చూస్తే.. ప్రజలను పవన్ మోసం చేస్తున్నట్లు అనిపిస్తోందని అంబటి వ్యాఖ్యానించారు.



లక్ష ఉద్యోగాల జోడింపు

'నాస్కామ్' తీపి కబురు

హైదరాబాద్: సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఐ.టి) పరిశ్రమ 2018–19 ఆర్థిక సంవత్సరంలో లక్ష ఉద్యోగాలు జోడించగలదని 'నాస్కామ్' భావిస్తోంది. దేశంలో 2017–18లో 7.8 శాతంగా ఉన్న ఐ.టి, బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ (బి.పి.ఓ) పరిశ్రమ వృద్ధి రేటు 2018–19లో 7–9 శాతంగా ఉండగలదని నేషనల్ సాఫ్ట్‌వేర్ అండ్ సొల్యూషన్స్ కంపెనీస్ (నాస్కామ్) అంచనా వేసింది. అంతర్జాతీయంగా ఎదురుగాలులు, అస్థిరతలు ఉన్నప్పటికీ వృద్ధిని సాధించగలమనే ధీమాతో 'నాస్కామ్' ఉంది. ఇక 2017–18సో 126 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు 2018–19లో 137 బిలియన్ డాలర్లుగా ఉండగలవని 'నాస్కామ్' అంచనా వేసింది. మొత్తంమీద ఐ.టి–బి.పి.ఓ పరిశ్రమ 14 నుంచి 16 బిలియన్ల డాలర్లను జోడించబోతోంది.



'నాస్కామ్' అధ్యక్షుడు ఆర్. చంద్రశేఖరన్ మంగళవారం నాడిక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పరిశ్రమ 2017–18లో 7.8 శాతం వృద్ధిని వీక్షించినట్లు ఆయన చెప్పారు. ''అనేక రకాలుగా ఎదురు గాలులు ఉన్నప్పటికీ, పరిశ్రమ వృద్ధిని కొనసాగిస్తోంది'' అని ఆయన అన్నారు. 'నాస్కామ్' 2017–18లో వృద్ధి 7–8 శాతంగా ఉండగలదని అంచనా వేసింది. ఐ.టి–బి.పి.ఎం పరిశ్రమ పరిమాణం 2017 ఆర్థిక సంవత్సరంలో 125 బిలియన్ డాలర్ల ఎగుమతులతో కలుపుకొని 154 బిలియన్ డాలర్లుగా ఉండగలదని అంచనా వేశారు.

డిజిటల్ వ్యాపారంలో వృద్ధి ఎక్కువగా ఉండగలదని చంద్రశేఖర్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తంమీద రాబడులలో డిజిటల్ విభాగ వాటా 20 శాతంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా కంపెనీల డిజిటల్ వ్యయం పెరుగుతుందని గార్ట్‌నర్, ఫారెస్టర్ వేసిన అంచనాను ఆయన ప్రస్తావించారు. అది ఇప్పుడున్న 180 బిలియన్ డాలర్ల నుంచి 2020 నాటికి 310 బిలియన్ డాలర్లకు పెరగగలదని భావిస్తున్నారు.

వచ్చే ఆర్థిక సంవత్సరానికి వృద్ధి సంఖ్యలకు తుది రూపునిచ్చేందుకు ఇక్కడ జరుగుతున్న 'నాస్కామ్' ఇండియా లీడర్‌షిప్ ఫోరమ్ (ఎన్.ఐ.ఎల్.ఎఫ్–2018)లో 'నాస్కామ్' సమీక్ష సమావేశం నిర్వహించింది.

మూడు రోజుల ఎన్.ఐ.ఎల్.ఎఫ్, వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఐ.టిలకు ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు హైదరాబాద్ ఆతిథ్యం వహిస్తోంది. ''మేం 2018–19లో కూడా అంతర్జాతీయంగా ఎదురు గాలులు ఇప్పటిమాదిరిగానే కొనసాగగలవనే అభిప్రాయానికొచ్చాం'' అని చంద్రశేఖర్ చెప్పారు.



దేశీయ పరిశ్రమ 10–12 శాతం వృద్ధి చెందగలదని భావిస్తున్నారు. ఈ రంగం నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 26 బిలియన్ డాలర్లుగా ఉన్న వాటా 2018–19లో 28–29 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందగలదని భావిస్తున్నారు.

'నాస్కామ్' సాధారణంగా, ఎన్.ఐ.ఎల్.ఎఫ్ ఘట్టాన్ని పురస్కరించుకుని వార్షిక వృద్ధి అంచనా సంఖ్యలను వెల్లడిస్తుంది. కానీ, ఈ వ్యాపారంలో ఉన్న అస్థిర పరిస్థితులు, అంతర్జాతీయ సవాళ్ళను దృష్టిలో ఉంచుకుని 'నాస్కామ్' గత ఏడాది ఆ ప్రకటనను వాయిదా వేసింది. అది 2017 జూన్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి సంఖ్యలు వెల్లడించింది. ఈఏడాది ఈ–కామర్స్ పరిశ్రమ 38.5 బిలియన్ డాలర్ల వాటా నందించింది. ఈ రంగం మౌలిక వసతుల సమస్యలను ఎదుర్కొంటోంది. ఫలితంగా, టైర్ వన్, టైర్ టూ నగరాలకు మించి వృద్ధి సాధించడానికి వీలులేకపోతోంది.

తగ్గిన షేర్ల తాకట్టులు

న్యూఢిల్లీ: బి.ఎస్.ఇలో లిస్ట్ అయిన టాప్ 500 కంపెనీల ప్రమోటర్లు తాకట్టుపెట్టిన సగటు షేర్ల శాతం 2017 అక్టోబర్–డిసెంబరు మూడు నెలల కాలంలో 7.8కి తగ్గింది. దానికి ముందు మూడు నెలల్లో అది 8.3 శాతంగా ఉందని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ రిసెర్చ్ పేర్కొంది. ప్రమోటర్లు తాకట్టుపెట్టిన షేర్ల విలువ 2017 డిసెంబరులో మొత్తం బి.ఎస్.ఇ–500 ఇండెక్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో రూ. 1.98 లక్షల కోట్లుగా (సుమారు 1.47 శాతం) ఉంది. కోటక్ నివేదిక ప్రకారం, 129 కంపెనీల ప్రమోటర్లు బి.ఎస్.ఇ 500 ఇండెక్స్ కంపెనీలలో తమకున్న షేర్లను తొమ్మిది సంస్థల వద్ద తాకట్టుపెట్టారు. ప్రమోటర్ హోల్డింగ్‌లో 90 శాతం పైగా తాకట్టుపెట్టడం గమనించవలసిన విషయం. నిఫ్టీ 50 కంపెనీల ప్రమోటర్లలో కొందరు తమ వాటాలో 5 శాతం పైగా షేర్లను తాకట్టుపెట్టారు.


మిత్తల్ బిడ్‌కు భంగపాటు

న్యూఢిల్లీ: రుణాల భారంతో కునారిల్లుతున్న ఎస్సార్ స్టీల్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఆర్సిలార్ మిత్తల్, రష్యాకు చెందిన వి.టి.బి గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం వేసిన బిడ్లను ఆఫర్లను మదింపు చేసే సలహాదారు సిఫార్సు మేరకు తిరస్కరించినట్లు తెలిసింది. నేర రుణగ్రస్త సంస్థ ఉత్తమ్ గాల్వా స్టీల్ లిమిటెడ్‌లో వాటా కలిగి ఉన్నారనే కారణంపై ఆర్సిలార్ మిత్తల్ బిడ్‌ను తిరస్కరించినట్లు తెలిసింది. వి.టి.బి నేతృత్వంలోని స్పెషల్ పర్పస్ ఇన్వెస్ట్‌మెంట్ వెహికల్ నుమిటెల్‌లో ఎస్సార్ స్టీల్ స్థాపకుడు రవి రూయా కుమారుడు రేవంత్ రూయాకు 25 శాతం వాటా ఉండడంతో దాని బిడ్ తిరస్కరించినట్లు తెలిసింది.

సెన్సెక్స్

ఫిబ్రవరి 2018 20

33,703.59




పెరిగినవి	%	తగ్గినవి	%
కోల్ ఇండియా	7.84	ఎం అండ్ ఎం	-2.48
ఓఎన్‌జీసీ	1.11	యాక్సిస్ బ్యాంకు	-1.44
భారతీ ఎయిర్‌టెల్	0.85	కోటక్ మహీంద్రా	-1.09
ఎస్‌బిఐ	0.75	యస్ బ్యాంకు	-1.06
టీసీఎస్	0.70	రిలయన్స్	-0.70

నిఫ్టీ

ఫిబ్రవరి 2018 20

10,360.40



పెరిగినవి	%	తగ్గినవి	%
వేదాంత	2.61	ఎం అండ్ ఎం	-2.16
అంబుజ సిమెంట్స్	2.39	యాక్సిస్ బ్యాంకు	-1.64
ఐడియా సెల్యులర్	1.82	అరబిందో ఫార్మా	-1.40
కోల్ ఇండియా	1.64	యస్ బ్యాంకు	-1.07
భారతి ఇన్‌ఫ్రా	1.26	కోటక్ మహీంద్రా	-0.98

టాప్ లూజర్స్


20 ఫిబ్రవరి

33,703.59


పాయింట్లు	బి.ఎస్.ఇ సెన్సెక్స్	%
709.05	ఎం అండ్ ఎం	-2.48%
531.70	యాక్సిస్ బ్యాంకు	-1.44%
1045.00	కోటక్ మహీంద్రా	-1.09%
309.30	యస్ బ్యాంకు	-1.06%
919.40	రిలయన్స్	-0.70%
317.65	ఐసీఐసీఐ బ్యాంకు	-0.66%
559.40	సన్ ఫార్మా	-0.61%
1863.70	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	-0.59%
1290.45	లార్సెన్ టూబ్రో	-0.49%
262.80	ఐటీసీ	-0.28%

-71.07

బులియన్ | గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్





'చైనా కన్నా భారత్ ఒక మెట్టుపైనే'

• భారతదేశానికి తాను కొత్త కాదన్న ట్రంప్ జూనియర్

న్యూఢిల్లీ: వ్యాపారం విషయంలో చైనాతో పోలిస్తే భారతదేశం ''గణనీయంగా ఒక మెట్టు పైనే ఉంటుంది'' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ అన్నారు. దేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న సంస్కరణలు, అమెరికా వంటి దేశాల నుంచి ఆసియాలోని మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలోకి పెట్టుబడులు ఆకర్షించడంలో సహాయపడగలవని ట్రంప్ జూనియర్ చెప్పారు. దేశంలోకి వస్తున్న ట్రంప్ టవర్స్ అమ్మకాలు పెంచేందుకు వారం రోజుల పర్యటనపై ట్రంప్ భారత్ వచ్చారు. భారతదేశంలో వ్యాపార నిర్వహణ 'స్ఫూర్తి'' చాలా వరకు అమెరికాలో వ్యాపార నిర్వహణను పోలి ఉంటుందని ఆయన అన్నారు. ''ఒక వ్యాపారవేత్తగా నాకు ఇక్కడ పరిస్థితులు గణనీయంగా ఒక మెట్టు పైనే ఉన్నాయని అనిపించింది'' అని ఆయన చెప్పారు. ''ప్రజల మనస్తత్త్వం కూడా ఒకటే విధంగా ఉంటుంది. బహుశా, ఇక్కడ నిజాయతీపాలు పిసరంత ఎక్కువ కావచ్చు'' అని ట్రంప్ జూనియర్ అన్నారు. సీనియర్ ఎడిటర్లతో సాగిన సమావేశంలో అడిగిన ఒక ప్రశ్నకు ఆయన ఆ విధంగా జవాబిచ్చారు. ట్రంప్ ఆరగ్గనైజేషన్ అల్ట్రా లగ్జరీ అపార్ట్‌మెంట్లు నిర్మించేందుకు చైనాకన్నా మొదట భారతదేశాన్ని ఎంచుకునేందుకు పురికొల్పిన అంశమేమిటన్న ప్రశ్నకు ఆయన అలా సమాధానమిచ్చారు.

స్థానిక వ్యాపార భాగస్వాములైన ఎం3ఎం, ట్రిబిక డెవలపర్లతో ట్రంప్ ఆర్గనైజేషన్ లైసెన్సింగ్ ఒడంబడికలు కుదుర్చుకుంది. ట్రంప్ బ్రాండ్‌తో స్థానిక వ్యాపార సంస్థలు గురుగ్రామ్‌లో 3,500–4,500 చదరపుటడుగుల స్థలంలో రూ. 5.5 కోట్ల నుంచి రూ. 11 కోట్లు ఖరీదు చేసే 254 అపార్ట్‌మెంట్లను నిర్మించనున్నాయి. ఈ ప్రాజెక్టు 2023 మార్చిలో పూర్తికావలసి ఉంది. భారతదేశంలో వ్యాపార ''నిర్వహణ నాకు తప్పకుండా తేలికైన పని'' అని చెప్పాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

ఢిల్లీలో జరిగే బిజినెస్ సమ్మిట్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో రానున్న కొద్ది రోజుల్లో ట్రంప్ జూనియర్ వేదికను పంచుకోనున్నారు. న్యూయార్క్ కేంద్రంగా ఉన్న ట్రంప్ ఆర్గనైజేషన్‌కి అమెరికా వెలుపల అతి పెద్ద మార్కెట్‌కు భారతదేశం ప్రాతినిధ్యం వహిస్తోందని ట్రంప్ జూనియర్ అన్నారు. ''ఎందుకంటే, నేను భారతదేశానికి కొత్త కాదు. కడచిన పదేళ్ళలో వచ్చిన మార్పులను, ముఖ్యంగా గత రెండేళ్ళలో మారిన పరిస్థితులను నేను చూశాను'' అని ఆయన చెప్పారు. అవినీతిపైన, స్థిరాస్తుల రంగంలో బినామీ ఒప్పందాలపైన ప్రభుత్వం విరుచుకుపడడం మంచికే దారి తీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్‌లో చేపట్టిన సంస్కరణలు, ''దేశానికి చాలా సానుకూలమైనవి. అమెరికా వంటి చోట్ల నుంచి ఇంకా ఎక్కువగా బయట పెట్టుబడులు రావడానికి అవి (సంస్కరణలు) ద్వారాలు తెరుస్తాయి'' అని అన్నారు.

భారతీయ స్థిరాస్తుల మార్కెట్లోకి ట్రంప్ సంస్థ 2014లో అడుగుపెట్టింది. మొత్తం 1.5 బిలియన్ అమెరికన్ డాలర్ల రాబడుల సామర్థ్యంతో పుణే, ముంబయి, గురుగ్రామ్, కోల్‌కతాలలో ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఐదవది కమర్షియల్ ఆఫీసు ప్రాజెక్టుగా ఉంటుందని, అది త్వరలో మొదలవుతుందని భావిస్తున్నారు.

అయితే, భారత్‌లో వ్యాపారానికి రాబడి నమూనాను, ట్రంప్ ఆర్గనైజేషన్ గడించగల మొత్తాన్ని వెల్లడించేందుకు ఆయన తిరస్కరించారు. పైనాలుగు ప్రాజెక్టులలో గురుగ్రామ్‌దే పెద్దది. రెండు 47 అంతస్తుల భవనాలు మొత్తం 254 అల్ట్రా లగ్జరీ యూనిట్లకు గూడు కానున్నాయి.

ట్రంప్ అధ్యక్షుడుగా ఉన్న కాలంలో పరస్పర ప్రయోజనాల ఘర్షణ తలెత్తకుండా నివారించేందుకు కొత్త వ్యాపార అవకాశాలు చేపట్టకూడదని కంపెనీ నిర్ణయించుకుంది.

విన్‌సమ్ బకాయిలు రూ. 4,700 కోట్లు

ముంబయి: విన్‌సమ్ డైమండ్స్ అండ్ జువెలరీ లిమిటెడ్ కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రొసీడింగులు ప్రారంభించవలసిందని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్.సి.ఎల్.టి) ఆదేశించడంతో ఆభరణాల పరిశ్రమలో మరిన్ని లుకలుకలు బయటపడేట్లుగా కనిపిస్తున్నాయి. ఈ కంపెనీ రుణ దాతలకు చెల్లించవలసిన మొత్తం రూ. 4,700 కోట్ల వరకు ఉందని డెట్ రికవరీ ట్రిబ్యునల్ (డి.ఆర్.టి) 2016 డిసెంబరులో ఇచ్చిన ఆదేశం వెల్లడిస్తోంది. నీరవ్ మోదీ, గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ మెహుల్ చోక్సీలతో ప్రమేయం ఉన్న కుంభకోణంతో ఒకపక్క జువెలరీ పరిశ్రమ సతమతమవుతున్న సమయంలో ఈ కొత్త వ్యవహారం వెలుగు చూసింది. విన్‌సమ్ డైమండ్స్ (గతంలో సు–రజ్ డైమండ్స్ అండ్ జువెలరీ లిమిటెడ్) కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ (సి.ఐ.ఆర్.పి) ఫిబ్రవరి 13న ప్రారంభమైంది. ఫిబ్రవరి 27కల్లా క్లైమ్‌లు సమర్పించాలని రుణ దాతలను కోరారు. సి.ఐ.ఆర్.పి కింద, ఎన్.సి.ఎల్.టి నియమించిన ఇన్‌సాల్వెన్సీ వృత్తినిపుణుడు (ఐ.పి) రుణ దాతల అనుమతితో, ఒక పరిష్కార ప్రణాళికను తయారు చేస్తాడు. ఖాయిలా పడిన కంపెనీని గరిష్ఠంగా 255 రోజుల గడువు లోపల పునరుద్ధరించేందుకు, రుణ దాతల కమిటీ సహాయంతో అతనా ప్రణాళికను రూపొందిస్తాడు. ఈ ప్రయత్నం విఫలమైతే, కంపెనీని అమ్మేసి నగదు రూపంలోకి మార్చేయాల్సి ఉంటుంది.

చార్టర్డ్ ఎకౌంటెంట్లు నౌతమ్ ఆర్. వకీల్ అండ్ కో తాజా పరిమిత సమీక్ష నివేదికను విన్‌సమ్ డైమండ్స్ అండ్ జువెలరీ డైరెక్టర్ల బోర్డుకు సమర్పించింది. ఎగవేతల వల్ల, కంపెనీ ఖాతాలను బ్యాంకులు నిరర్థక ఆస్తులుగా వర్గీకరించాయని దానిలో తెలిపారు. ట్రిబ్యునల్ వద్ద ఒరిజినల్ దరఖాస్తు దాఖలు చేసిన తేదీ నుంచి బకాయిలు చెల్లించే తేదీ వరకు ఇవ్వవలసిన రుణ మొత్తం రూ. 4,687 కోట్లపై 14 శాతం సాధారణ వడ్డీ లెక్కగట్టి చెల్లించాల్సి ఉంటుందని డి.ఆర్.టి 2016 డిసెంబరులో ఉత్తర్వు జారీ చేసినట్లు ఆ నివేదిక వెల్లడించింది.

ఎస్.ఎఫ్.ఐ.ఓ దర్యాప్తు



తీవ్ర మోసాలపై దర్యాప్తు చేసే కార్యాలయం (ఎస్.ఎఫ్.ఐ.ఓ) నుంచి 2016 జూలైలో విన్‌సమ్ డైమండ్స్ అండ్ జువెలరీకి సమన్లు అందినట్లు ఆ నివేదిక వెల్లడించింది. ''కంపెనీల చట్టంలోని సెక్షన్ 212 కింద 2016 ఆగస్టులో దర్యాప్తు చేపట్టినట్లు'' తెలిపింది. వ్యాపారంలో రావలసిన మొత్తాలు రూ. 5,529 కోట్ల వరకు ఉన్నట్లు కంపెనీ చెప్పుకుందికానీ, ఈ విషయంలో విదేశాలలో ఉన్న కంపెనీ వినియోగదార్ల నుంచి తమకు ఎలాంటి ధ్రువీకరణ అందలేదని ఆ నివేదిక తెలిపింది. బిల్లులు చెల్లించనందుకు ఎగవేసిన విదేశీ కస్టమర్లపై షార్జా ఫెడరల్ కోర్టు (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్)లో కంపెనీ దావా వేసింది. నివేదిక ప్రకారం, కోర్టు దుబాయ్/షార్జాలలో ఉన్న కంపెనీల వ్యవహారాలు పరిశీలించేందుకు, ఒక నిపుణుడిని నియమించింది. కంపెనీకి చెల్లించవలసి ఉన్న బకాయిలున్న సంగతిని కోర్టు ధ్రువీకరించిందని ఆడిటర్ వ్యాఖ్యానించారు. కోర్టు 5 శాతం వార్షిక వడ్డీతో కంపెనీకి బకాయిలు చెల్లించాలని అక్కడున్న కస్టమర్లను ఆదేశించింది.

ఈ కోర్టు ఆదేశాలు, పెండింగ్‌లో ఉన్న లీగల్ ప్రొసీడింగుల నేపథ్యంలో ''ఈ రుణాలు ఎప్పటికి వసూలు కాగలవో చెప్పలేకపోతున్నాం...'' అని ఆడిటర్లు పేర్కొన్నారు.



తగ్గనున్న పి.ఎన్.బి రేటింగ్

సమీక్షించనున్నట్లు తెలిపిన ఫిచ్, మూడీస్ సంస్థలు

ముంబయి: ఫిచ్ రేటింగ్స్ సంస్థ పి.ఎన్.బికి చెందిన వికసనశీల రేటింగ్ 'బిబి'ని రేటింగ్ వాచ్ నెగిటివ్ (ఆర్.డబ్ల్యు.ఎన్)కి మార్చింది. ఆ బ్యాంక్‌లో పెద్ద మోసం బయటపడిన ఫలితమిది. బ్యాంకుకు చెందిన ఒక శాఖలో 1.8 బిలియన్ డాలర్ల మోసాన్ని కనుగొనడంతో పి.ఎన్.బి వయబిలిటీ రేటింగ్ దిగువకు వెళ్ళే అవకాశం ఉన్న పరిస్థితిని ఆర్.డబ్ల్యు.ఎన్ ప్రతిబింబిస్తోందని ఫిచ్ తెలిపింది. మూడీస్ కూడా, రేటింగ్ తగ్గించేందుకు పి.ఎన్.బిని సమీక్షలో ఉంచింది. ఢిల్లీ కేంద్రంగా ఉన్న పి.ఎన్.బికి మూడీస్ సంస్థ బిఏఏ3/పి–3 రేటింగ్ ఇచ్చింది. దాని ఫారిన్ కరెన్సీ ఇష్యూయర్ రేటింగ్ బిఏఏ3గా ఉంది. మూడీస్ నుంచి మొత్తంమీద పి.ఎన్.బికి స్టేబుల్ ఔట్‌లుక్‌తో బిఏఏ2 రేటింగ్ ఉంది. ఈ రెండు రేటింగ్ సంస్థలూ పి.ఎన్.బిని పరిశీలనలో ఉంచడం వల్ల దాని రేటింగ్ తగ్గే అవకాశం ఉంది. పి.ఎన్.బి ఆస్తుల నాణ్యత, మూలధన పరామితులు బలహీనంగానే కొనసాగుతున్నాయని, 2017 జూన్‌లో తాను రేటింగ్ ఇచ్చిన తర్వాత మాత్రం బ్యాంకు కొంత స్థిరత్వాన్ని చూపుతూ వచ్చిందని ఫిచ్ పేర్కొంది. అయితే, ఇటీవల వెలుగు చూసిన మోసం బ్యాంకు ప్రతిష్ఠకు మచ్చతెచ్చే అంశమని, విఘాతమని పేర్కొంది. మూడీస్ మూడు అంశాలను దృష్టిలో పెట్టుకుని పి.ఎన్.బి రేటింగ్‌ను తగ్గించే అంశాన్ని సమీక్షించనున్నట్లు తెలిపింది. అవి.. మోసపూరి లావాదేవీలు చూపగల ఆర్థిక ప్రభావ పరిమాణం, సమయం. బ్యాంకు మూలధనీకరణ రూపురేఖలు మెరుగుపరచేందుకు మేనేజ్‌మెంట్ పరంగా తీసుకునే నిర్ణయాలు. బ్యాంకును దండించేందుకు నియంత్రణ సంస్థ తీసుకునే చర్యలు.



చివరలో నష్టపోయిన సూచీలు

న్యూఢిల్లీ: మంగళవారంనాడు ట్రేడింగ్ చివరి గంటలో సాగిన అమ్మకాలతో షేర్ల ధరలు క్షీణించాయి. బొంబాయి స్టాక్ ఎక్స్చేంజ్ (బి.ఎస్.ఇ) సెన్సెక్స్ వరుసగా మూడవ సెషన్‌లో నష్టాలను నమోదు చేస్తూ 71 పాయింట్లకు పైగా కోల్పోయింది. ఐ.టి కౌంటర్లు కొంత ఆరోహణ గతిని సృష్టించినా ప్రైవేటు బ్యాంకుల షేర్ల ధరలు ఆ పొంగుపై నీళ్ళు చల్లాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా తగ్గడం, స్థిరంగా కొనసాగిన విదేశీ ఫండ్ల నిష్క్రమణ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం చుట్టూ అల్లుకున్న పరిణామాలు మదుపరుల అప్రమత్త వైఖరికి దారితీశాయి. ప్రైవేటు రంగానికి చెందిన యాక్సిస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్, యస్ బ్యాంక్, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్‌ల షేర్ల ధరలు 1.44 శాతం క్షీణించాయి. సాఫ్ట్‌వేర్ పరిశ్రమల సంస్థ 'నాస్కామ్' వృద్ధిపై ఆశాభావం వ్యక్తపరచడంతో మార్కెట్లలో సానుకూల వాతావరణం ఏర్పడింది. పి.ఎస్.యు బ్యాంకుల షేర్ల ధరలు కూడా నష్టాల నుంచి కొద్దిగా కోలుకోవడం కారు చీకట్లో కాంతి రేఖలా మెరిసింది. కానీ, ప్రైవేటు బ్యాంకుల షేర్ల అమ్మకాలు ముమ్మరంగా సాగడంతో సూచీలు పెరుగుదలను నిలబెట్టుకోలేకపోయాయి. పి.ఎన్.బి రేటింగ్‌ను తగ్గించే అవకాశం ఉందని ఫిచ్ ప్రకటించింది. ఆ బ్యాంకులో భరోసా పత్రాల జారీలో చోటుచేసుకున్న మోసాన్ని బ్యాంకింగ్ చరిత్రలోనే అతి పెద్దదిగా భావిస్తున్నారు. ఈ మోసం బ్యాంకు అంతర్గత, బాహ్య రిస్కు నియంత్రణలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ మోసం కొన్నేళ్ళుగా కొనసాగుతూ వస్తూండడంతో మేనేజ్‌మెంట్ పర్యవేక్షణ ప్రమాణాలపైన కూడా సందేహాలు తలెత్తుతున్నాయని ఫిచ్ పేర్కొంది. పి.ఎన్.బి షేర్ ధర గత నాలుగు సెషన్లలో దాదాపు 28 శాతం క్షీణించింది.

డాలరుతో రూపాయి మారకం విలువ 68 పైసలు క్షీణించి ఒక దశలో మూడు నెలల కనిష్ఠ స్థాయి రూ. 64.88గా ఉంది. దేశీయ స్టాక్ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులకు ఆ విధంగా అది కూడా ఆజ్యం పోసింది.

సెన్సెక్స్ మంగళవారం ఉదయం 186 పాయింట్లు పుంజుకుని ఎర్లీ ట్రేడ్‌లో 33,960.95 పాయింట్ల స్థాయిని తాకింది. కానీ, చివరలో వెల్లువెత్తిన అమ్మకాలతో ఆ పెరుగుదల నంతటినీ కోల్పోయింది. మొత్తానికి, మంగళవారం బీఎస్ఈ సెన్సెక్స్ 71.07 పాయింట్లు కోల్పోయి 33,703.59 పాయింట్ల వద్ద ముగిసింది.

నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' మంగళవారం 18 పాయింట్లు కోల్పోయి 10,360.40 పాయింట్ల వద్ద ముగిసింది.

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు సోమవారం నికరంగా రూ. 895.79 కోట్ల విలువ చేసే షేర్లు విక్రయించగా, దేశీయ మదుపు సంస్థలు నికరంగా రూ. 586.52 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశాయి.

భవిష్యత్ టెక్నాలజీలపై బి.ఎస్.ఎన్.ఎల్ ఒప్పందం

న్యూఢిల్లీ: భవిష్యత్ టెక్నాలజీలలో సహకారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు ప్రభుత్వ యాజమాన్యంలోని టెలికాం సంస్థ బి.ఎస్.ఎన్.ఎల్‌కి, జపాన్‌కు చెందిన ఎన్.టి.టి. అడ్వాన్స్ టెక్నాలజీ కార్పొరేషన్, దాని భారతీయ భాగస్వామి విర్గో కార్ప్స్ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ఐయాట్ వంటి ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలలో సహకారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు, 5జి టెస్ట్ బెడ్‌ను సంయుక్తంగా సృష్టించేందుకు ఒక అవగాహన పత్రంపై మూడు సంస్థలు సంతకాలు చేసినట్లు బి.ఎస్.ఎన్.ఎల్ మంగళవారంనాడు ఒక ప్రకటనలో తెలిపింది. తదుపరి తరం టెక్నాలజీలలో సహకరించుకోవాలని, సాఫ్ట్‌వేర్‌లో భారతదేశ నైపుణ్యాన్ని జపాన్, వస్తూత్పత్తిలో జపాన్ నైపుణ్యాన్ని భారతదేశం ఉపయోగించుకోవాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాన మంత్రి షింజో అబేల దార్శనికతకు ఈ ఒప్పందం అనుగుణంగా ఉందని బి.ఎస్.ఎన్.ఎల్ ప్రకటన పేర్కొంది. ఒప్పందంపై సంతకాల కార్యక్రమంలో బి.ఎస్.ఎన్.ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనుపమ్ శ్రీవాస్తవ, బోర్డులోని ఇతర డైరెక్టర్లు, ఎన్.టి.టి ఎ.టి అధ్యక్షుడు, సి.ఇ.ఓ జార్జ్ కిమురు, విర్గో కార్ప్ చైర్మన్ మోంగ్యా పాల్గొన్నారు.

ఆర్థిక అంశాలు

200 డొల్ల కంపెనీలపై ఐటీ గురి

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో ప్రధాన నిందితుడైన ఆభరణాల వ్యాపారి నీరవ్ మోదీ, అతని మేనమామ మెహుల్ ఛోక్సీ ఇతరులకు చెందిన బినామీ ఆస్తులు, డొల్ల కంపెనీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపు పన్ను శాఖ దృష్టి సారించాయి. దాదాపు 200 డొల్ల కంపెనీలు, బినామీ ఆస్తులపై ఐటీ దృష్టి పెట్టింది. కాగా నీరవ్ మోదీకి అతని కుటుంబ సభ్యులకు చెందిన కనీసం 29 స్థిరాస్తులను అక్రమ నగదు చలామణి నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కింద జప్తు చేసుకునేందుకు రంగం సిద్ధం అయింది.


జీడీపీ బేస్ ఇయర్ మార్పు

స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ), పారిశ్రామిక ఉత్పత్తి సూచీ(ఐఐపీ), రిటైల్ ద్రవ్యోల్బణం(సీపీఐ) గణాంకాలకు ప్రభుత్వం బేస్ ఇయర్‌ను మార్చనుంది. జీడీపీ, ఐఐపీ, గణాంకాలకు బేస్ ఇయర్‌గా కేంద్రం 2017-18గా నిర్ణయించింది. ప్రస్తుతం ఈ మూడు కీలక ఆర్థిక గణాంకాలకు 2011-12 బేస్ ఇయర్‌గా ఉంది. టోకుధరల ద్రవ్యోల్బణం(డబ్ల్యూపీఐ)లో ఎలాంటి మార్పులేదు. ప్రస్తుతం ఉన్న 2011 బేస్‌ఇయరే.. ఇకపైనా కొనసాగనుంది.

నీరవ్ బాటలోనే... విక్రమ్ కొఠారీ

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) భారీగా మోసపోయిన రీతిలోనే, కాన్పూర్‌లోని ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.3,695 కోట్లకుపైగా నష్టపోయాయి. ఈ రుణాన్ని తీసుకున్న రోటామాక్(కలాల తయారీ) కంపెనీ అధినేత విక్రమ్ కొఠారీ గత కొన్ని రోజులుగా కనిపించడం లేదు. ఈ కుంభకోణాన్ని వెలికి తీసేందుకు సీబీఐ, ఈడీ రంగంలోకి దిగాయి.

కావేరి జలాలపై సుప్రీం తీర్పు



కరెంట్ అఫైర్స్

దశాబ్దాలుగా తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల మధ్య ముదురుతున్న కావేరీ జలాల వివాదంపై సుప్రీంకోర్టు కీలకమైన తుది తీర్పును ఇచ్చింది. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా సారథ్యంలోని బెంచ్ తీర్పును ప్రకటించింది. జలాల పంపకాలకు సంబంధించి కావేరీ జల వివాద ట్రైబ్యునల్ (సీడబ్ల్యూడీటీ) 2007లో ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ...మూడు రాష్ట్రాలు వేసిన పిటిషన్లపై, బెంచ్ తీర్పునిచ్చింది. కావేరి నది జలాలపై ఏ రాష్ట్రానికి పూర్తి హక్కులు లేవని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. తమిళనాడుకు 404.25 (419-14.75) టీఎంసీలు, కర్ణాటకకు 284.75 (270+14.75) టీఎంసీలు, కేరళ(30) పుదుచ్చే రికి(7) యథావిధిగా కేటాయింపులు చేయాలని సుప్రీం సంచలన తీర్పు ఇచ్చింది. పుదుచ్చేరికి సుమారు 43వేల ఎకరాలకు సరిపడా రెండో పంటకు నీరు ఇవ్వాలని సుప్రీం ఆదేశించింది.

సమస్య ఎప్పటి నుంచి...?


కావేరి నదీ జలాల సమస్య 1892లోనే ప్రారంభమైంది. అప్పట్లో మద్రాస్ ప్రెసిడెన్సీ, మైసూరుల మధ్య ఈ నదీ జలాల పంపకంపై 1892,1924లో రెండు సార్లు ఒప్పందం చేసుకున్నాయి. కర్ణాటక ప్రభుత్వం కావేరి నదీ జలాలను సరిగా పంపడం లేదని 1990లో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీం ఆదేశానుసారం, 1990లో కేంద్ర ప్రభుత్వం కావేరి జలాలపై ఒక ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. అలాగే రాష్ట్రాల మధ్య కావేరి నది జలాల వివాదం ఎక్కువవుతోందని భావించిన కేంద్రం కావేరి జల వివాద పరిష్కార ట్రైబ్యునల్ (సీడబ్ల్యూడీటీ)ని ఏర్పాటుచేసింది. 2007లో ట్రైబ్యునల్ కావేరీ జలాలు ఎవరికి, ఎంత దక్కాలి అనే విషయంపై విచారణ జరిపి ఒక తీర్పు చెప్పింది. మొత్తంగా కావేరి బేసిన్‌లో 740 టీఎంసీలు ఉంటే...దానిలో తమిళనాడుకు 419 టీఎంసీలు, కర్ణాటకకు 270 టీఎంసీలు, కేరళకు 30 టీఎంసీలు, పుదుచ్చేరికి 7 టీఎంసీలు అని ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. అయితే ఈ లెక్కల్లో మోసం ఉందని తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల వారు వేర్వేరుగా సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. 2016 సెప్టెంబర్ 5న అత్యున్నత న్యాయస్థానం పదిరోజుల పాటు తమిళనాడుకు రోజుకు 15,000 క్యూసెక్కులు చొప్పున నీళ్లివ్వాలని కర్ణాటకను ఆదేశించడంతో ఇరురాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తాయి. అయితే తమవద్ద చాలా తక్కువ జలాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయంటూ.. నీళ్ల విడుదల చేసేందుకు కర్ణాటక సర్కార్ నిరాకరించింది. దీనితో కావేరి జలాలపై సుప్రీం తాజాగా తీర్పు ఇచ్చింది.

ముఖ్యమైన పాయింట్లు

నది పొడవు - 765కిమీ
జన్మస్థానం :కర్ణాటకలోని పశ్చిమకనుమల్లోని కొడగు జిల్లాలోని, తలకావేరి వద్ద
ఉపనదులు : ఎడమకు ప్రవహించేవి- హేమవతి, షింషా, అర్కావతి కుడివైపుకు- కబిని, భవానీ, అమరావతి, నొయ్యల్
సముద్రంలో కలిసే చోటు - తమిళనాడులోని పంపుహార్ వద్ద
కావేరినదికి మరొక పేరు- 'దక్షిణగంగ'

వార్తల్లోని వ్యక్తులు

అత్యంత సంపన్న ముఖ్యమంత్రి చంద్రబాబు




దేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వారి ఆస్తులు, వారిపై ఉన్న కేసులు తదితరాలతో కూడిన సమగ్ర నివేదికను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) విడుదల చేసింది. దేశంలో సంపన్న ముఖ్యమంత్రుల జాబితాలో ఏపీ సీఎం చంద్రబాబు అగ్రస్థానంలో నిలవగా, నాలుగో స్థానంలో తెలంగాణ సీఎం కేసీఆర్ నిలిచారు. తక్కువ ఆస్తులు కలిగిన ముఖ్యమంత్రిగా త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ నిలిచారు. కాగా దేశంలో 11 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని ఏడీఆర్ పేర్కొంది. ఈ జాబితాలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ 22 కేసులతో ముందు నిలిచారు.తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై 2 కేసులుండగా, చంద్రబాబుపై మూడు సాధారణ నేరారోపణ కేసులు ఉన్నాయి.

ఏడో నిజాం కుమారుడు ఫజల్ జహా కన్నుమూత

ఏడోనిజాం కుమారుడు నవాబ్ ఫజల్ జహా బహుదూర్ (72) కన్నుమూశారు. హైదరాబాద్ రాష్ట్ర చివరి పాలకుడైన ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్, సాహెబా లీలా బేగం దంపతులకు ఆయన 1946 ఫిబ్రవరి 29న జన్మించారు. సౌదీ అరేబియాలో హజ్ యాత్రికుల బస కోసం నిజాం నిర్మించిన అతిథిగృహం 'హైదరాబాద్ రుబాత్' వ్యవహారాల బాధ్యతలనూ ఇన్నేళ్లూ ఆయనే నిర్వహించారు.

క్రీడలు

ఫెదరర్ నంబర్ వన్



స్విస్ యోధుడు రోజర్ ఫెదరర్ మళ్లీ ప్రపంచ నంబర్ వన్‌గా అవతరించాడు. మళ్లీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. టెన్నిస్ చరిత్రలో ఈ ఘనత సాధించిన పెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. చిరకాల ప్రత్యర్థి రాఫెల్ నాదల్‌ను రెండో స్థానానికి నెట్టేసి ఫెదరర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరాడు. ఏబీఎన్ ఆమ్రో ప్రపంచ టోర్నీ సెమీస్ చేరుకోవడం ద్వారా ఈ ఘనత సాధించాడు.

చరిత్ర సృష్టిస్తారా?

నేడు ఇండియా, సౌతాఫ్రికా మహిళల నాలుగో టీ20



సెంచూరియన్: ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకునేందుకు భారత మహిళల క్రికెట్ జట్టు సిద్ధమైంది. మూడో వన్డేలో ఓటమిపాలైన హర్మన్‌ప్రీత్ సేన నాలుగో వన్డేలో గెలిచి టీ20 సిరీస్‌ను కూడా కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఇండియా, సౌతాఫ్రికా మహిళల మధ్య బుధవారమిక్కడ నాలుగో వన్డే జరగనుంది. తొలి రెండు టీ20ల్లో ఏడు, తొమ్మిది వికెట్లతో గెలిచిన భారత జట్టు మూడో మ్యాచ్‌లో 5 వికెట్లతో ఓటమిపాలైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న టీమిండియా ఇప్పుడు ఐదు మ్యాచ్‌ల ఈ టీ20 సిరీస్‌లోనూ తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించేందుకు సిద్ధమైంది. బుధవారంనాటి ఈ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన గెలిస్తే ఒకే పర్యటనలో (సౌతాఫ్రికా) రెండు సిరీస్‌లు గెలిచిన ఘనత సాధిస్తుంది. అంతేకాకుండా ఆస్ట్రేలియాపై టీ20 సిరీస్‌ను గెలిచిన భారత జట్టుకు సౌతాఫ్రికాపై సిరీస్ గెలుపు కలకాలం చరిత్రలో నిలిచిపోతుంది. తొలి రెండు టీ20ల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన భారత జట్టు మూడో టీ20లో పేలవంగా ఆడింది. దీంతో సౌతాఫ్రికా జట్టు సిరీస్ ఆశలు సజీవంగా నిలిచాయి. మూడో మ్యాచ్‌లో భారత జట్టు ఆరంభంలో దూకుడుగా ఆడినప్పటికీ తర్వాత 17.5 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌటైంది. 12 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసినప్పటికీ భారత జట్టు లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. అయితే ఆ మ్యాచ్‌లో 30 బంతుల్లో 48 పరుగులు చేసిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఓపెనర్ స్మృతి మంధనతో (37) కలిసి రెండో వికెట్‌కు చాలా వేగంగా 55 పరుగులను జోడించింది. అయితే వీళ్లద్దరూ అవుటైన తర్వాత భారత మిడిలార్డర్ పేకమేడలా కూలిపోయింది. మూడో మ్యాచ్‌లో డకౌటైన సీనియర్ ప్లేయర్ మిథాలీ రాజ్ ఈ కీలకమైన మ్యాచ్‌లో పరుగుల దాహం తీర్చుకోవాలని భావిస్తోంది. గత మ్యాచ్‌లో భారత బౌలింగ్ కూడా పేలవంగా ఉండింది. సీనియర్ పేస్ బౌలర్ ఝులన్ గోస్వామి ఈ సిరీస్‌కు దూరం కావడంతో పూజా వస్త్రాకర్ పేస్ బౌలింగ్‌కు నేతృత్వం వహించనుంది. గత మ్యాచ్‌లో ఆమె నాలుగు ఓవర్లలో 21 పరుగులిచ్చి 2 వికెట్లు తీసుకుంది. కానీ పూజాకు ఇతర బౌలర్ల నుంచి పెద్దగా మద్దతు లభించలేదు. శిఖా పాండే భారీగా పరుగులు సమర్పించుకుంది. ఆఫ్ స్పిన్నర్ అనుజ పాటిల్ కూడా ప్రత్యర్థికి అడ్డుకట్ట వేయలేకపోయింది. నాలుగో ఓవర్లలో 44 పరుగులిచ్చి 1 వికెట్ తీసుకుంది. భారత మహిళల క్రికెట్‌లో చరిత్ర సృష్టించే ఈ అరుదైన రికార్డు సాధించేందుకు సహచరులు అన్ని విభాగాల్లో రాణించాలని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ భావిస్తోంది. ఇదే వేదికలో తర్వాత పురుషుల టీ20 మ్యాచ్ జరగనుంది. 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 2-0తో గెలిచేందుకు సిద్ధమైన పురుషుల జట్టుకు హర్మన్‌ప్రీత్ సేన తమ గెలుపుతో రెట్టించిన ఉత్సాహాన్ని అందించాలి. మరోవైపు సౌతాఫ్రికా జట్టు పూర్తి విశ్వాసంతో బుధవారం మ్యాచ్‌లో బరిలోకి దిగనుంది. గత మ్యాచ్‌లో సీమర్ షబ్ని మ్ ఇస్మాయిల్ అత్యద్భుత ప్రతిభ కనబరిచింది. తన తొలి టీ20లోనే ఆమె 5 వికెట్ల ఘనత సాధించింది. షబ్నిమ్ సాదించిన 5/30 బౌలింగ్ ఫిగర్స్ టీ20 ఫార్మాట్‌లో సౌతాఫ్రికాలో ఇది రెండో అత్యుత్తమం. దీంతో మరో 6 బంతులుం గానే సౌతాఫ్రికా జట్టు గెలుపు లక్ష్యాన్ని సాధించిం ది. ఈ నాలుగో మ్యాచ్‌లోనూ అలాంటి ప్రతిభ ను కనబరిచేందుకు షబ్నిమ్ సిద్ధమైంది. అంతే కాదు గత మ్యాచ్‌లో 15 బంతుల్లో 34 పరుగులు చేసిన ఖ్లో ట్రియాన్ ఈ మ్యాచ్‌లో అటువంటి దూకుడుతో జట్టును ఒడ్డుకు చేరుస్తుందని సౌతాఫ్రికా టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

రిచర్డ్స్ రికార్డుకు చేరువలో కోహ్లీ



సెంచూరియన్: రెయిన్‌బో దేశంలో అదరగొడుతున్న టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ వెస్టిండీస్ దిగ్గజం వివియన్ రిచర్డ్స్, ఆస్ట్రేలియా దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ రికార్డులకు మరింత చేరువయ్యాడు. 10 మ్యాచ్‌ల్లో (3 టెస్టులు, 6 వన్డేలు, 1 టీ20) 4 సెంచరీలు, 2 అర్థ సెంచరీలు చేసిన కోహ్లీ ఒకే టూర్‌లో 1000 పరుగులకు మరో 130 పరుగుల దూరంలో ఉన్నాడు. 13 ఇన్నింగ్స్‌ల్లో 87.00 సగటుతో 82.38 సగటుతో 870 పరుగులు చేశాడు. ఇందులో 7 సిక్సర్లు, 91 ఫోర్లు ఉన్నాయి. పురుషుల క్రికెట్ చరిత్రలో విదేశీ పర్యటనలో 1000 పరుగులు చేసిన ఏకైక బ్యాట్స్‌మన్ వివియన్ రిచర్డ్స్. ఈ ఘనతను రిచర్డ్స్ 1976లో సాధించారు. ఇంగ్లండ్ పర్యటనలో ఆయన 1045 పరుగులు చేశారు. రిచర్డ్స్ వన్డేల్లో 216, నాలుగు టెస్టుల్లో 829 పరుగులు చేశారు. కోహ్లీ విషయానికొస్తే.. సౌతాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 289 పరుగులుచేశాడు. ఇందులో ఒక సెంచరీ, ఒక అర్థ సెంచరీ ఉన్నాయి. 6 వన్డేల్లో 558 పరుగులు చేశాడు. ఇందులో 3 సెంచరీలు, ఒక అర్థ సెంచరీ ఉన్నాయి. అలాగే జొహన్నెస్‌బర్గ్ వాండరర్స్ స్టేడియంలో జరిగిన తొలి టీ20లో కోహ్లీ 26 పరుగులు చేశాడు. దీన్నిబట్టి చూస్తే రిచర్డ్స్ రికార్డును బ్రేక్ చేయడం కోహ్లీ పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. ఇక ఆస్ట్రేలియా దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లినప్పుడు ఐదు టెస్టుల్లో 974 పరుగులు చేశారు. ఈ రికార్డుకు కోహ్లీ 104 పరుగుల దూరంలో ఉన్నాడు.


సర్దార్ సింగ్‌కు మళ్లీ పగ్గాలు

- **అజ్లాన్ షా కప్‌కు జట్టు ఎంపిక**



న్యూఢిల్లీ: ప్రముఖ హాఫ్ బ్యాక్ ప్లేయర్ సర్దార్ సింగ్ మళ్లీ భారత హాకీ జట్టుకు నేతృత్వం వహించనున్నాడు. మార్చి 3వ తేదీన మలేసియాలోని ఇపోలో జరగనున్న సుల్తాన్ అజ్లాన్ షా కప్ టోర్నీలో సర్దార్ భారత జట్టును నడిపిస్తాడు. మార్చి 10వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీలో ఆరో ర్యాంక్‌లో ఉన్న భారత్‌తో పాటు ప్రపంచ నంబర్ వన్ ఆస్ట్రేలియా, నంబర్ టూ అర్జెంటీనా, ఇంగ్లండ్, ఐర్లాండ్, ఆతిథ్య మలేసియా జట్లు తలపడతాయి. ఈ ఏడాది ఎడతెరిపిలేని షెడ్యూల్ కారణంగా సరైన కాంబినేషన్‌ను సాధించేందుకు ఇండియన్ హాకీ సెలెక్టర్లు యువకులకు తొలి ప్రాధాన్యత ఇవ్వడంతో సర్దార్ సింగ్ కొద్ది రోజులు జట్టుకు దూరమయ్యాడు. అయితే 2020 టోక్యో ఒలింపిక్స్‌కు తాను ఆడాలనుకుంటున్నానని చెప్పిన రెండు వారాలకు సర్దార్ సింగ్ జట్టులోకి వచ్చాడు. 'మన్‌ప్రీత్ సింగ్ దూరం కావడంతో జట్టులో సర్దార్ సింగ్ ప్రధాన ఆటగాడిగా నిలిచాడు. ఇతను చాలా అనుభవమున్న ఆటగాడు. గత రెండు టోర్నీలకు సర్దార్ దూరమయ్యాడు. తన సత్తా నిరూపించుకునేందుకు అతనికి మరో అవకాశం లభించింది' అని కోచ్ ఎస్‌జోర్డ్ మారిజ్నే అన్నారు.

క్రికెటర్ కుమారుడి ఆత్మహత్య



కరాచీ: పాకిస్థాన్ మాజీ క్రికెటర్ ఆమిర్ హనీఫ్ కుమారుడు మహ్మద్ జర్యబ్ మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని హనీఫ్ ధ్రువీకరించారు. కోచ్‌ల వల్ల తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పిన హనీఫ్ పాకిస్థాన్‌లో అండర్-19 క్రికెట్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మలిర్‌లోని ఇంట్లో తన గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు జర్యాబ్ ఉరేసుకున్నాడు. 'ఎలాగూ నా కుమారుడు ఇక రాడు. కానీ ఇతర పిల్లలను కాపాడండి' అని హనీఫ్ అన్నారు. ఇటీవల లాహోర్‌లో జరిగిన అండర్-19 టోర్నీలో కరాచీకి జర్యాబ్ ప్రాతినిధ్యం వహించాడు. అయితే గాయం పాలైన జర్యాబ్‌ను మళ్లీ జట్టులోకి తీసుకుంటామని కోచ్‌లు భరోసా ఇచ్చి ఇంటికి పంపారు. కానీ తర్వాత పూర్తి ఫిట్‌నెస్‌తో వస్తే వయసు ఎక్కువుందన్న కారణంగా అతడిని జట్టులోకి తీసుకోలేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన జర్యాబ్ ఆత్మహత్య చేసుకున్నాడు.




పెంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌లో భాగంగా మంగళవారం జరిగిన స్కీ జంపింగ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం గెలిచిన నార్వే జట్టు



పురుషుల 10 కిలోమీటర్ల క్రాస్ కంట్రీ స్కీయింగ్ పోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను గెలిచిన జర్మనీ అథ్లెట్లు జొహన్నెస్ రిజెక్, ఫాబియన్ రెస్సెల్, ఎరిక్ ఫ్రెంజెల్

అంతర్జాతీయం

ప్రధాని మోదీ పశ్చిమాసియా పర్యటన



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 9 నుంచి 12 వరకు పశ్చిమాసియాలోని మూడు దేశాల్లో పర్యటించారు. ఈ పర్యటనలో పాలస్తీనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్ దేశాలను సందర్శించారు. పాలస్తీనాను పర్యటిస్తున్న మొదటి భారత ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు. గత ఏడాది పాలస్తీనా ప్రధాని అబ్బాస్ ఢిల్లీ వచ్చినప్పుడు ప్రధాని మోదీని పాలస్తీనాకు రావాల్సిందిగా కోరడంతో ఈ పర్యటన చేశారు.

- ఫిబ్రవరి 9న జోర్డాన్‌లో పర్యటించారు. తర్వాత పాలస్తీనా చేరుకున్నారు. పాలస్తీనా రాజధాని రమల్లాలో ఆ దేశ ప్రధాని మహ్మద్ అబ్బాస్‌తో సమావేశమయ్యారు.
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం దిశగా ఆరు ఒప్పందాలపై ఇరుదేశాల అధికారులు సంతకాలు చేశారు. పాలస్తీనా సామర్థ్య నిర్మాణం కోసం భారత్ దాదాపు 50 మిలియన్ డాలర్ల(రూ.321 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు మోదీ తెలిపారు. పాలస్తీనా పర్యటన సందర్భంగా మోదీకి ఆ దేశం అరుదైన గౌరవాన్ని ప్రకటించింది. పాలస్తీనా విదేశీ అతిథులకు ఇచ్చే అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ పాలస్తీనా'తో సత్కరించింది.
- ఫిబ్రవరి 11న నరేంద్ర మోదీ యూఏఈలో పర్యటించారు. ఆ దేశ యువరాజు బిన్‌జాయెద్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు పక్షాల మధ్య ఐదు కీలక ఒప్పందాలు జరిగాయి. ఇందులో భారత ఆయిల్ కంపెనీల కన్షార్షియానికి 10 శాతం రాయితీ కల్పించే చారిత్రక ఒప్పదం కూడా ఉంది. ఇది 2018 నుంచి 2057 వరకు 40 ఏళ్ల పాటు అమల్లో ఉంటుంది. అబుదాబిలో నిర్మించనున్న స్వామినారాయణ్ మందిరానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు.
- చివరగా ఫిబ్రవరి 12న ఒమన్‌లో పర్యటించారు. ఈ పర్యటనలో రక్షణ, ఆరోగ్యం, పర్యాటక రంగాల్లో ఇరుదేశాల మధ్య ఎనిమిది ఒప్పందాలు కుదిరాయి. మస్కట్‌లో 125 ఏళ్ల నాటి శివాలయంలో పూజలు చేశారు. ఖబూస్ గ్రాండ్ మసీదును సందర్శించి ప్రార్థనలు జరిపారు.

నేపాల్ ప్రధానిగా ఓలీ



నేపాల్ 41వ ప్రధాన మంత్రిగా ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలీ ఎన్నికయ్యారు. ఆయన ప్రధానిగా ఎన్నికవడం ఇది రెండో సారి. ఇటీవల జరిగిన చారిత్రక పార్లమెంట్ ఎన్నికల్లో వామపక్ష కూటమి ఘన విజయం సాధించింది. ఓలీ నేతృత్వంలోని నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఎన్)- యూఎమ్ఎల్, ప్రచండ నేతృత్వంలోని సీపీఎన్- మావోయిస్ట్ సెంటర్ ఈ కూటమికి నేతృత్వం వహించాయి. ప్రధానిగా తొలి మూడేళ్లు ఓలి, చివరి రెండు సంవత్సరాలు ప్రచండకు ప్రధాని పదవి ఇచ్చేటట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు.

జాతీయం

ఆరోగ్య సూచిలో కేరళ అగ్రస్థానం

ఆరోగ్య సూచిలో కేరళ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. నవజాత శిశువుల మరణాలు, ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటు,ఆస్పత్రిలో ప్రసవాలు, వ్యాక్సినేషన్ వంటి విషయంలో మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే కేరళ ముందంజలో ఉందని నీతిఆయోగ్ తేల్చి చెప్పింది. ఈ జాబితాలో ఉత్తరప్రదేశ్ చివరి స్థానంలో ఉంది.

అంతరించిపోయే ప్రమాదంలో 40కి పైగా భాషలు

దేశంలో దాదాపు 40కి పైగా భాషలు/మాండలికాలు అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం కొన్ని వేల మంది మాత్రమే ఈ భాషల్లో మాట్లాడుతున్నారని తెలిపాయి. దేశంలో ఈ కోవలో 22 షెడ్యూల్డ్ , 100వరకు నాన్-షెడ్యూల్డ్ భాషలు ఉన్నాయి. అంతరించిపోయే వాటిలో అండమాన్-నికోబార్ దీవులకు చెందిన భాషలు 11 ఉన్నాయని, ఆ తర్వాతి స్థానంలో మణిపూర్(7), హిమాచల్‌ప్రదేశ్(4) ఉన్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గడాబా, నైకీ కూడా ఈ ముప్పును ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల కమిషనర్ల వేతనం పెంపు

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు వేతనాలు పెరిగినట్లే కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, ఇద్దరు కమిషనర్లకూ జీతాలు పెరిగాయి.

పెరిగిన వేతనాల ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి లేదా హైకోర్టు ప్రధానన్యాయమూర్తి నెలకు రూ2.50 లక్షల జీతం తీసుకుంటున్నారు. అదే విధంగా ఎన్నికల కమిషనర్లకు నెలకు రూ.2.50 లక్షలకు వేతనం పెంచినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ పెంపు జనవరి 2016 నుంచి వర్తిస్తుంది. ప్రస్తుతం ఎన్నికల కమిషనర్లు నెలకు రూ. 90వేల వేతనం పొందుతున్నారు.

మనం స్పోర్ట్స్
బుధవారం 21 ఫిబ్రవరి 2018
www.manamnews.com

ఒకే వేదిక.. రెండు మ్యాచ్‌లు. సెంచూరియన్‌లోని సూపర్‌స్పోర్ట్ పార్క్ స్టేడియంలో ఇండియా, సౌతాఫ్రికా జట్ల మధ్య రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. తొలుత మహిళల జట్లు తలపడతాయి. తర్వాత పురుషుల జట్లు ఆడతాయి. భారత్‌కు చెందిన రెండు జట్లూ సిరీస్‌పై దృష్టి పెట్టగా.. సౌతాఫ్రికా జట్లు సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకునేందుకు చెమటోడ్చనున్నాయి. తొలిసారి రెండు సిరీస్‌లను కైవసం చేసుకునేందుకు భారత జట్లు సిద్ధమయ్యాయి.

మరో సిరీస్‌పై దృష్టి

నేడు ఇండియా, సౌతాఫ్రికా మధ్య రెండో టీ20

రాత్రి 9-30 నుంచి సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం



మరికొన్ని క్రీడా వార్తలు 11లో

సెంచూరియన్: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ రెండో టీ20కి పూర్తి ఫిట్‌నెస్ సాధించే అవకాశముంది. వరుస విజయాలు సాధిస్తున్న టీమిండియా రెట్టించిన ఉత్సాహంతో సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు బరిలోకి దిగనుండగా.. వరుస ఓటములకు గురవుతున్న సౌతాఫ్రికా జట్టు సిరీస్ ఆశలు సజీవంగా నిలుపుకునేందుకు పోరాడనుంది. ఇండియా, సౌతాఫ్రికా మధ్య బుధవారమిక్కడ రెండో టీ20 మ్యాచ్ జరగనుంది. జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన తొలి టీ20లో కోహ్లీ సేన 28 పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. అయితే రెండో టీ20లోనూ గెలిచిన సౌతాఫ్రికా పర్యటనలో మరో సిరీస్‌ను సొంతం చేసుకోవాలని టీమిండియా పట్టుదలగా ఉంది. టెస్టుల్లో 1-2తో ఓటమిపాలై తర్వాత 5-1తో వన్డే సిరీస్‌ను గెలిచిన టీమిండియా సుదీర్ఘ సౌతాఫ్రికా పర్యటనను సంతోషదాయకంగా ముగించాలని భావిస్తోంది. అయితే టీ20 సిరీస్‌ను టీమిండియా 3-0తో గెలిస్తే ఐసీసీ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకునే అవకాశముంది. కానీ బుధవారమే జరగనున్న టీ20 ముక్కోణపు సిరీస్ ఫైనల్లో ఆస్ట్రేలియా జట్టు న్యూజిలాండ్‌ను ఓడిస్తే టీమిండియా మూడో ర్యాంక్‌కే పరిమితమవుతుంది. మ్యాచ్ సమయానికి కోహ్లీ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని జట్టు సభ్యులు అనుకుంటున్నారు. ఆదివారం జరిగిన తొలి టీ20లో కోహ్లీ తొడ కండరాల నరం పట్టేసిన గాయానికి గురైన విషయం విదితమే. అయితే కోహ్లీ గాయం అంత తీవ్రమైందేమీ కాదని.. రెండో టీ20లో అతను టాస్‌లో పాల్గొంటాడని టీమిండియా మేనేజ్‌మెంట్ అంటోంది. డర్బన్‌లో జరిగిన తొలి వన్డేలోనూ కోహ్లీ మోకాలి గాయానికి గురయ్యాడు. అయినప్పటికీ తర్వాతి మ్యాచ్‌ల్లో అతను అద్భుత ప్రతిభ కనబరిచాడు. అయితే కోహ్లీ మరో గాయానికి గురికావడం అతనిపై పడిన పని ఒత్తిడిని తెలియజేస్తోంది. ఒకవేళ రెండో టీ20లో టీమిండియా గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంటే కేప్‌టౌన్‌లో జరగనున్న చివరి, మూడో టీ20కి కోహ్లీ విశ్రాంతి తీసుకునే అవకాశముంది. ఎందుకంటే రాబోయే మూడు నెలల్లో టీమిండియా ఎడతెరిపిలేని షెడ్యూల్‌లో పాల్గొననుంది. ఒకవేళ రెండో టీ20కి కోహ్లీ దూరమైతే అతని స్థానంలో కేఎల్ రాహుల్‌కు జట్టులో చోటు దక్కే అవకాశముంది. గత మ్యాచ్‌లో మనీష్ పాండే కోసం రాహుల్ పక్కన కూర్చున్నాడు. కానీ ఇప్పుడు కోహ్లీ ఫిట్‌నెస్ సమస్యల వల్ల రాహుల్‌కు చోటు దక్కనుంది. అయితే టీమిండియా తుది జట్టులో ఇదొక్క మార్పే ఉంటుందని అనుకోవడానికి వీల్లేదు. వాండరర్స్ మాదిరిగా ఈ సూపర్‌స్పోర్ట్ పార్క్ పిచ్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశముండడంతో ఎడమ చేతి స్పిన్నర్ జైదేవ్ ఉనద్కట్‌కు మరోసారి తుది జట్టులో చోటు కల్పించే అవకాశముంది. టీమిండియా పర్యటన అంతా ఈ సూపర్‌స్పోర్ట్ పార్క్ పిచ్.. స్లోగా స్పందించింది. మరోసారి అలాంటి స్వభావం కనబరిచే అవకాశముంది. దీంతో టీమిండియా ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగనుంది. చినమన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్‌కు మళ్లీ తుది జట్టులో చోటు కల్పించే అవకాశముంది. మరోవైపు ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడని అక్షర్ పటేల్‌కు తన సత్తా చాటుకునే అవకాశాన్ని టీమిండియా కల్పించనుంది.

రైనాకు నం. 3 దక్కుతుందా?



సురేష్ రైనాకు పదోన్నతి కల్పించి తొలి టీ20లో మూడో నంబర్ స్థానంలో బరిలోకి దించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఒకవేళ ఈ మ్యాచ్‌కు కోహ్లీ అందుబాటులోకి వస్తే అదే స్థానంలో రైనా ఆడతాడా అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. జొహన్నెస్ బర్గ్‌లో టీమిండి యా మేనేజ్‌మెంట్ పరిస్థితులను ముందుగానే పసిగట్టింది. ఈ క్రమంలో రైనాకు పదోన్నతి కల్పించి అటాకింగ్ గేమ్ ఆడాలని కోరింది. ఆ పిచ్‌పై కోహ్లీ సేన 200కుపైగా పరుగులు సాధించింది. తన మూడో నంబర్ స్థానాన్ని రైనాకిచ్చిన కోహ్లీ మిడిలార్డర్‌లో బరిలోకి దిగాడు. అంతేకాదు తనదైన శైలిలో బ్యాటింగ్ ఆడేందుకు రైనాకు కోహ్లీ పూర్తి స్వేచ్ఛ కూడా ఇచ్చాడు.

మరోసారి ఒత్తిడిలో సౌతాఫ్రికా

గత మంగళవారం సౌతాఫ్రికా జట్టు చావో రేవో పరిస్థితిని పోర్ట్ ఎలిజబెత్‌లో ఎదుర్కొంది. మరో ఎనిమిది రోజుల తర్వాత ప్రొటీస్‌కు మరోసారి అదే పరిస్థితి ఎదురైంది. టీమిండియా నుంచి ఎదురవుతున్న అత్యధిక సవాల్‌ను ఎదుర్కొనేందుకు ఆతిథ్య జట్టు కొత్త ముఖాలపైనే ఆధారపడుతోంది తప్ప తగిన బలాన్ని సమకూర్చుకోవడం లేదు. సౌతాఫ్రికా జట్టుకు బలంగా ఉన్న ఏకైక సీనియర్ ప్లేయర్ ఏబీ డివిలియర్స్ కూడా ఇప్పుడు గాయం కారణంగా దూరమయ్యాడు. కానీ సౌతాఫ్రికా క్రికెట్ జట్టు డివిలియర్స్‌కు ప్రత్యామ్నాయాన్ని ప్రకటించలేదు. కనుక జట్టులో ఉన్న వారిలోనుంచే కెప్టెన్ జేపీ డుమిని ఒక పరిష్కారాన్ని వెతుక్కోవాలి. తొలి టీ20లో షార్ట్ పిచ్ బంతులతో టీమిండియాను దెబ్బతీయాలన్న ప్రొటీస్ తాత్కాలిక కెప్టెన్ డుమిని ఎత్తుగడ బెడిసికొట్టింది. ఇటువంటి పరిస్థితుల్లో తొలి మ్యాచ్‌లో ఆడే జట్టుతోనే బరిలోకి దిగే అవకాశముంది. సెంచూరియన్‌లోనూ డుమిని షార్ట్ పిచ్ బంతి ఎత్తుగడను వేసే అవకాశముంది. పిచ్ సహకరిస్తే సరే.. లేదంటే డుమిని ప్లాన్-బితో బరిలోకి దిగాల్సివుంటుంది.



విరాట్ ఖాతాలో అరుదైన రికార్డు

వన్డేల్లో కోహ్లీకి 909 పాయింట్లతో టాప్ ర్యాంకింగ్

బౌలర్ల ర్యాంకింగ్స్‌లో బుమ్రాకు సంయుక్త అగ్రస్థానం

టీమ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియాకు నంబర్ వన్

ఐసీసీ తాజా ర్యాంకింగ్స్

సెంచూరియన్: రికార్డులను బద్దలు కొట్టడాన్ని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అలవాటుగా పెట్టుకున్నాడు. కానీ ఇది ప్రత్యేకం. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో కోహ్లీ ఖాతాలో మరో రికార్డు చేరింది. ఐసీసీ విడుదల చేసిన తాజా వన్డే బ్యాటింగ్ రేటింగ్స్‌లో కోహ్లీకి అత్యధికంగా 909 పాయింట్లతో టాప్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. 27 ఏళ్లలో ఇంతటి అత్యధిక పాయింట్లు సాధించిన తొలి క్రికెటర్‌గా కోహ్లీ రికార్డుల్లోకెక్కాడు. ఆసక్తికరమైన అంశమేంటంటే.. అన్ని ఫార్మాట్లలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఏకైక బ్యాట్స్‌మన్ కూడా కోహ్లీనే. వన్డేల్లో టాప్ ర్యాంక్‌లో ఉన్న కోహ్లీ టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియాకు చెందిన స్టీవ్ స్మిత్ (947) తర్వాత 912 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. టీ20ల్లో బాబర్ ఆజామ్ (786), ఆరోన్ ఫించ్ (784) తర్వాత 776 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. 1991లో డీన్ జోన్స్ తర్వాత కోహ్లీ మాత్రమే అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించాడు. గతంలో వివియన్ రిచర్డ్స్ (1985లో 935), జహీర్ ఖాన్ 1983లో 931), గ్రెగ్ చాపెల్ (1981లో 921), డేవిడ్ గోవర్ (1983లో 919), జావెద్ మియాందాద్ (1987లో 910) అత్యధిక పాయింట్లు సాధించారు. అయితే 900 పాయింట్ల మార్క్‌ను చేరుకున్న భారత తొలి క్రికెటర్‌గా కోహ్లీ నిలిచాడు. అయితే సచిన్ టెండూల్కర్ రికార్డు కంటే 22 పాయింట్లతో కోహ్లీ ముందున్నాడు. 1998 జనవరిలో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్ తర్వాత సచిన్‌కు 887 పాయింట్లు వచ్చాయి. కాగా వన్డే బౌలర్స్ ర్యాంకింగ్స్‌లో జస్‌ప్రీత్ బుమ్రా సంయుక్త టాప్ ర్యాంక్‌ను సాధించాడు. 787 పాయింట్లతో బుమ్రా, ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన రషీద్ ఖాన్ అగ్రస్థానంలో ఉన్నారు. కాగా వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా 123 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. సౌతాఫ్రికా, ఇంగ్లండ్ జట్లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

చికెన్ రెజాల, దాల్ మఖిని కావాలి

సౌతాఫ్రికాలో భారత్ వంటకాలను ఆస్వాదిస్తున్న కోహ్లీ సేన

జొహన్నెస్‌బర్గ్: విదేశీ పర్యటనల్లో తమకిష్టమైన వంటకాలను చేయించుకుని మరీ తినడంలో కోహ్లీ సేనకు సాటి మరొకటి లేదు. డ్రెస్సింగ్ రూమ్‌కు తెచ్చిన వంటకాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన భారత క్రికెటర్లు భారత కేటరర్స్‌కు తమ రుచులను తెలిపారు. అచ్చం ఇంట్లో చేసినట్టు ఉండాలని చెప్పి మరీ చేయించుకుని ఆరగించారు. ఇరు జట్లకు వంట చేసి అందించే స్థానిక కేటరింగ్ సంస్థ ఇప్పుడు ప్రొటీస్‌కు మాత్రమే వంట చేయనుంది. కోహ్లీ సేనకు వంట చేసి వడ్డించే పనిని సౌతాఫ్రికాలోని ఇండియన్ రెస్టారెంట్‌కు అప్పగించారు. దీంతో నాన్‌వెజ్‌లో చికెన్ రెజాల, లాంబ్ సెయాల్, వెజిటేరియన్‌లో రెండు రకాల వంటలు దాల్, దాల్ మఖిని, పాలక్ పనీర్, గోబి మసాల, బట్టర్ నాన్, బాస్మతి రైస్‌ను వండాల్సిందిగా ఆర్డరిచ్చారు. 'స్థానిక కేటరర్ వంటకాలకు క్రికెటర్లు అసంతృప్తిగా ఉన్నారు. దీంతో టీమిండియా ప్లేయర్స్‌కు, అధికారులకు వంట చేసే పనిని మాకు అప్పజెప్పారు' అని గీత్ రెస్టారెంట్ మేనేజర్ చెప్పారు.

అందుకే చాహల్ అద్దాలు పెట్టుకుంటాడు

కారణాలు వివరించిన యజ్వేంద్ర తండ్రి



ముంబై: టీమిండియా లెగ్ బ్రేక్ బౌలర్ యజ్వేంద్ర చాహల్ ఫీల్డింగ్ సమయంలో అద్దాలు పెట్టుకోవడం మొదలుపెట్టాడు. సౌతాఫ్రికాతో జరిగిన తొలి టీ20 లో చాహల్ అద్దాలు పెట్టుకున్నాడు. దీనిపై హరియాణాలోని అతని తండ్రిని అడిగితే ముందస్తు జాగ్రత్తగా ధరిస్తున్నాడని ఆయన చెప్పారు. 'సౌతాఫ్రికా పర్యటనకు ముందు కంటి డాక్టర్‌ను కలిశాం. అప్పుడప్పుడు అద్దాలు పెట్టుకోమని డాక్టర్ సూచించారు. బౌలింగ్, బ్యాటింగ్ సమయాల్లో పెట్టుకోడు. కానీ ఒక్క ఫీల్డింగ్ సమయంలో మాత్రమే పెట్టుకుంటాడు. అతనికి చూపు మాంద్యం లేదు. కానీ ప్రభుత్వ మెడికల్ టెస్టుకు వెళ్లినప్పుడు అద్దాలు తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. అందుకే అవి పెట్టుకుంటున్నాడు' అని చాహల్ తండ్రి వివరించారు. ఆదాయపు పన్ను శాఖలో చాహల్‌కు ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం లభించిందని.. సౌతాఫ్రికా పర్యటన నుంచి రాగానే అందులో చేరతాడని ఆయన తెలిపారు.



నంబర్ వన్ లక్ష్యం

హైదరాబాద్ స్టార్ షట్లర్ సింధు

ముంబై: ఈ ఏడాది చివరి కంతా ప్రపంచ నంబర్ ర్యాంక్ సాధించడమే తన లక్ష్యమని హైదరాబాద్ స్టార్ షట్లర్ పి.వి.సింధు చెప్పింది. 2018ని గొప్ప సంవత్సరంగా భావిస్తున్న సింధు గతేడాది ఈ టాప్ ర్యాంక్‌ను తృటిలో మిస్సయింది. 'ఇది గొప్ప సంవత్సరం. తర్వాత బర్మింగ్‌హామ్‌లో ఆల్ ఇంగ్లండ్ జరగనుంది. అంతేకాదు కామన్వెల్త్ గేమ్స్, ఆసియా గేమ్స్ కూడా ఉన్నాయి. ఒక్కో టోర్నీని మాత్రమే లక్ష్యంగా పెట్టుకోవాలనుకుంటున్నాను. ఈ ఏడాది చివరి నాటికి నన్ను నేను నంబర్ వన్ ర్యాంక్‌లో చూడాలనుకుంటున్నాను' అని సింధు చెప్పింది. ఒలింపిక్స్, వరల్డ్ చాంపియన్‌షిప్ రజత పతక విజేత ఇటీవల ఫైనల్ వరకు వచ్చి ఓడిపోతోంది. 2016 రియో ఒలింపిక్స్‌లో, గతేడాది దుబాయ్ సిరీస్‌లో సింధు ఫైనల్స్‌లో పరాజయంపాలైంది. దీనిపై ఆమె స్పందిస్తూ.. 'ఫైనల్ వరకు రావడం శుభ పరిణామం. కానీ వరల్డ్ చాంపియన్‌షిప్, దుబాయ్ ఓపెన్, ఇండియా ఓపెన్ టోర్నీల్లో టైటిల్‌కు దగ్గరగా వచ్చి ఓడిపోవడం చాలా నిరుత్సాహానికి గురి చేసింది. నేను తప్పుల నుంచి ఇంకా అనేక విషయాలు నేర్చుకోవాల్సివుంది. జీవితంలో ఒడుదుడుకులు మామూలే. ఫైనల్ వరకు వచ్చి ఒక్క పాయింట్ తేడాతో ఓడటం పెద్ద విషయమేమీ కాదు. ఒక్కో టోర్నీ ఒక్కో విధంగా ఉంటుంది. ముఖ్యంగా వరల్డ్ చాంపియన్‌షిప్. ఆ ఫైనల్ చాలా సేపు జరిగింది. నా కెరీర్‌లో అదే అతి పెద్ద మ్యాచ్' అని సింధు పేర్కొంది. ఎడతెరిపిలేని మ్యాచ్‌లపై కూడా సింధు స్పందించింది. ఏయే టోర్నీల్లో ముందుగానే ఎంచుకుని పాల్గొనాలని చెప్పింది. అనారోగ్యంతో ఉన్నా, పూర్తి ఫిట్‌నెస్ లేకపోయినా బరిలోకి దిగలేమని ఆమె పేర్కొంది.

21 పాయింట్ల ఫార్మాటే ఉత్తమం: శ్రీకాంత్



బ్యాడ్మింటన్‌లో 11 పాయింట్ల విధానాన్ని కిదాంబి శ్రీకాంత్ వ్యతిరేకించాడు. 21 పాయింట్ల విధానాన్నే కొనసాగిస్తే బాగుటుందన్నాడు. బ్యాడ్మింటన్‌లో సమూల మార్పులు చేయాలని వరల్డ్ ఫెడరేషన్ ఆలోచిస్తోంది. మూడు గేమ్‌లు, 21 పాయింట్లకు బదులు ఐదు గేమ్‌లు 11 పాయింట్ల విధానాన్ని తీసుకురావాలని బీడబ్ల్యూఎఫ్ భావిస్తోంది. దీనిపై ఈ ఏడాది మే 19న బ్యాంకాక్‌లో జరగనున్న వార్షిక సమావేశంలో బీడబ్ల్యూఎఫ్ ప్రతిపాదన చేస్తుంది. తర్వాత చర్చ, ఓటింగ్ జరిగిన అనంతరం తుది నిర్ణయం వెలువడే అవకాశముంది. 'ఏవేవో సంగతులను వింటున్నాను. కానీ అధికారికంగా నాకు ఎలాంటి సమాచారమూ లేదు. 11 పాయింట్ల విధానం గురించి రెండేళ్ల క్రితం నన్ను అడిగారు. 11 పాయింట్ల ఫార్మాట్‌ను నేను ఎన్నడూ ఆడలేదు. 21 పాయింట్ల విధానమే ఉత్తమమని నా అభిప్రాయం. దానినే నేను సమర్థిస్తాను' అని శ్రీకాంత్ చెప్పాడు. సర్వీస్ రూల్‌ను మార్చడంపై కూడా తెలుగు తేజం స్పందించాడు. పొట్టి వాళ్లకంటే పొడుగు వాళ్లకే దీని వల్ల నష్టం ఏర్పడుతుందన్నాడు. 'ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ నుంచి కొత్త సర్వీస్ రూల్ ప్రారంభమవుతుంది. అయితే ఇది ఎక్కువ మందిపై ప్రభావం చూపదు. ఆరడుగులపైగా ఎత్తున్న వాళ్లకే నష్టం జరుగుతుంది' అని శ్రీకాంత్ అన్నాడు. ఎంతో కీర్తి ప్రతిష్టను సాధించి పెట్టిన 2017లో శ్రీకాంత్ తృటిలో నంబర్ వన్ ర్యాంక్‌ను కోల్పోయిన సంగతి తెలిసిందే. అయితే అతను ఇప్పటికీ ఆశావహంగా ఉన్నాడు. 'నేను పూర్తిగా మిస్ కాలేదు. నాకు ఇంకా చాలా అవకాశాలున్నాయి. రాబోయే మూడు నాలుగు నెలల్లో టైటిళ్లు గెలవడం ద్వారా తప్పకుండా నంబర్ వన్ అవుతాను' అని శ్రీకాంత్ చెప్పాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.